భారతి

సంపుటము 23 | డిసెంబరు, 1946 | సంచిక 12

వ్యయ మార్గశీర్షము

దీక్ష

= శ్రీ బాలగంగాధర తిలక్ =

నా తొలిపాటలోన లలనా! వివశ మ్మయినావుగాని యీ
కాతరమైన జీవనము గాంచగలేదు, ముహుర్ముహుశ్శ్వస
ద్వాతకవోష్ణతన్ వడలి వాడిన కింశుకమాల కంఠమం
దాతురతన్ వియోగభయదాకుల జానకివోలె వ్రేలుటన్.

ఈ కనుగోన చిట్లినది ఏ తపనాబ్ధి మథించినట్టి వా
శ్లోకమొగాని రాజ్ఞి! మధులోలుపసుందరముల్ వసంతసు
శ్రీ కమనీయతల్ విరియు జీవితమందున ఎంత ఎంత బా
ధాకరుణమ్ము నిల్చినది ధాత్రికి మైత్రికి జీవగర్రనై!

ఏ పరమార్థ మీమెడద నింతకు నిండినదో—సదా ప్రభా
వ్యాపృతమై కనుంగవల నల్లన చల్లగ నొత్తు దేవతా
వేపథుపాణిపంకజము; వెన్నెలనీటి నురుంగు చిమ్మిపోన్
దాపయి ఆడిపోవు హరనాట్య పదధ్వని మ్రోయు నాత్మలో!

ఆ మహితాశయమ్ము బలమై నడిపింపగ నీవు నేను న
స్తోమగిరాంపదాకృపిత సుందరమైన మనస్సులన్ ధరి
త్రీమధురాంకమందు పచరింతము ప్రేమవిలోల గానముల్
శ్రీమదనంత విశ్వసరసీరుహ మంతట రేకు విప్పగన్.

ప్రోషితభర్తృక

❁

— శ్రీ శివరామరావు —

నెలకు నెల దాటె నీ వేగి- వలపు లీగి;
వికచవకుళప్రసూన మాలికలు వాడ
త్వత్సఖీ మానసములతో; ద్వారవతిని
మరచినావా! నామాటయే గురుతురాదో!

చెలిచెంగల్వయెడందలో వలపు విచ్చెన్, వచ్చె జాబిల్లి వె
న్నెలక్రొత్తెన్నెల; జాజిగుండె నెరితేనెల్ నిండ, వయ్యారి పా
టలతో తేటియు వచ్చె; నాబ్రతుకుబాటన్ తేనె లందీయ, వె
న్నెల కాయన్,మరి నీవు వచ్చు టెపుడో- నీరేజపత్రేక్షణా!

నీ వాలింపని పాట లెందుకని వీణెల్ మ్రోగనే మ్రోగ; వో
దేవా! పల్కుట మానె రాచిలుకలున్; దీనత్వమే తోచు నీ
పూవుందోటల, సౌధవాటికల; రావో, మమ్ము పాలింపవో!
ఈవైముఖ్య మిదింక నీకు తగదోయీ,ధూర్తగోపాలకా!

అది నీ చిక్కని నవ్వు పాల్కడలి పొంగై,మాతయే లేని కట్
తుదలో తూగుచు నుండు; నీమొలుగో- యేదో వేదనాదమ్ము-నె
మ్మదిలో మ్రోగుచు నుండు; నీతలపె సుమ్మా ప్రేమమై నేడు నా
బ్రదుకై సాగుచునుండు; నీవెరుగలేవా, సర్వలోకేశ్వరా!

గడపగడప కన్నుగ ద్వారకాపురమ్ము
చూచుచుండ నీకోసమే; వేచియుంటి
ప్రణయమెల్ల తావకపదార్పణము చేసి;
రమ్ము-వేవేగ మ మ్మేలుకొమ్ము-దేవ!

సంస్కృత వ్యాకరణము

౧

= శ్రీ గరికపాటి కృష్ణమూర్తి =

సంస్కృత భాషకు నవవ్యాకరణాలు ఉండేవిట. ఇప్పుడుమాత్రం పాణినీయవ్యాకరణమే అధికారపదంలో ఉంది. ఏ చంద్రవ్యాకరణంచేతనో, ఇంద్రవ్యాకరణంచేతనో ఒక శబ్దము సాధువు అయినప్పటికీ అది అపాణినీయమైతే వైయాకరణులు దాన్ని గ్రహించటం లేదు.

ఈ పాణినీయవ్యాకరణానికి ముగ్గురు మూలపురుషులు.

౧. పాణిని:—ఈయన ౮ అధ్యాయాలలో వ్యాకరణసూత్రాలు రచించాడు. దానిపేరు అష్టాధ్యాయి. శాస్త్రమంతా దీనిమీద ఆధారపడిఉంది. పాణిని క్రీస్తుపూర్వం ౯౦౦ సం.లో ఉన్నాడని 'వైద్య' మొదలైనవారు; క్రీస్తుపూర్వం ౪-వ శతాబ్దంలో అని కీత్ వగైరాదొరలు. ఈ ౯౦౦, ౪౦౦ సం. మధ్య తారీకులు ఇంకా కొంతమంది చెప్పారు. ఈ తారీకులు నిర్ణయించటానికున్న సాక్ష్యము అందరికీ ఒకటే. తారీకులుమటుకు ఎవరి చిత్తంవచ్చినట్టు వారిచ్చారు. తెల్లవారు యెంతసేపూ గ్రీకువిజ్ఞానంకంటె అర్వాచీనము హైందవవిజ్ఞానము అని బుజువుచెయ్యాలని చూస్తారు. మన దేశస్థులు మన విజ్ఞానం యెంతో ప్రాచీనమని బుజువుచెయ్యాలని ఆతురతపడతారు.

పాణిని 'శలాతుర' అనే ఊళ్లో పుట్టాడు. ఆయనతల్లి దాక్షి. తండ్రి శలంకుడు. తక్షశిలానగరంలో ఈయన చదివి ఉంటాడనీ, వాత్సభార్గవగోత్రోద్భవుడనీ చరిత్రకారులు చెప్పుతారు. పాణిని అడివిలోనుంచి పోతున్నప్పుడు ఆయనమహిమ తెలియని సింహం ఒకటి ఆయన్ని చంపింది. అని ఒకకవి వ్రాశాడు.

౨. వ్యాకరణనిర్మాతలలో రెండవ ఆయన కాత్యాయనుడు. పాణినికంటె రెండుమూడువందలఏళ్ల తరువాత ఈయన్ని చరిత్రకారులు జన్మింపజేశారు. కథాసరిత్సాగరంలోని కథ దీనికి భిన్నం. అది యిలా వుంది.

కాత్యాయనుడు కౌశాంబి అనే వూళ్లో సోమదత్తుడికీ, వసుదత్తకూ పుట్టాడు. ఆయన ఒక్కసారి వింటే చాలు ఇక మఱచిపోడు. అందువల్ల శ్రుతధరుడు అనే పేరు ఉంది.

పాణిని, కాత్యాయనుడు సమకాలికులు. ఇద్దరూ వర్షోపాధ్యాయుడి శిష్యులు. కాత్యాయనుడు ఇంద్రవ్యాకరణం బాగా చదివాడు. పాణిని మందబుద్ధి. అంతా గేలిచేసేవాళ్లు. ఆయన ఈబాధ పడలేక తపస్సుచేసి శివానుగ్రహంవల్ల వ్యాకరణశాస్త్రం సంపాదించాడు. ఆతరువాత కాత్యాయనుడూ, పాణినీ వాదంవేసుకున్నారు. వారంరోజులు గడిచింది. ఎవరూ నెగ్గేటట్టు కనపడలేదు. అప్పుడు భక్తానుగ్రహార్థం శివుడు గట్టిగా గర్జించితే కాత్యాయనుడు తన ఇంద్రవ్యాకరణం

అంతా మఱిచిపోయాడు. పాణిని గెలిచాడు. కాత్యాయనుడుకూడా తరువాత శివాను గ్రహం సంపాదించి, పాణినివ్యాకరణం పూర్తి చెయ్యవలసినదని శివుడిఆజ్ఞ పొంది, వార్తి కాలు వ్రాశాడు.

మూడో ఆయన పతంజలి. గోణికా పుత్రుడు అని కొందరు. కాదని కొందరు. గోనర్ద దేశంలో పుట్టాడు. పుష్పమిత్రుడు అనే రాజుపేరు మహాభాష్యంలో కనపడు తుంది. గుప్తవంశంలోని రాజు ఈయన. వాయుపురాణంలో ఈ రాజవంశం అంతా చెప్పాడు. బృహద్రథు డనే రాజుతరువాత పుష్పమిత్రుడి పేరు ఉంది. దీన్నిబట్టి పతం జలితారీకు క్రీస్తుపూర్వం ౨౦౦ సం.లని డా. కుంతేగారు. ఇంకొకరు ౮౦౦ అని, కీత్ వగైరాలు ౧౫౦ అని.

పతంజలి సూత్రాలకి, వార్తికాలకి భాష్యం వ్రాశాడు. అదే మహాభాష్యం. రచన అతిగంభీరంగా ఉంటుంది. దానికి సాటిలేదు. "మహారాజ్యంవా పాలయేత్, మహాభాష్యం వా పాఠయేత్"—అంటే పరిపాలిస్తే మహా రాజ్యమే పరిపాలించాలి, పాఠంచెపితే మహా భాష్యమే చెప్పాలి అనే బుద్ధి ఉపాధ్యా యులకు కలిగించింది ఈగ్రంథం.

పతంజలి ఆదిశేషువుఅవతారమని సాంప్రదాయకులు నమ్ముతారు. యోగ శాస్త్రం, వైద్యశాస్త్రంకూడా పతంజలి వ్రాశాడని ప్రతీతి. "యోగేన చిత్తస్య పదేన వాచాం మలం శరీరస్యతు వైద్యకేన, యోఽపాకరోత్తం ప్రవర ంమునీనాం పతం జలిం ప్రాంజలి రానతోఽస్మి" అనే శ్లోకం ఈప్రతీతికి ఆధారం. చరిత్రకారులు కొంత మంది ఈఆధారం చాలదు అని అన్నారు.

పాణిని కాత్యాయన పతంజలులు సూత్ర వార్తిక భాష్యకారులు. ఈ ముగ్గురూ సంస్కృత వ్యాకరణ నిర్మాతలు. వీరికి మునుల హోదాను ఇచ్చారు వైయాకరణులు. పాణినిలోపాలు కాత్యాయనుడు సవరిం చాడు. వీరిద్దరివీ పతంజలి సవరించాడు. కాబట్టి పతంజలిమాటలకు ఎక్కువ ప్రామాణ్యం ఉంది. "యథోత్తరం మునీ నాం ప్రామాణ్యమ్" అని వైయాకరణ సమ యము. పాణిని కాత్యాయనులలో తేడా ఉంటే కాత్యాయనుడి మాటే నెగ్గుతుంది. వారిద్దరికంటే పతంజలిది పైచెయ్యి-వా రేమి చెప్పినా సరే.

దక్షిణభారతదేశంసంగతి పాణినికి తెలియదనీ, కాత్యాయనుడి నాటికి దక్షిణ దేశానికి ఆర్యులు వలసవచ్చారనీ చరిత్ర కారుల నిర్ణయము. ఇలా వీరు చెప్పటానికి కారణం: ఒక సూత్రంలో కొన్ని దేశాల పేర్లు పాణిని చెప్పాడు. కాత్యాయనుడు వాటిలో చోల, కేరల దేశాల పేర్లుకూడా కలప మన్నాడు. పరిశోధకులు తమ వాదన సమ ర్థించుకొనేందుకు కాత్యాయన వార్తికాలు పాణిని later edition అనీ, అంటే పాణిని నాటికి తెలియబడనివి, కాత్యాయనుడి నాటికి తెలియబడ్డవి, ఇవిమాత్రమే కాత్యా యనుడు వ్రాశాడు అనీ అంటారు. కాని ఇది సరికాదు. వార్తిక నిర్వచనమే 'ఉక్తా నుక్త దురుక్త చింతాకరత్వం'-చెప్పినవి సరి చూడటం, చెప్పనివి చెప్పటం, తప్పుచెపితే తీసివెయ్యటం. ఇదికాక, వేదంలోని కొన్ని శబ్దాలను పాణిని చెప్పకుండా విడిచిపెడితే కాత్యాయనుడు వాటికి వార్తికాలు వ్రాసు కున్నాడు.

పాణినికి దక్షిణ భారతదేశం సంగతి తెలియదని పరిశోధకులు వ్రాసిన మాట కూడా నమ్మటానికి వీలుగా కనపడలేదు. 'వరణాదిభ్యశ్చ' (౪-౨-౮౨) అనే సూత్ర ముంది. అందులో వరణ మొదలైన నదుల పేర్లు కొన్ని చెప్పాడు. వాటిలో తామ్ర పర్ణి, గోద, పంపా కూడా చెప్పాడు పాణిని. ఇవన్నీ దక్షిణదేశంలోని నదులని అందరకూ తెలిసిన విషయమే. దీనికి చరిత్రకారులు ఏమి చెపుతారో! ఇదికాక 'దక్షిణాపథ' అనే శబ్దం 'ధూమదిభ్యశ్చ' (౪-౨-౧౨౭) అనే సూత్రంలో గణంలో ఉన్నది. ఈ గణంలో చాలావరకు దేశవాచి శబ్దములే. వాత్స్యాయన కామసూత్రాల్లో దక్షిణాపథ శబ్ద ముంది. వ్యాఖ్యాత 'వింధ్యకు దక్షిణంగా ఉన్న దేశం' అని అర్థం వ్రాశాడు. 'స్వామికుమార' దర్శనంకొరకు ఒకాయన దక్షిణాపథం వెళ్లాడు అని కథాసరిత్సాగరంలో ఉంది. కుమారస్వామి దక్షిణా దినే గదా ఉన్నది. 'కిష్కింధాగుహా' అని పారస్కరగణంలో (౬-౧-౧౫౭) పాణినిలో ఉన్నది. 'కిష్కింధా' అనే పేరు ఇంకొకచోట (౪-3-౯౪) సింధు, తక్షశిలా వగైరాలతో చెప్పాడు. ఇక్కడ కిష్కింధా శబ్దం దేశవాచి అయిఉండాలి. సుగ్రీవుడి కిష్కింధ వింధ్యకు దక్షిణమనే చాలామంది అభిప్రాయం. 'లంకా' అనే శబ్దం పాణినిలో కనబడుతుంది (౪-౧-౧౫౮). ఇంకొకచోట 'ఇంద్రప్రస్థం' తోపాటు 'కాంచీప్రస్థం' అనే శబ్దం కనబడుతుంది. ఈ కాంచీప్రస్థం ఎక్కడిదో!

పాణిని వ్రాయదలచుకున్నది భూగోళ వాచకం కాదు. ఏదో ఒకదేశం పేరు అష్టాధ్యాయిలో లేనంతమాత్రాన ఆదేశంసంగతి పాణినికిగాని, ఆకాలంలో ఇంకెవరికిగాని తెలియదనటం సాహసమే.

పాణినిరోజుల్లో భాష ఏమిటి? సంస్కృతం మాట్లాడేవారని కొందరు; లేదని కొందరు. ఈ మధ్య ఒకరు "సంస్కృతభాష ఏనాడూ ఎవరూ మాట్లాడలేదు. అది కేవలం కృత్రిమభాష. దాని ప్రయోగం పుస్తకంలోనే" అన్నారు. ఈ వాదం ఎక్కువగా విచారించనవసరంలేదు.

పాణిని వేదంకానిదానికి 'భాషా' అని ప్రయోగిస్తాడు. 'సంస్కృతభాషా' అని ఎక్కడా చెప్పలేదు. ఇంకొక భాష ఏదీ ఉదాహరించడు. 'భాషా' అంటే సంస్కృతమే. 'ప్రత్యభివాదేఽశూద్రే' అనే సూత్ర ముంది. శూద్రభిన్నులకు ప్రత్యభివాదన చేస్తే ప్లుతం వెయ్యాలి అని దాని అర్థము. శూద్రులకు ప్రత్యభివాదన చేస్తే అక్కర లేదు అని అర్థాత్తు వస్తుంది. 'కుశలోఽసి తుషజక' అని పతంజలి సంస్కృతంలోనే ఉదాహరించుతాడు. ఈ తుషజకుడు శూద్రుడు. అతనికి "కుశలోఽసి తుషజక" అని పలకరిస్తే ఆరోజుల్లో అర్థమయ్యే దేమో. రామాయణంలో "బ్రాహ్మణఇవ సంస్కృతం వదన్" అని ఇల్వలుడిని ప్రవేశింపజేశాడు వాల్మీకి. అంటే బ్రాహ్మడిమాదిరి స్వచ్ఛంగా సంస్కృతం మాట్లాడుతూ వచ్చాడు - రాక్షస సంస్కృతం కాకుండా" అని అర్థంచెప్పవచ్చు. కాదు, ఆరోజుల్లో బ్రాహ్మణులే సంస్కృతం మాట్లాడేవారు అని చెప్పినా చెప్పవచ్చు. ఇటువంటి విషయాల్లో నిర్ణయం వివక్షాధీనం.

పాణినిరోజుల్లో, పతంజలిరోజుల్లోకూడా సంస్కృతం మాట్లాడేవారని ఊహించేందుకు అవకాశం ఉంది. 'పిల్లలను తినేదానా' అని తిట్టవలిసివస్తే ఒక తకారం ఎక్కువ వెయ్యాలి అన్నాడు పాణిని. 'పుత్త్రాదినీ త్వమసి పాపే' అనాలి. నిజంగా పిల్లలను తినేదాన్ని గురించి చెప్పినప్పుడు ఒక తకారమే ఉండాలి. పాము తన పిల్లలనే తింటుంది కాబోలు, ఆసంగతి చెప్పినప్పుడు 'పుత్రాదినీ సర్పిణీ' అనాలి. ఇలాగే పరిహాసంలో 'మన్' ధాతువుకు ఉత్తమపురుషైకవచనమందే ప్రయోగం విధిస్తాడు. మాట్లాడని భాషకు ఇన్నిపాట్లు ఆయన పడ్డాడంటే నమ్మలేము.

పతంజలికాలంలోకూడా సంస్కృతభాష మాట్లాడేవారు అని చెప్పటానికి వీలు కనపడుతున్నది. "కొన్ని శబ్దాలు ఒక దేశంలో ఒక అర్థంలో మాట్లాడుతారు. ఇంకొక దేశంలో వాటిని ఇంకో అర్థంలో వాడుతారు. శవధాతువును గమనార్థంలో 'కంభోజ దేశం'లో వాడుతారు. ఆర్యులు 'గమ్' ధాతువునే వాడుతారు. వారికి శవమంటే మృతకళేబరమే. సురాష్ట్రదేశంలో 'హమ్మ' ధాతువును, ప్రాచ్యమధ్యదేశంలో 'రంహ' ధాతువును గమనార్థకంలో వాడుతారు." అని దేశభేదాన్ని బట్టి సంస్కృతభాషలో కలిగిన మార్పులు కొన్ని పతంజలి చెప్పాడు.

'యర్వాణః, తర్వాణః' అనే ఋషులున్నారు. వారిని ఎవరో అడిగారుకాబోలు, "ఎలా కాలక్షేపం చేస్తున్నా"రని. "యర్వాణః, తర్వాణః" అని సమాధానం చెప్పారు. వాళ్లకు ఆపేరు వచ్చింది. "యద్వానః; తద్వానః" అని సమాధానం చెప్పవలసిఉంది. అంటే "ఉన్నదాంతో సరిపుచ్చుకుంటున్నాము" అని అర్థం. కాని వాళ్లు, "యర్వాణః, తర్వాణః" అని అపశబ్దం ప్రయోగించారు. అందుకని వాళ్లని ఆపేరు పెట్టి పిలిచేవాళ్లు. ఇది పతంజలి చెప్పిన విషయం.

ఌకార ప్రయోగవిషయం చాలా తక్కువ. క్లృప్ ధాతువులోనే కనపడుతుంది. అలాగున్నప్పుడు ఌకార మెందుకయ్యా ఉపదేశించటం అని ప్రశ్న వచ్చింది. 'అశక్తిజానుకరణార్థం' అని సమాధానము. ఋతకుడు అని ఒకాయన ఉన్నాడు. ఒక బ్రాహ్మణికి ఆయన్ను ఋతకుడు అని పిలవటం చేతకాక 'ఌతకుడు' అంది. ఆవిడ, చేతకాక, ఋకారానికి ఌకారము ఇలా వాడింది అని ఆమెను అనుకరించిచెప్పాలంటే ఌకారం భాషలో లేకపోతే ఎలా చెప్తారు అని పతంజలి అన్నాడు.

సరస్‌శబ్దం ఉందిగాని సరసీశబ్దము ఎక్కడిది అని ప్రశ్నవచ్చింది. పతంజలి చెప్పాడు: "దక్షిణాపథంలో పెద్దపెద్ద సరస్సులకి 'సరసీ' శబ్దము వాడుతారు" అని. కొన్ని శబ్దాలు అప్రయుక్తములు అని చూపిస్తాడు.

వీటినిబట్టి చూస్తే సర్వసామాన్యంగా సంస్కృతభాష మాట్లాడేవారు అని అనిపించుతుంది. "కంభోజేషు భాషితః", "ఆర్యా భాషంతే" అని పతంజలి 'మాట్లాడుతారు' అని అర్థం వచ్చే ధాతువునేఉపయోగించాడు.

సంస్కృతం మాట్లాడితే మాట్లాడవచ్చు, మరి వ్రాసేవాళ్లా? అని తరువాతి ప్రశ్న.

యవనశబ్దముమీదనుంచి 'యవనానీ' అనే రూపం పాణిని చెప్పాడు. అది ఏఅర్థంలోనో ఆయన నిర్ధారణచెయ్యలేదు. కాత్యాయనుడు ఒక వార్త్తికం వ్రాసుకున్నాడు. 'యవనా ల్లిప్యామ్' - యవనుల లిపి అనే అర్థంలో యవనానీరూపం వాడాలి. యవన లిపి చెప్పినవాడు సంస్కృతలిపి ఎందుకు చెప్పలేదు అని శంక. 'లిపికరః, లిబికరః' అని రెండు రూపాలు 'వ్రాయసకాడు' అనే అర్థంలో పాణిని చెప్పాడు. ఏభాష లిపి అయిందీ చెప్పలేదు. అంటే ఇలా సమాధానం చెప్పవచ్చు. సంస్కృతం అనేమాట ఆయన వాడనేలేదు. అది వాడనప్పుడు సంస్కృతలిపి అని ఎట్లా వాడుతాడు? 'భాషా' అని అంటాడు. అంటే సంస్కృతమే. 'లిపి' అంటాడు. అంటే ఆ భాషాలిపే. సందేహానికి చోటు లేదు. పాణిని కాలంలో ఉన్న వస్తువుల జాబితా కాదు, పాణిని వ్రాసింది. శబ్దస్వరూపముయొక్క సాధుత్వాసాధుత్వనిర్ణయం చేశాడు. అయితే అన్నిశబ్దాల స్వరూపం చెప్పాడా? లేదు. ప్రతిపదమూ ఉచ్చరించి చెప్పటం మొదలుపెడితే తెమిలేపని కాదు ఇది. భాష్యకారుడు వ్రాశాడు—"బృహస్పతి ఇంద్రుడికి ప్రతిపదమూ ఉచ్చరించి పాఠం చెప్ప మొదలుపెట్టాడు. దివ్యవర్షసహస్రం గడచింది. ఈ శబ్దపారాయణం పూర్త్తికానేలేదు" అని. కాబట్టి పాణిని కొన్ని సామాన్యవిధులు చెప్పాడు. కొన్ని అపవాదగా (exception) చెప్పాడు. కొన్ని ప్రతిపదోక్తంగా చెప్పాడు. కొన్ని సంజ్ఞలు కల్పించి వాటిని నిర్వచించాడు. 'అనుబంధ'ములు చెప్పి వాటికి అనేక ప్రయోజనములు కల్పించాడు. ఈ విధంగా అతిక్లుప్తముగా సూత్రాలు రచించాడు. వ్యాకరణ సూత్రాలు ఉన్నంత క్లుప్తంగా మిగిలిన ఏసూత్రాలూ ఉండవు. సూత్రముమీద అర్థమే కనుపించదు. పైసూత్రంలోనుంచి కొన్ని శబ్దాలు అప్పుతెచ్చుకోవాలి. దీనిని 'అనుకర్ష' అంటారు. కొన్ని చోట్ల తరువాతఉన్న సూత్రాలలోనుంచి పై సూత్రానికి అప్పుతెచ్చుకోవాలి. అది 'అపకర్ష' అంటారు. ఇంకా కొన్నిచోట్ల పై సూత్రం మధ్య సూత్రాలను దాటి దూరాన్న ఉన్న సూత్రంలోకి దూకుతుంది. ఇది మండూకప్లుతి. "ప్రాఙ్ముఖుడై దర్భపవిత్రపాణియై చాలా కష్టపడి ఆచార్యుడు (పాణిని) ఈ సూత్రాలు వ్రాశాడు. వీటిలో ఇది అనర్థకము అని చూపించడానికి వీలుఉండదు." అని పతంజలి. ఇంత కష్టపడి ౪౦౦౦ సూత్రాలలో వ్యాకరణశాస్త్రం కుదించాడు. "అర్థమాత్రాలాఘవేన పుత్రోత్సవం మన్యంతే వైయాకరణాః"-ఉచ్చారణలో అర్థమాత్ర తగ్గించగలిగినా కొడుకుపుట్టినట్టు సంతోషించుతాడట వైయాకరణుడు. కాత్యాయనుడు, ఒకవార్త్తికంలో "లోకే వేదే"అంటే తీరిపోయేదానికి "లౌకిక వైదికేషు" అని ఎక్కువ అక్షరాలు చెప్పాడు. పతంజలి పరిహాసంచేశాడు: "ప్రియతద్ధితాః దాక్షిణాత్యాః" - దాక్షిణాత్యులకు తద్ధితరూపం యెక్కువ ఇష్టం అని ("లోకం" మీదనుంచి ("లౌకికం" తద్ధితరూపం).

పాణిని సూత్రాలు కొన్ని ఒక అక్షరమే. కొన్ని రెండు, కొన్ని అనేక శబ్దాలు కలవీ ఉన్నవి. "ఊ"(సూ); 'అఅ'(సూ)-ఈ విధంగా అతిగంభీరమైన శబ్దశాస్త్రం నిర్మించాడు. అంటే ఈయనే మొట్టమొదట వ్యాక

రణం రచించినవాడు అని చెప్పటం కాదు. పాణిని అనేకమంది వ్యాకర్తలను పేరుపేరునా చెప్పాడు. ఆపిశలి, శాకటాయన, గార్గ్య, స్ఫోటాయన, భాగురి వగైరాలు. వారందరి వ్యాకరణాలూ ఇప్పుడు లేవు. పాణినివ్యాకరణం అన్నిటినీ మరపింపజేసింది. వారి పేర్లు మిగిలినవి.

వేదానికి స్వరం ఉన్నట్టు పాణిని సూత్రాలకు కూడా పూర్వం స్వరం ఉండేదిట. ఇప్పుడు పోయింది. ధాతుపాఠానికికూడా స్వర ముండేదిట. ఇప్పుడు అదీ కనబడదు.

పాణిని లోకంలో ఉండే భాషను, వేదభాషనుకూడా వ్యాకరించాడు. లోకంలోని శబ్దాల సాధుత్వం పరిష్కరించాడు. వేదభాషకు అలా చెయ్యలేదు. "ఛందసి దృష్టా న విధిః"—వేదంలో ఉన్న శబ్ద స్వరూపం చూసి ఆరూపం తయారుఅయేందుకు సూత్రం చెప్పాడు. వేదశబ్దం మార్చేందుకు అధికారం ఎవరికీ లేదుకాబట్టి. వేదానికి 'ఛందస్' అని పాణిని ప్రయోగించుతాడు. వేదముకానిదానికి 'భాషా' అని వ్యవహరించుతాడు.



నిరంకుశాః కవయః

= శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి =

ఈశీర్షికతో ౧౯౩౮ లో ఆంధ్ర, భారతీ పత్రికలలో మూఁడు వ్యాసములు ప్రకటించియున్నాను. పూర్వకవుల ప్రయోగములే శరణముగా నేను రచియించిన ఆంధ్రభాషానుశాసనములోని ప్రయోగవిశేష ప్రకరణములో క్వాచిత్కము లగుటచే చేర్చని నన్నయార్యుని సాహసికప్రయోగము లైదా అందు చూపియున్నాను. ఇం దట్టివే తిక్కనాదులవి కొన్ని చూపి, భాషాసంప్రదాయసిద్ధము లైన మఱికొన్ని విచిత్రప్రయోగములను కూడ వక్కాణింతును.

౧. తిక్కనార్యుఁ డుత్తమపురుషక్రియావిభక్తిలోని ద్రుతమును లోపింపఁజేసి "సైరించితిని + ఈవు = సైరించితీవు ; పల్కితిని + ఇటు = పల్కితిటు" అని సంధి చేసి ప్రయోగించెను.

సీ. "ఆనినఁ గటకటఁబడి, యిట్టు లాడు కెల్ల
నతని విజయంబు పందియుం బనట గాక ?
ఇంతవట్టును సైరించి తీవు గాన
నింక నీమాట లుడుగుము కంకభట్ట !"

(విరా. ౫ - ౨౫౦)

ఉ. "గాండివి నొవ్వఁ బల్కితిటు
'కర్ణునిఁ జంపక వచ్చితేని త
మ్ముండవు గావు నాకు' నని..." (శాం.౧-౧౮)

ఈమహాకవినాఁటి కాంధ్రమునకు వ్యాకరణమంటూ ఒక గ్రంథము లేదు గాని, యితని యుత్తమకవితకు మార్గదర్శకమును, కావ్యభాషకు లక్ష్యలక్షణరూపము నైన నన్నయపర్వత్రయి లేదా? అం దిట్టిప్రయోగ మున్నదా? లేదు. ఇతని మహాగ్రంథములో మాత్ర మీరెండును తప్ప మఱియొక ప్రయోగ మిట్టిది కలదా? లేదు. అయితే, ఎందు కితఁ డిట్లు ప్రయోగించెను? నా కిట్లు తోఁచుచున్నది. ఉత్తరమండలములవారు "ఇచ్చా - చూచా - వస్తా" అని వాడునట్లే దక్షిణపశ్చిమమండలములవారు "ఇస్తి - చూస్తి-" అని పలుకుట ప్రసిద్ధము. "ఇస్తంటివి గాదయ్యా !" అని యామండలముల విన నచ్చును. వాడుకలోని యా ద్రుతలోపమునకు జ్ఞాపకముగా మన తిక్కన యీరెండు రూపములు ప్రయోగించియుండును. అంతే కాకున్న, కావ్యమునం దిట్టివి రుచింప వని తెలియనివాఁడా భాషామర్మజ్ఞుఁ డగు తిక్కనార్యుఁడు? అందుచే నీప్రయోగము నిరంకుశమో, సాహసికమో యనఁదగును గాని, ప్రామాదిక మనిమాత్ర మనరాదు.

ఎఱ్ఱనార్యుఁ డిది చూచియో కాఁబోలును, 'అగుదును'లోని ద్రుతమును పోఁగొట్టి యిట్లు సంధిచేసి ప్రయోగించియున్నాఁడు :

క. "విను నాథ కర్తల కాపద
లును శోకంబులును లేవు లోకంబున నెం
దును చేసె బ్రహన్నుఁడ నగు
దనుపమసర్వార్థదాయి యంచితచరితా !"

(హరి. ఉ. ౭-౨౮౮)

౨. 'తేజః, యశః' వంటి సకారాంత శబ్దములకు ఏ యర్థమందును 'ఇష్ఠన్' ప్రత్యయము పాణినివిహితము కాదు. తేజిష్ఠ రూపము సంస్కృతకావ్యములందును నాకు కనఁబడలేదు. తిక్కన శాంతి. ౩-౧౪౧ లో నిట్లు ప్రయోగించియున్నాఁడు. ఇది ప్రామాదికమే. (తేజస్వి-అను విన్ప్రత్యయాంతమే సుప్రసిద్ధము.)

గీ. "వడసి యింద్రుండు శీలసంపన్నుఁ డగుచుఁ
జనియెఁ దదనంతరంబ యద్దనుజవరుని
తనువునం దుండి తేజిష్ఠతనువిలాసుఁ
డైన పురుషుండు వెడలిన నతఁడు చూచి."

౩. కర్మధారయముమీఁద మత్వర్థీయము చేరుట పాణినిమతము గాకున్నా, కేవలమపాణినీయము కా దని, వెనుక నన్నయప్రయోగవివరణసందర్భమున విశదీకరించియున్నాను. అతనిమాడ్కి తిక్కనయు ప్రయోగించెను. అందొకటి — "సంతతోత్సాహవంతుఁడై శత్రుకోటి" (శాం. ౨-౧౯౪).

౪. కేలుశబ్దము నిత్యైకవచన మని ప్రసిద్ధిగదా! దీని బహువచనరూప మెందును కనఁబడదు, వినఁబడదు. కాని, ఎఱ్ఱనార్యుఁడు కాళ్లతో సరితూఁగుటకు కేళ్లుపయోగించినాఁడు.

"మూఁడుకాళ్లును రెండుమూఁడు కేళ్లు."
(హరి. ఉ. ౮-౧౦౩)

౫. దోయిశబ్దము నిత్యైకవచన మన్నవారూ లేరు; దీని బహువచనరూపమును వాడినవారూ లేరు. కాని, లాక్షణికుఁడైన పిన్నకోట పెద్దన్న కావ్యాలంకార చూడామణిలో (౫-౯౮) 'దోలు' అని బహువచనరూప ముపయోగించెను. అప్రసిద్ధ మప్రయుక్త మగుటచే కాఁబోలు నిది శ్రుతికటువుగానే యున్నది.

"వేలుపుటిల్లు విల్లు...రెండుచే, దోలవెలుంగు"

ఇఁక నొక్క ప్రయోగవిశేషమును గూర్చి ముచ్చటింతము.

౬. ఎఱ్ఱనార్యుఁడు అరణ్యపర్వసప్తమాశ్వాసములో (౪౧౨ ప.) 'వెన్నడికొని' అని ప్రయోగించియున్నాఁడు. ఇది ధర్మజుని మాట—

"పుడమియు సర్వసంపదలుఁ
బొల్పుగ వైరులపాలు చేసి యీ
యడవికి వచ్చి భీకరమ్ము
గావళిపొత్తున నున్న వీరి వె
న్నడికొని యిట్లు చేసె నెఱ
బాధలఁ బోలె విధాత్రుఁ డింక నె
క్కడఁ జనువాఁడ చేరి కడ
గాఁదరియింతు దురంతదుఃఖముల్ ?"

ఈ కవీంద్రుఁడే హరివంశపూర్వభాగము మూఁడవయాశ్వాసములో నిట్లు ప్రయోగించియున్నాఁడు:

ఉ. "...శౌరియు సహోగ్రజుఁడై
రథ మెక్కి యయ్యెడప
క్రాంతుని వెన్నడిం దగులఁగా—"

గీ. "విఱిగి పాఱినఁ బోనీక వెన్నడించు
హాలధరునిఁ జూచి—"

ఈ మూఁడును 'వెన్నడు'ధాతువునుండి వచ్చిన రూపములు. 'వెన్నాడు'ధాతువు వాడుకలో 'వెన్నడు'గా మాఱిన దనుట విదితము. వెంబడించు నెడి యర్థ మల్లే నిలచినది. వెన్నడించుధాతువు క్త్వార్థకరూపము 'వెన్నడి'యని గోచరించుచుండ, పైమూఁడు రూపములను, మూఁడుప్రయోగములను పరి

శీలించిన శబ్దరత్నాకరము 'వెన్నడి' దేశ్య విశేష్య మనుటమాత్రము సరి కా దనవలసి వచ్చినది. ఇది లాక్షణికావ్యయము, లేదా 'వెంబడి' వంటి నిపాతావ్యయము.

'ఆడు'ధాతు విచ్చట 'అడు'గా మాఱినది. సర్వనామ మైన "వాఁడు - వాఁడుగో; ఆఁడుగో-అఁడుగో ; పిల్లవాఁడు, పిల్లఁడు-" అని మాఱలేదా? కుఱ్ఱఁడు, గుంటఁడు మొదలయిన విట్టివే. "భాషేయ మమితా దేశ్యా తత్ర చిత్రస్వభావయుక్" అన్నారు పెద్దలు. ఆ వైచిత్రిలో నిది యొక యంశము.

కాలము గడచినకొలఁదిని, సంఘము విస్తరించినకొలఁదిని, వృత్తులు పెరిగినకొలఁదిని, నూతనభావము లావిర్భవించుచున్నకొలఁదిని దేశభాషకూడ పలుతెఱఁగుల పెరుగుచునే యుండును; మార్పు చెందుచునే యుండును. కాని, ఎప్పటికప్పుడు శిష్టవ్యవహారమున స్థిరపడిన శబ్దజాలమునే కవులు గ్రహించుట భాషాసంప్రదాయ మన్నమాటమాత్రము మఱవరాదు. పూర్వమహాకవులు స్వతంత్రించి సాహసించి ప్రయోగించినవాటిలో కూడా కొన్ని సుశబ్దములుగా గణన కెక్కి తరువాతివారికి గ్రాహ్యము లైన వనెడి పరమార్థమును విస్మరింపరాదు.



శ్రీనాథుని 'గుణనిధి' - రామకృష్ణుని 'నిగమశర్మ'

❀

— శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి —

రామకృష్ణుఁడు సర్వస్వతంత్రుఁడైన మహాకవి. శ్రీనాథుఁడు సరేసరి. సర్వతంత్ర స్వతంత్రుఁడైన మహాకవి. శ్రీనాథునకుఁ బూర్వము శ్రీనాథునివంటి కవి లేఁడు. రామకృష్ణునకు ముందు అతని వంటి వాఁడు శ్రీనాథుఁ డొకఁ డున్నాఁడు. ఆ యుండుట అజ్ఞాతముగను, ఆపామోహిగను గాదు. సకలాంధ్రప్రసిద్ధములైన మహాకావ్యములు రచించి, బంగారుపూల పూజలు చేయించుకొని, రాఁబోవు తెలుఁగుకవులకు నేనోజ్జబంతిని గావలయు నన్న పెంకితనముతో నున్నాఁడు. అతఁ డనుకొన్నటులే, అతని సీసపద్యపునడకలు, బింకములైన కూర్పుపోకడలు తరువాతికవులు చాలమంది కొరవడు లైనవి. ఆ కవుల గణములో మన తెనాలి రామకృష్ణుఁ డొకఁడు. అతనికి సర్వథా మన శ్రీనాథుఁ డాదర్శప్రాయుఁడని వ్రాసెదను. అంతమాత్రముచేత రామకృష్ణునకుఁ జెడిపోవునది లేదు. ఉత్తమాదర్శము లేని కవి కవియే గాఁడు. శ్రీనాథునకుఁ దెనాలికవి చేసినది మెఱుఁగుసేఁత గాని అనుకరణము గాదు. ఇట్లనుటవలనఁ గవిసార్వభౌమునకును నెలితి యుండఁబోదు. "ధళుధళుక్కున నింగిఁ దాటించి చనుఁగాని, నిలువనేరదు హ్రాదినీప్రకాశము" (కాశీఖండము, 3 ఆ. ౧౯౬ ప) అను పద్యపాదము గుఱుతున నుండియో, లేకో తెనాలికవి "ధళుధళుక్కున నింగిఁ దాటించెఁ బలుమాఱు సీరాళ్లగొండిఁ గన్నియ మెఱుంగు" (పాండురంగ. ౪ ఆ. ౨౧ ప.) అన్నాఁడు. మచ్చున కిది యొకటిచ్చినాను. మఱికొన్ని యిట్టివే యచ్చటచ్చట నున్నవి. నిజము చెప్పవలసి వచ్చినచో, శ్రీనాథుని కృతులకుఁ బూర్వకావ్యములనుండి పాదములకుఁ బాదములు దిగుమతి యైనవి. కాదంబరి, అనర్ఘరాఘవము, సూర్యశతకము, కాళిదాసకృతులు, ఉత్తరరామచరిత్రము, ఆచార్యశంకరప్రభృతుల స్తవములు మున్నగు సంస్కృతకావ్యవాఙ్మయము కవిసార్వభౌమునకుఁ గంఠస్థము. దానిలోఁ జాల పాలతఁడు గ్రంథస్థము చేసికొన్నాఁడు. ఇట్లు చేయుట యతనికి లోపాపాదక మనఁగలరా? పూర్వకవికృతులయం దతనికిఁగల మమకారమున కిది యుదాహరణ మగును.

ప్రకృతము: రామకృష్ణునకు శ్రీనాథుని కవితపై, అతని కల్పనములపై, అతని ప్రయోగములపై మమత్వ మున్నది. దానిని పురస్కరించుకొని యతని కల్పనముల కితఁడు మెఱుఁగుపెట్టినాఁడు. అతని ప్రయోగము లితఁడు వాడుకొనినాఁడు. తారకాణ కొకఘట్టము గైకొందము.

శ్రీనాథుఁడు, కైవ్రాలని ప్రాయములో నుండి 'కాశీఖండము' రచించినాఁడు. దానిలో నాలుగవ యాశ్వాసమున 'కుబేర

వృత్తాంతము'న 'గుణనిధి' కథాసందర్భము పరిశీలింపుఁడు. రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యములోని మూఁడవ యాశ్వాసమున 'నిగమశర్మ' వృత్తాంతము పరిశీలింపుఁడు! దానికిని, దీనికిని కథలలో-కవిత్వములలో-కల్పనములలో పోలికలు బహుశః కానఁబడును. ఈ రెండు కృతులకు సంస్కృతమున మాతృక లున్నవి. కావున, పరాధీనమైన కథల విషయము మనము చూడ వలదు. కల్పనము - కవిత్వము ఇవియే చూతము.

శ్రీనాథుని 'గుణనిధి', రామకృష్ణుని 'నిగమశర్మ'—ఇరువురును సమానకులశీలములు గలవారు. ఇరువురు జాతిమాత్రోపజీవులు. తల్లిదండ్రులు గలవారు. నూతన దారసంగ్రహము చేసికొన్నవారు. ద్యూత వ్యసనులు. నిగమశర్మ తల్లిదండ్రులు 'పడఁబడఁ బాఱుచున్ వడఁకుపట్టినవారు'. గుణనిధితల్లిదండ్రులు అంత పెద్దవారు కారు. ఆకారణమున, నిగమశర్మకు బుద్ధిచెప్పుటకు అక్క రావలసివచ్చెను. గుణనిధికి తల్లిదండ్రులే బుద్ధిగఱపినారు.

శ్రీనాథుని 'గుణనిధి'

సీ. "బ్రాహ్మణాచారంబు పరిహాసకము సేయు
నగ్నిహోత్రవిధాన మన్న నలుగు
సంధ్యాభివందనశ్రద్ధ యుజ్జనసేయు
గీతవాద్యవినోదకేళిఁ దగులుఁ
బాషండదుర్భావ లావర్తించు
ద్యూతకారులతోడి యుద్దివసేయు
ధాతువాదులమీఁదఁ దాత్పర్య మొనరించుఁ
జెలిమి వాటించు నాస్తికులతోడ
నటుల మన్నించు హర్షించు విటులఁ జూచి
పీఠమర్దుల కొనరించుఁ బెద్దజీకము
కాలసేయులఁ బాటించు గారవించుఁ
జేటకుల దీక్షితుని పట్టి సిగ్గుడిచి."

దీనికే కొంత మెఱుఁగుపెట్టి, "ఉష్ణాని హోమాగ్ని నూఁదనొల్లఁడుగాని, విరహాజ్వరార్తుఁడై వెచ్చనూర్చు" అన్న పద్యము రామకృష్ణుఁడు రచించినాఁడు. నిగమశర్మను అక్క చీవాట్లుపెట్టుసందర్భములో—

సీ. "పరమేష్ఠినుండి సీతకరముదాఁక విశుద్ధ
తరమైన వంశంబు దలఁచవైతి
దలఁ బ్రొక్కియున్న యీ తల్లిదండ్రులఁ జాల
పఱచవై సంతోషపఱచ వైతి
వగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన యిల్లాలి
నిల్లాలితాకార నొల్ల వైతి
ధర్మశాస్త్రార్థవిత్తముల విత్తములచే
నలరించి విఖ్యాతి నందవైతి
గీ. శీల మఖిలంబు నిది పిల్లిశీల మనుచుఁ
జదువు లివియెల్లఁ జిల్కల చదువులనుచుఁ
గోడివారలు నవ్వ నాతోడ! యేల
చేలవైతివి యీగుణం బేల నీకు!"

అనిన యీపద్యము కాశీఖండము నందలి 'గుణనిధి'ని చీవాట్లుపెట్టునపుడు తల్లినోటనుండి శ్రీనాథుఁడు పలికించిన పద్యముతో సరిగాఁ బోలియుండుట యభిజ్ఞులు గమనింతురు. ఆపద్యముకూడ నిట వేరు కొందును.

సీ. "సచోఽగ్నిత్రితయులు సమాధానలు సోమపీ
థులు నైన కులము పెద్దలఁ దలంచి
రాజమాన్యుఁడు సత్యరతుఁడు వినిర్మలా
చారవంతుండైన జనకుఁ దలఁచి
భాగ్యసంపదఁ బుణ్యపతిదేవతలలోన
వెన్నొంగఁదగియెడు నన్నుఁ దలఁచి
వేదశాస్త్రపురాణవిద్యానిరూఢులై
వాసికెక్కిన తోడివారిఁ దలఁచి

సీ. చెడ్డయింటి చెడారమై శివుని కరుణ
నిర్వటీలు నిర్వదేశేంద్ర నిన్నుఁ దలఁచి
పదియునార్వత్సరంబుల భార్యఁ దలఁచి
గోరతనములు మానురా! కొడుకుఁగుఱ్ఱ!"

ఈ రెండుసీసములు సమానముగాఁ దూఁగుచున్నవి. కులప్రశంస- తల్లిదండ్రుల ప్రసక్తి-సవయస్కుల ప్రశంస-భార్యప్రశంస ఈనాల్గును సరిసమానముగ నెత్తుకొని, గుణనిధిని తల్లి తిట్టెను. నిగమశర్మను అక్క తిట్టెను. శ్రీనాథుఁడు, రామకృష్ణుఁడుకూడ నీ చెప్పించుటలో నౌచితి లెస్సగాఁ బరిపోషించిరి. నిగమశర్మయిల్లాలు లాలితాకార. గుణనిధిభార్య పదియునార్వత్సరంబులది. నిగమశర్మ కులమువారు శ్రోత్రియులు, అనూచానులు, సోమయాజులును. గుణనిధివంశమో, బ్రహ్మ మొదలు పరిశుద్ధతరమైనది. నిగమశర్మజననీజనకులు తటేఁద్రొక్కియున్న వృద్ధులు. గుణనిధితల్లిదండ్రులు నిర్మలాచారవంతులు, రాజమాన్యులు, సత్యరతులును. తప్పక రామకృష్ణుఁడు 'నచ్ఛ్రోత్రియు' లన్న శ్రీనాథుని పద్యము స్మరణకుఁ దెచ్చుకొని 'పరమేష్ఠినుండి' అను పద్యము వ్రాసెను. గుణనిధిని తల్లి యిట్లనుచున్నది:

చ. "విడువక నీవు పట్టణము
వీథుల వీథుల వెఱ్ఱివాఁడవై
చెడుగులఁగూడి ధౌర్త్యములు
సేయ మహీరమణుం డెఱింగనీ
విడుచును సోమయాజి, మను
వృత్తులు చేకొనా, నెల్ల వెంటలన్
జెడుదుము గాద నీకతనఁ జీరయుఁ
గూడును లేక పుత్రకుఁడా!"

గుణనిధితండ్రి రాజాస్థానపురోహితుఁడు గాన, దాని కనుగుణముగా నీమె కుమారుని మందలించినది. "రాజుగారి కీసంగతి తెలిసినచో సోమయాజిని గెంటివేయుదురు. ఇచ్చిన మాన్యములు తిరిగి లాగుకొందురు. అప్పుడు కూడును, గుడ్డయు లేక యేడువవలసివచ్చును." ఇది తల్లిభయము. పుత్రమోహముచేత గుణనిధి యెన్ని యపాత్రపుఁ బనులు చేసినను, తల్లి కప్పిపుచ్చి తండ్రితోఁ జెప్పెడిది కాదు. ఇప్పు డింకఁ దండ్రికిఁ దెలిసిపోవు సమయము వచ్చినది. అట్టి సమయములోఁ బైకీతిని బుద్ధిచెప్పినది. "నీదుశ్చేష్టలు తండ్రికిఁ దెలిసినచో ప్రమాదము లేదుగాని, రాజుగారికిఁ దెలిసినచోఁ గొంపలుమునుఁగునురా, బాబూ! నాయనా! ఊరుకోరా" అని కొడుకుగడ్డము పట్టుకొని చెప్పుచున్నది. ఈ మాతృభాషణములోఁ జక్కని యుచితత్వము కలదు.

ఇంక నిగమశర్మఅక్కగారి మాటలలో నౌచితి చూడుఁడు:

చ. "పసఁబసఁ బాలుచున్ బసుఁడు
పట్టిన తల్లిని దండ్రి నేలరో
వెసలని తిమ్ముఁగుఱ్ఱల న
వీనకులాంగన నోరు లేని యా
తొడుకుల బంటుఁ బైద విడఁ
ద్రోవక ద్రోవఁగ నెందు నీక పా
ల్పడినది కర్ణనాదలన
భారతసంహిత నిల్పుచాడ్పునన్."

ఈ పద్యమునకు ముందు మూఁడు నాల్గింట నిగమశర్మమొగము వాచునటులు చీవాటులుపెట్టినది అక్కగారు. "సాలగ్రామఖనిం జనించునె కదా జాత్యల్పపాషాణముల్!" అనికూడ ననినది. ఇఁక నీఖడ్గవాదముతో లాభము లేదనుకొని, కార్యవాదములోనికి దిగి "ఉదంచితప్రయోజనఘటనాపార

వశ్యంబున సామరస్యంబు మీఱ నిట్లనియె." కర్ణుని నెత్తిపై యావద్భారతము నిలిచియున్నటులు, నీమీఁద ఈ సంసారభారమంతయుఁ బడియున్నది. ఈ చీకు తల్లిదండ్రులను, పసి దమ్ములను, నీ యిల్లాలిని, గొడ్డుగోదమును జాగ్రత్తగాఁ జూచుకొనుము నాయనా! యని బతిమాలుచున్నది. ఈ పద్యము తరువాత మఱి యాఱుపద్యములలో, ఆ జూదరిమనసు కరఁగునటులు అక్కచే రామకృష్ణుఁడు పలికించినాఁడు. శ్రీనాథుని 'గుణనిధి' తల్లికంటె నిగమశర్మ అక్కగారు చదువుకొన్నది, గడుసుది, మంచి నోడికారపుఁ దీరు తెలిసినది, నదురుబెదురులు లేనిది. అందుకే "కేదారంబుల్ తెగనమ్మఁగాఁ జనునె? నిర్ధారుండవే? వెన్క నెవ్వారున్ లేరె సహోదరాదులు? కులధ్వంసంబు నీ కర్హమే?" అనఁగలిగినది. ఈ మాటలో బ్రహ్మాండమంత భావ మున్నది. "ఓరి వెఱ్ఱిముండాకొడకా! నీ విట్లు నీ సొంత సొమ్మువలె భూములు తగులఁబెట్టుచున్నావు. ఆ తరువాత వచ్చు ముప్పు చూచుకొనవు. నీ భార్య, నీ తమ్ములు భూమికి 'హక్కుదారులు' కారనుకొన్నావేమి? జాగ్రత్త! వారిచే 'దావా' పడవేయించి నీ పని పట్టించెదను" అన్నంత 'ఫోర్సు' ఉన్నది. ఆ తరువాతిదానిలో "కామవికారమాత్మనవగాఢతఁ దాల్చిన యేని...విప్రకన్యామణులన్ సహస్రమయినన్ వరియించి రమించరాదె?" అని చెప్పినది. ఈ పలుకులో నామె మాటనేర్పు, నీతిజ్ఞత, తత్కాలోచితసంభాషణచమత్కృతి వెల్లివిరిసినవి. మఱి, శ్రీనాథుఁడు గుణనిధి కింత హెచ్చుగాఁ జెప్పించలేదు. గుణనిధితల్లి యమాయికురాలు. ఎంత యమాయికురాలు కాకపోయిన, కొడుకు భ్రష్టుఁడై చెడిపోవుచున్నపుడు మాటాడకూరకొనినది. తండ్రికిఁ దెలియకూడదని వాని తప్పులు కప్పిపుచ్చినది. పుత్రమోహము! 'తనయ! యేల యవ్వైకోవు వినయగరిమ'—'నవ్వుదురు నిన్ను మొదల నానావిధముల' అని మెత్తమెత్తగా, కుమారుఁ డెక్కడ బెదరిపోవునో యని చీవాట్లుపెట్టినది. రామకృష్ణకవి తల్లిచేఁ జెప్పింపక యక్కగారిచేఁ జెప్పించి, యౌచిత్య మద్భుతముగాఁ బోషించినాఁడు. నిగమశర్మ జాగ్రత్తగా నుండియుండి యొకరాత్రివేళ నిల్లంతయుఁ గొల్లగొట్టి యడవిదారిఁ బట్టినాఁడు. తెల్లవాఱిన తరువాత నీపద్యము పుట్టినది.

సీ. "శోకించు వృద్ధభూసురుఁ డాత్మపితృదత్త
దర్భముద్రికఁ జిత్తంబు గలఁగ
నత్తగా రిచ్చిన హరిసుదర్శనపుఁ జే
రునకు ముత్తయిదువ వనటఁబొందుఁ
గ్రొత్తగాఁ జేయించుకొన్న ముక్కరకునై
యడలు దుర్వారరై యాఁడుబిడ్డ
జామాత వెతఁబొందు వ్యామోహులై నవ
గ్రహకర్ణవేష్టన భ్రంశమునకు
గీ. నెంత దుర్బుద్ధి యెంత దుర్భ్రాంతి యహహ!
సర్వధనములు నద్దురాచారశీలుఁ
డూచముట్టుగ నిలఁదోఁచి యుంటికి చనుట
యెఱుఁగరో గాక యెవ్వేళ యెఱుకగలద?"

కాశీఖండములోని 'గుణనిధి' జూదమునకని యొక్కొక్కటే యింటఁగల వస్తువులు ధ్వంసముచేసినాఁడు. తండ్రి యొకనాఁడు తనభార్యను నిలఁబెట్టి 'నిఘా'చేసి యడిగినాఁడు. ఆ ప్రకరణములో పద్యమిది:

సీ. "ఏడఁబోయెనో కదా మేడలో మంజిష్టి!
పెనుబండువున వైటఁ బెట్టఁజాలఁ

దా కట్టుకవచె యింతకు వైశ్యగృహమున
గనప బంగారు భృంగారుకంబు
పట్టుసూత్రమయంబు పసిఁడియొడ్డాణ మే
యిగురుఁబోఁడికటీర మెక్కెనొక్కొ ?
శశికాంతదీపికా స్తంభలీలారత్న
సాలభంజిక యెందు సాఁగెనొక్కొ ?
గీ. యెదుట నున్నదియా రత్నఖచితమైన
హంసతూలిక డోలావిహారతల్ప
మూఁచముట్టుగ నీవు నీ యింటి కొడుకుఁ
బాడుచేసితి గృహము నిర్భాగ్యురాల!"

నిగమశర్మయు, గుణనిధియు ఊచ ముట్టముగ నిలుదోఁచికొని పోయినవారే. పైపద్యములు రెండును బింబప్రతిబింబములు.

ఈ కథాఘట్టములు రెండును 'ఇతి శ్రీ'గా నుదాహరించి తారతమ్యములు, పోలికలు పూర్తిగ నిటఁ జూపను. రసజ్ఞులగు పఠితలు రెండుపుస్తకములు దగ్గఱఁబెట్టుకొని పరికించినచో శ్రీనాథుని 'గుణనిధి'కి రామకృష్ణుని 'నిగమశర్మ' పైచెయ్యివలెనే కనిపించును. నిగమశర్మ 'సకలనిగమశిఖారహస్యములు' తెలిసినవాఁడు, "వనితామానస సూనసాయకుఁడు, జీవత్తాతపాదుండు, భూజనసమ్మాన్యవిశుద్ధవర్తనుఁ, డుదంచత్త్యాగశీలుండు; చంద్రుని పెన్నిద్ది సమగ్రకాంతిమహిమన్, నూనూఁగుమీసాల లేఁగొనఁబుం బ్రాయపుఁ దేజకూన, యతఁ డుల్కోచుండు వాచాలతన్."

'గుణనిధి' యంత పెద్ద విజ్ఞుఁడు గాఁడు. నిగమశర్మ 'హేమాహేమీ'లలోనివాఁడు. ఈ రెండుపాత్రలును శ్రీనాథ-రామకృష్ణులు తత్తదుచితకల్పన, కవితారీతులతో నడపించిరి. మొత్తముమీఁద నిగమశర్మకు 'గుణనిధి' ఆదర్శము.



బళ్లోకి వెళ్లాలి

[కథానిక]

✵

= శ్రీ 'జమదగ్ని' =

ఆ పూట గోపాలంమనసు మనసులో లేదు.

ఉదయాన లేస్తూనే తండ్రి చెప్పిన విషయం అతని గుండెల్లో అలా రాయిపడవేసింది.

'ఒరే గోపీ ! శెనగుగింజలు తేవాలిరా' అంటున్నది తల్లి.

'ఇవాళ వాడగ్గఱ పైకం లేదు. రేపు చూద్దాం' అంటున్నాడు తండ్రి.

అయితే ఏమిటిగతి? ఇదేప్రశ్న అందరినీ కలవర పరచింది. అప్పుగూడా పుట్టే దిక్కు లే దనుకుంటున్నది తల్లి. ఇవాళకు ఎలా గడిచినా ఇకముందు నుంచైనా ఈ బాధ తప్పుతుందిగదా అని కొడుకుమీద ఆశపెట్టుకుంటున్నాడు తండ్రి. తండ్రి చెప్పినట్లు చెయ్యక తప్పదనిపిస్తోంది గోపాలానికి.

వాకిట్లో బక్కచిక్కిన గుఱ్ఱం ఆకలిబాధ సూచిస్తూ కాబోలు సకిలించింది.

తండ్రి చిరిగిన చొక్కా తొడుక్కొని వెళ్లి పోతున్నాడు.

వీధిమూలనుంచి పంతులవారు బళ్లోకి వచ్చినట్లు ప్రార్థనపద్యం తెలియజేస్తోంది.

తా నక్కడ లేకపోయినా గోపాలం మనసులో పద్యం చదువుకున్నాడు. అప్పుడే పంతులుగారు నిన్నటి పాఠాలు అప్పజెప్పుకుంటున్నారు. అందరూ తప్పు చెప్పుతున్నారు. తా నుంటే సరీగా చెప్పే వాడు. అతనినోరు పాఠం అప్పజెప్పేస్తోంది.

'అక్కఱకు రాని చుట్టము,
మ్రొక్కిన వర మీని వేల్పు, మోహరమున దా
నెక్కిన బాఱని గుఱ్ఱము.
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!'

అత నింకా పద్యం పూర్తిచెయ్యనేలేదు. ఈ మూలనుంచి గొల్లుమని ఏడుపు వినవచ్చింది. ఏమిటా అని గోపాలం బయటికి వచ్చాడు. మిద్దెయింటి సాహుకారుభార్య వాళ్ల బుచ్చిరామ వేణుగోపాలకృష్ణయ్యను బళ్లోకి పంపిస్తోంది. అతగాడు 'నేనుపోనే' అని అరుస్తున్నాడు కన్నీళ్లతో బట్టలు తడుపుకుంటూ.

* * * *

స్టేషనుదగ్గఱ బళ్లస్టాండులో బండిదగ్గఱ నిలబడి ఉన్నాడు తండ్రి గోపాలం వెళ్లేటప్పటికి.

అప్పుడే రైలు వచ్చినట్లుంది. జనం గుంపులు గుంపులుగా దిగుతున్నారు. గోపాలం ఇంకా తండ్రిని సమీపించనేలేదు. కాని తండ్రిముఖం చూడలేకపోయాడు గోపాలం. అంతవఱకూ బాడుగ దొరకలేదు కాబోలు, డీలాపడిఉన్నాడు తండ్రి.

ఎవరోగాని ముగ్గురు పెద్దలు ఆరు పెట్టెలు స్వయంగా మోసుకొని వచ్చి 'బండి కడ్తావా?' అన్నారు.

'ఆ! బాబా !'

'కొత్తపేట కేం ఇవ్వమంటావ్?'

'తమ చిత్తం బాబయ్యా !'

'మూడణాలు ఇస్తాం'

'ఆరు పైసల్లయింది. గడ్డురోజులు. తమ దయ'

'నీ ఇష్టమైతేనే కట్టు !'

మారుమాటఅనకుండా సామాను సద్ది 'ఎక్కండి బాబయ్యా !' అన్నాడు తండ్రి. గుఱ్ఱాన్ని చూస్తున్న గోపాలంకళ్లల్లో నీళ్లు తిరిగాయి.

అంతలో తండ్రిని సమీపించి 'బాబా !' అన్నాడు గోపాలం.

'వచ్చావ్ ! గోపీ ! రా ! ఎక్కు ! ఈబాడుగ దింపి పోదాం'

'నే వడిచే వస్తాను' అంటున్న గోపాలంమాటలు వినిపించుకోకుండానేబండిలో ఒకఆసామీ 'ఇంకా ఎంతమందిని ఎక్కిస్తావు ? అసలేచచ్చుగుఱ్ఱం! పోనీ!' అన్నాడు.

లాగలేక లాగలేక గుఱ్ఱం లాగుతోంది.

చూడలేక చూడలేక గోపాలం చూస్తున్నాడు.

'నే నిప్పుడే వీరిని దింపివస్తాను. నువ్వు ఇక్కడే ఉండు' అన్న తండ్రిమాటలు గోపాలానికి వినపడనే లేదు. గోపాలం అల్లా నడుస్తూనేఉన్నాడు.

*　　*　　*

అప్పటికి తొమ్మిది గంటలైందేమో ! ఎండ ఎక్కే పొద్దు. ఇంట్లో గింజలు లేక తల్లి గంజికూడా కాచి ఇవ్వలేదు. ప్రాణం సోమ వస్తోంది. గోపాలం ఇక నడవలేకపోయాడు. దారిప్రక్కన ఒక చెట్టుఉంటే దానిక్రింద చదికిలబడ్డాడు.

ఎండలోనుండి నీడలోకి కొత్తగా రావడంలో అతనికి కాసేపు ఏమీ కనిపించలేదు. ఆ పసిమనస్సుకు భవిష్యత్పుటూహాలు ఏమీలేవుకాని అదీ అల్లా అయోమయంగానే ఉన్నది.

కూర్చుని కూర్చుని విసుగెత్తి గోపాలం పడుంవాల్చాడు, కన్ను మూశాడు. వివశమైన శరీరానికి నిద్రవచ్చింది.

గోపాలం పాఠాలన్నీ గడగడా అప్పజెప్పాడు. చురుకుగా లెక్కలు చేశాడు. బళ్లో మాస్టారు గోపాలంతో అన్నారు. 'అబ్బాయి! నీకు బాగా చదువు వస్తుంది. నువ్వు పెద్దబళ్లోచేరి చదువుకో !' గోపాలానికి పట్టరాని సంతోషం అయింది. నాన్నను అడుగుదామని పరుగెత్తుకు ఇంటికి వెళ్లాడు. వాకిట్లోనుంచే 'నాన్నా!' అని కేక వేశాడు.

గోపాలానికి మెలకువ వచ్చింది ! అతడు కూర్చునే 'నాన్నా !' అంటున్నాడు.

ఎదురుగా బండి ఆగింది. గోపాలంతండ్రి కొడుకును చూచి ఆశ్చర్యపడ్డాడు. అతని తండ్రిప్రేవు జవజవలాడింది. తిండిలేక కన్నకొడుకు కూర్చుని నిద్రపోతూ సంధిమాటలు అంటున్నాడు.

'గోపీ' అన్నాడు తండ్రి.

'నాన్నా!' అన్నాడు గోపాలం.

'ఇక్కడ కూర్చున్నావేం ? ఇందాకా ఎందుకు వచ్చావ్ ? రా పోదాం, అయ్యగారి దగ్గఱకు' అన్నాడు తండ్రి.

గోపాలం లేచి బండి ఎక్కాడు.

బండి పెద్దబజారు దాటింది. అప్పుడు పదిన్నర కావస్తోంది.

'ఎక్కడికి నాన్నా మనం వెళ్లేది?' అన్నాడు గోపాలం.

'ఇక్కడికే !' అంటూ బండి ఆపాడు తండ్రి.

బండిలోనుంచే గోపాలం నాలుగుప్రక్కలా చూచాడు. అదే పెద్దబడి. అతనికి ఆశ్చర్యం వేసింది. బళ్లో పంతులుగారు తనతో నిద్రలో అన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి.

'నాన్న ఎంత మంచివాడు !' అనుకున్నాడు గోపాలం.

గంజి తాగని నిస్సత్తువ అతని కప్పుడేమీ తెలియలేదు.

హెడ్మాష్టరు గదిగుమ్మందగ్గఱ కొడుకుతో నుంచొని ఉన్నాడు తండ్రి.

ఒక్కసారి బడిఅంతా చూచి అప్పుడే హెడ్మాస్టరు వస్తున్నాడు.

ఆయన తలపాగ, కోటు, శీవి చూచి ఎంత గొప్ప వాడో అనుకున్నాడు గోపాలం. అతనికి బళ్లో చేర్పించడానికే తండ్రి తన్ను అక్కడకు తీసుకు వచ్చాడన్న ఊహ పొంగుకుపోయింది. ముఖం కళకళ లాడిపోతోంది.

'వీడేరా మీ అబ్బాయి!' అన్నాడు హెడ్మాస్టరు అతని ముఖంలో తెలివి తేటలు గమనిస్తూ.

'చిత్తం బాబయ్యా! తమ దయ'

'సరే! ఇవ్వాళిటినుంచే చేరమను'

అయ్యగారికి దణ్ణం పెట్టమని తండ్రి సైగ చేశాడు. గోపాలం పెట్టాడు.

హెడ్మాస్టరు గదిలోకి వెళ్లిపోయాడు.

'నువ్వు ఇక్కడే ఉండు. వారేం పని చెప్తే అది చెయ్యి. ఒంటిగంటకు బడి విడిచిపెడ్తారు. అప్పుడు అన్నానికి రా! జాగ్రత్తగా మసులుకో!' అని తండ్రి హెచ్చరించి వెళ్లిపోయాడు.

గోపాలానికి అంతా అయోమయంగా ఉంది. అక్కడే నిలబడిఉన్నాడు ఏం చెయ్యాలో తెలియక.

గదుల్లో పిల్లలకు మాస్టర్లు పల్లుకొలుకుతూ పాఠాలు చెప్తున్నారు.

౨

గోపాలం రోజూ హెడ్మాస్టరు ఇంటిదగ్గరే పడుకుంటాడు రాత్రి పదకొండుగంటలకు. ఉదయాన లేచింది మొదలు నీళ్లు తోడడం, గుడ్డలుతకడం, బజారుకి పోయి సరుకులు తేవడం, ఇంటికి పోయిగంజి తాగి మళ్లీ అయ్యగారిఇంటికి అరగంటలో రావడం, ఆపిమ్మట అయ్యగారి సైకిలు వసారాలోనుంచి దింపి పందిరిగుంజ కానించి వారికంటే ముందు బడికి పరుగెత్తుకు రావడం—ఇవన్నీ అతనికి నిత్యకృత్యాలు అయిపోయాయి. పదుమూడేళ్లు నిండని అతనికి ఈపని చాలా భారమే అయినా ఒకేఒక ఆశతో ఈరెండు నెలలబట్టీ చెయ్యగలుగుతున్నాడు గోపాలం.

ఇంతకష్టాన్నీ అతని కర్తవ్యంలో ఒక్కపని వల్లమాత్రం అతడు మరచిపోగలిగేవాడు. అది గంటలు కొట్టడం.

తొమ్మిదిమ్ముప్పావుకు మొదటిగంట కొట్టేవాడు. ఆగంట మోగుతున్నంతసేపూ అయ్యగారి ఇంటి పనిభారంలో అణగిపోయిన తనలోని ఏశక్తో నిద్రమేలుకుంటున్నట్లు ఉత్సాహం పొందేవాడు గోపాలం. కాసేపు ఉంటే వందలకొద్దీ తన యీడు కుఱ్ఱవాళ్లు, తనకంటే చిన్నవాళ్లూ పెద్దవాళ్లూగూడా చదువుకోవడానికి వస్తారు. తాను మూడోగంట కొట్టందే ఏపంతులూ పాఠం చెప్పడానికి వెళ్లడు. ఇంతమంది కుఱ్ఱవాళ్లను చదువుకోనిస్తున్నది తానే! తనకు గూడా చదువుకునేందుకు అవకాశం ఉంటే.........

అంతలో హెడ్మాస్టరు రానే వచ్చేవాడు. తాళంచెవి ఇచ్చి తలుపులు తీసి ఊడవమనేవాడు. కూజాతో మంచినీళ్లు పట్టుకురమ్మనేవాడు. ఏవేవో కాయితాలు ఇచ్చి అన్నిగదులకూ పోయి మాస్టర్లకు చూపించి రమ్మనేవాడు. ఒకగదిలో లెక్కలు వినపడేవి! మఱొక గదిలో పద్యాలు వినపడేవి! ఇంకొక గదిలో ఎవరో పంతులు కథలు చెప్తూ ఉండేవాడు. గోపాలం ఒక్కొక్కచోట అది వింటూ అట్లాగే ఉండిపోయేవాడు. రావడం ఆలస్యమయిపోయేది. హెడ్మాస్టరు 'వెధవా! షికార్లుకొడుతున్నావా? ఇంతసేపేమిటి? డొక్క చీరేస్తాను' అనేవాడు. గోపాలం కళ్లనీళ్లు పెట్టుకొనేవాడు.

'ఏడుపుగొట్టు వెధవా! అవతలికి పోయి ఏడు' అనేవాడు హెడ్మాస్టరు.

ఇంటిదగ్గర తల్లీ, తండ్రీ మాత్రం కొంత సంతోష పడేవారు. గోపాలాన్ని మెచ్చుకునేవారు ఇరుగు పొరుగువారితో చెప్తూను. చిన్నవాడైనా బుద్ధిగా పనిచేస్తూఉండబట్టే తమకు అన్నానికి ఇబ్బంది తప్పిందని. రోజూ రెండుమాట్లు ఇంటికి అన్నానికి వెళ్లే ఆ అరఘడియకాలంలోనూ అప్పుడప్పుడు ఈ ముక్కలు అతని చెవినిగూడా పడేవి! ఆమాటా నిజమే! ఇప్పుడు తానుగూడా తిండి సుఖం అనుభవిస్తున్నాడు. ఉద్యో

గం చేస్తున్నాడని తల్లి కష్టపడి చేత్తో కుట్టిన మంచి చొక్కాలు రెండు ఏరోజుకారోజు ఉతికి ఇచ్చేది. తమకు ఉన్నా లేకపోయినా వండిన భాగం ముందు తనకే పెట్టేవాళ్లు తల్లీ, తండ్రీని.

గోపాలానికి ఏడవాలో, సంతోషించాలో ఏమీ తెలిసేది కాదు.

*   *   *

ఆరోజు ఆదివారం. బడిలేదు. కాని గోపాలానికి సెలవులేదు. అతని కారోజే పని ఎక్కువ.

మామూలు ప్రకారం అన్ని పనులూ చేసి గోపాలం వసారాలో కూర్చుని ఉన్నాడు. అలసిన శరీరంతో గుంజకానుకొని కునికిపాట్లు పడుతున్నాడు.

అయ్యగారు అప్పుడే భోజనంచేసి త్రేనుస్తూ వసారాలోకి వచ్చారు. పడకకుర్చీ పిలుస్తున్నా వినిపించుకోకుండా గోపాలాన్ని కేకలు వేశారు.

గోపాలం ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

'ఏం పనిలేక కొట్టుకుంటున్నట్లున్నావే! అమ్మగార్ని అడిగి డబ్బులు తీసుకుపోయి తమలపాకులు పట్టుకురా !' అన్నారు.

గోపాలం తలవంచుకొని వెళ్లిపోయాడు.

అతను తిరిగివచ్చేటప్పటికి అయ్యగారు ఆరేళ్ల చిన్నఅయ్యగారిని పొట్టమీద కూర్చోబెట్టుకొని పద్యాలు చెప్తున్నారు.

గోపాలం మరచిపోలేదు చదువుకున్న చదువు. ఆ పద్యాలు చెవిని పడడంతోటే, ఎండలో బజారుకు వెళ్లివచ్చిన కష్టం అంతా మరచిపోయి, మనసులో అనుకుంటూ లోపలికి వెళ్లి అమ్మగారికి ఆకులు ఇచ్చి బయట వసారాలో గుంజకానుకుని నుంచున్నాడు.

అయ్యగారు తాంబూలం వేసుకుంటున్నారు. చిన్నయ్యగారు పద్యాలు అప్పచెప్తున్నారు. అమ్మగారు పక్కనే నుంచుని కొడుకు తెలివితేటలకు సంతోషిస్తున్నారు.

చాలా చక్కని సమయం. గోపాలానికి ఆగ బుద్ధివెయ్యలేదు. అడుగుదామన్న ఆతురత హెచ్చిపోయింది.

'బాబూ !' అన్నాడు మెల్లగా.

'వెళ్లి భోంచేసి త్వరగా రా' అన్నారు అయ్యగారు విసుక్కుంటూ.

గోపాలం కదల్లేదు. అట్లాగే చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

అయ్యగారు చిన్నయ్యగారితో ఆడుకుంటున్నారు.

గోపాలం మళ్లీ 'బాబూ !' అన్నాడు.

'వెళ్లమన్నాను గదరా !'

'అదిగాదు బాబూ ! ఒక్క మనవి.'

'మీ అయ్య అడిగిందేనా ? తర్వాత చూద్దాంలే.' అయ్యగారు ఉత్సాహంతో ఉండబట్టి ఆమాత్రం మంచిమాటైనా వచ్చింది. మొదట్లో అడిగినప్పుడు 'ఇక్కడ నీకోసం కొట్టుపెట్టామా ?' అని చీవాట్లు పెట్టారు తోడిగిన పాతగుడ్డ ఇవ్వడానికి. ఇవాళ ఈ మాత్రం సుముఖంగా ఉన్నారుకదా అని గోపాలానికి ధైర్యం వచ్చింది.

'కాదండీ బాబయ్యా!'

'ఏమిటిరా మరి ?'

'నాకుగూడా చదువుకోవాలని ఉంది బాబయ్యా.'

'నీకు చదువేమిటిరోయి ? ఏమైనా మతిపోయిందా ?'

ఓ అంటే నా రాని అమ్మగారి దగ్గరనుండి తొక్కుపలుకులు పలుకుతున్న చిన్నయ్యగారి వరకు ముగ్గురూ విరగబడి నవ్వారు.

గోపాలానికి ఏమనాలో తెలియలేదు. ఏం, తానెందుకు చదువుకోగూడదు? తనకంటే చిన్నవాడు చిన్నయ్యగారు చదువుకుంటూంటే, అంతమంది బళ్లోకి వస్తూఉంటే, ఒక్క తానుమాత్రం ఏంపాపం చేసుకున్నాడు ?

చిన్నయ్యగారు పద్యం చెప్తున్నారు. 'అక్కలకులాని సుత్తము' అంటూ. గోపాలం తన్నుతాను ఆపుకోలేక పోయాడు.

'అక్కఱకు రానిచుట్టము' పద్యము పూర్తిగా అప్పజెప్పాడు స్వచ్ఛంగా.

పెద్దయ్యగారు నిర్ఘాంతపోయి చూచాడు గోపాలంవంక.

గోపాలం చేతులు నలుపుకొంటూ 'నే నసలు చదువుకుంటున్నవాణ్ణేనండి! మా అయ్య చదువు మాన్పించి, ఇల్లు గెట్టలేక ఈ పనిలో పెట్టాడు. తమ దయ ఉంటే మీ పేరు చెప్పుకుని చదువుకుంటాను.' అన్నాడు గోపాలం.

పెద్దయ్యగారు పడకకుర్చీలోంచి కష్టపడిలేచి 'ఏడిశావు లేవోయ్! చదువుట, చదువు! చెప్పిన పని చెయ్యలేక చతికిలబడుకున్నావు! చదువొక్కటి తక్కువైంది నీకు. చదువుకునే యోగ్యతే ఉంటే ఈ కర్మ మేమిటి? పో పో! భోంచేసిరా! బళ్ళోకి వెళ్ళాలి!' అన్నారు మండిపడుతూ.

గోపాలానికి కళ్ళనీళ్ళు గిఱ్ఱున తిరిగాయి. అలాగే తలవంచుకొని నట్టెండలో ఇంటిదారి పట్టాడు తన కర్మ ఏమిటో తనకే బోధపడక మనసులో బాధపడుతూ!

'బళ్ళోకి వెళ్ళాలి! బళ్ళోకి వెళ్ళాలి!' అనే మాటలు అతని చెవుల్లో గింగురు మంటున్నాయి దారి పొడుగునా!

* * *

ఇప్పటికీ పాపం గోపాలం బళ్ళోకి వెళ్తూనే ఉన్నాడు. గంటలు కొడ్తూనే ఉన్నాడు.



హృదయము - నల్లబల్ల

✽

= శ్రీ గౌరావఝ్ఝల వెంకటసుబ్బరామయ్య =

నీమీద నామీద
నిత్యమ్ము ఎన్నెన్నో
గీతలూ గీస్తుంటు
చెరుపుతుంటూరు
చెరిపి మరలా క్రొత్త
రాత రాస్తుంటారు
ఇద్దరికి ఇది యేటి సంబంధమే!
ఫలకమా!
మన రూప మొకటేనటే!

ఆ గీత లెందరికో
ఆదర్శమవుతాయి
ఆదర్శమై వారి
కానందమిస్తాయి
మార్గాన్ని చూపుతూ
ముందుకీ తోస్తాయి
ఇద్దరికి ఏనాటి సంబంధమే!
ఫలకమా!
ఇద్దరీ పుణ్యంబు ఒకటేనటే!

నీమీద గీతలూ
గీస్తూనువుండాలి
గీసినా గీతలూ
చెరుపుతూవుండాలి

నామీద గీతలవి
గీచుకోపోతాయి
తుడుచుగూ పోతాయి
నాటుచూ పోతాయి
నిన్ను నీవూకూడ
కదిలించుకోలేవు
నన్ను నేనే కాదు
లోకాల్ను కదిలిస్తా
ఇది యేటి వ్యత్యస్తమే
ఇద్దరిలో
ఏనాటి వైషమ్యమే!

గాఢాంధకారంలో
కదలి తోడై వత్తు
దుఃఖ సాగరమందు
నావనై దరిజేర్తు
సుఖములో నే నెంతో
ఉప్పొంగి పోవుదూ
నవ్వులో ఏడ్పిస్తు
ఏడ్పులో నవ్విస్తు
తియ్యనీ రాగాలు తీయిస్తునే
ఫలకమా!
నాతోటి జగమున్నదే.

—:o:—

జాన్ కీట్సు - ఆయన కవిత్వం

= శ్రీ చతుర్వేదుల నరసింహశాస్త్రి =

"కీట్సు ఇంకో ఆరంగుళాల పొడుగుంటే ఆంగ్లసాహిత్యచరిత్ర మరోక తీరుగా వుండేది!" అని చమత్కరించాడు మిడిల్టన్ మర్రే అనే విమర్శకుడు.

ఇది చదవగానే కవిభౌతికానికీ, కవిత్వచరిత్రకీ సంబంధమేమిటి అని సందేహం కలుగుతుంది. కీట్సు కేవలం అయిదడుగుల మనిషిట. తనపొట్టివాడినని ఎంతో గునుపుగావుండేవట. అంత పొట్టిగా వుండటంవల్లనే తను ఎంత ప్రేమించినా ఫేనీ బ్రాన్ (కీట్సుప్రేయసి) తనని ప్రేమించటం లేదని బాధపడేవాడుట. నిజంగా ఇంకో అయిదారంగుళాల పొడుగుంటే కీట్సుని ఫేనీ మనసారా ప్రేమించేదేమో! తన ప్రేమ భగ్నమైనదనే వ్యథ లేకపోయేదేమో? అప్పుడు కీట్సు ఎటువంటి కవిత్వం వ్రాసేవాడో? అప్పుడు ఆంగ్లసాహిత్య చరిత్రలో ఎటువంటి స్థానాన్ని ఆక్రమించేవాడో!

కాని, పాపం కీట్సు అయిదడుగుల పిట్టమనిషిగానే జీవించవలసివచ్చింది. అదయినా పట్టుమని పాతిక ఏళ్లే.

అయినప్పటికీ ఈ పాతికేళ్ల పిట్టమనిషే అద్భుతమైన విషయాన్ని సాధించాడు. కవిత్వంలో అత్యున్నతశిఖరాలని ఆరోహించాడు. ఇరవైనాలుగోయేట షేక్స్పియరుగాని, స్పెన్సరుగాని, మిల్టనుకాని, పోప్ కాని, వర్డ్స్వర్తుకాని రాసిన కవిత్వాన్ని కీట్సు ఇరవైనాలుగోయేట రాసిన కవిత్వంతో పోలిస్తే వెలవెలబోతుంది. అంత చిన్న వయసులో ఇంకే ఇంగ్లీషుకవీ చెప్పుకోదగిన కవిత్వం రాయలేదు. ఇతరకవులు ఓనమాలు దిద్దిన వయస్సులో కీట్సు కవిత్వంలో చిటారుకొమ్మ లందుకోగలిగాడు. ఇంకేకవీ ఇరవైనాలుగోయేట శాశ్వతంగా నిలిచే కవిత్వం రచించలేదు. కాని ఇరవైనాలుగేళ్లకే కీట్సు కలకాలమూ నిలబడగల కవిత్వాన్ని ప్రసాదించి తన జీవితాన్ని ముగించాడు.

ఇరవైనాలుగేళ్లకే ఇంతగొప్ప కవిత్వం రాశాడు గదా, ఇటువంటి కీట్సు అందరిలాగే ఇంకా నాలుగు కాలాలపాటు బతికితే ఎంత బాగుండేది? ఇంకెంత గొప్ప కవిత్వం రాసేవాడో? షేక్స్పియరుని మించిపోయేవాడేమో? మిల్టన్ని తలదన్నేవాడేమో?— నిజంగా ఊహించదగ్గవిషయమే.

కాని కొందరు విమర్శకులు కీట్సువిలువని తెలుసుకోలేకపోయారు. అనుభవంలేని, జ్ఞానంలేని యువకుడని చులకనచేశారు. కమ్మగా కవిత్వం రాస్తాడు. అంతకి తప్ప చెప్పుకోదగ్గ గుణమే లేదు అని తేలిగ్గా కొట్టిపారేశారు.

పూర్తిగా వీరికి వ్యతిరేకంగా కొందరు. "అతను షేక్స్పియర్ తరగతివాడు" అన్నాడు ఆర్నాల్డు. రాబర్ట్‌బ్రిడ్జెస్, మిడిల్టన్ మర్రీవంటి నిశితవిమర్శకులెందరో ఆ అభిప్రాయాన్నే బలపరిచారు.

మొత్తంమీద కీట్సు షేక్స్పియరుతరగతివాడనే సంగతి కాలమే నిర్ణయించింది. ఈనాడు దీన్ని కాదనగలవారు లేరు.

నిజంగా కీట్సు ఇంకొన్ని సంవత్సరాలు బతికితే షేక్స్పియర్ మాదిరి మహాకవి అయేవాడా? మిల్టన్ మాదిరి కవివరు డయేవాడా? అన్న ప్రశ్నకి మర్రీ సమాధానం చెప్పాడు. కీట్సు షేక్స్పియర్ నడిచిన బాటలోనే అడుగులు వేశాడు. ఇంకా బతికివుంటే మరోక షేక్స్పియరే అయేవాడు అన్నాడు.

ఇక్కడ మిల్టన్నీ, షేక్స్పియర్నీ ఒకరు ఎక్కువ అనటానికిగాని, ఒకరు తక్కువ అనటానికి

గాని ఉదాహరించటం లేదు. ఇద్దరూ కవిత్వంలో రెండు పద్ధతులకి ప్రతినిధులు. ఇవి చాలా భిన్నమైనవి. తన వ్యక్తిత్వాన్ని పాత్రలలో లీనం చేసే పద్ధతి షేక్స్పియరుది. అన్నిటినీ తనలో కలుపుకుని, అన్నిటిమీదా తన ముద్రవేసి తన వ్యక్తిత్వానికి ప్రాధాన్య మిచ్చే పద్ధతి మిల్టన్‌ది. ఈ రెండు పద్ధతులలో కీట్సుకి ఏది ఇష్టం? దేన్ని అనుసరించేవాడు? షేక్స్పియరునే అనుసరించేవా డని నిస్సందేహంగా చెప్పచ్చు.

ఈ విషయం కీట్సు స్వయంగానే వెల్లడించాడు. అతని కవిత్వాదర్శాన్ని బట్టికూడా ఈ సంగతి తెలుసుకోగలం.

కీట్సుదృష్టిలో కవికి ఉండవలసిన ముఖ్యలక్షణం ఒకటి. అది షేక్స్పియరులో మూర్తీభవించిందని గుర్తించాడు. దాన్ని అలవరుచుకోవటంకోసం తను పాటుపడ్డాడు. అదేమిటంటే—"Negative Capability" అన్నాడు. ఈ శక్తి ప్రతికవికీ ఉండితీరాలి.

ఇది ఎటువంటి శక్తి? దీని అర్థం ఏమిటి? అనే ప్రశ్నకి కీట్సు మంచి సమాధానం చెప్పాడు. కవికి తనదీ అని చెప్పుకునే రూపం లేదుట. తను ఏది కాదలుచుకుంటే అది అయిపోవాలి. కొండలమీదినుంచి దుమికే జలపాతంతోనూ, ముక్కుతో గులకరాళ్లని పొడిచే పిచ్చుకతోనూ, ప్రాణంవున్న వాటితోనూ, లేనివాటితోనూ కలిసిపోగలగాలి. తన మనసులో పక్షపాతం వుండకూడదు. అన్నిరకాల భావాలకీ తన బుద్ధిని రహదారి చెయ్యగలగాలి. దూరంగా మడికట్టుకుని కూచుని, తన కొలతబద్దలతో జీవితంలోని అనుభవాలన్నిటినీ కొలవగూడదు. తన సంకుచితదృష్టితో వ్యక్తులనీ, వ్యవస్థలనీ విచారణచేయటానికి పూనుకోరాదు. తన సుఖదుఃఖాలనీ, ఇష్టాయిష్టాలనీ దూరంగా తోసి ఇతరుల సంకటాలలో, కష్టాలలో కలిసిపోగలగాలి. తన స్వార్థాన్ని, తన వ్యక్తిత్వాన్నీ అణచివేసుకోగలగాలి. అప్పుడే కవి స్వచ్ఛమైన అద్దం అవగలడు. అప్పుడే అతనిలో లోకం ప్రతిబింబించగలదు.

మొత్తంమీద కీట్సు కోరేవి రెండుగుణాలు. కవి తన వ్యక్తిత్వాన్ని బుద్ధిపూర్వకంగా తుడిచివేసుకోగలగటం మొదటిది. ఎన్ని తప్పిదాలున్నా, లోపాలున్నా మన్నించి సంతానాన్ని ప్రేమించే తల్లిలాగా కవి అన్నిరకాల వ్యక్తులనీ, అన్నివిధాల అనుభవాలనీ సానుభూతితో చూడగలగాలి—ఇది రెండవది.

ఈ రెండుగుణాలూ షేక్స్పియరులో మూర్తీభవించినయ్. అందుకే అన్నిరకాల పాత్రలనీ అంత స్వాభావికంగా సృష్టించగలిగాడు. అందుకే సుగుణరాశియైన ఇమోజన్‌పాత్రని ఎంత సానుభూతితో చిత్రించాడో, కుటిలుడైన ఇయాగోపాత్రనికూడా అంత సహజంగా పోషించగలిగాడు.

అటువంటి స్థితిని తనుకూడా చేరుకోవాలని కీట్సు ఎంతో ప్రయత్నించాడు. నలుగురు మిత్రులతో మాట్లాడుతూ ఒక గదిలో కూచుంటే తన సంగతి మరిచిపోయేవాడట. వారి నలుగురిలోనూ తను లీనమైపోయేవాడుట. ఇవి కీట్సు చెప్పిన మాటలే. మరి ఇటువంటివాడు ఇంకా నాలుగుకాలాలు బతికివుంటే షేక్స్పియరుమాదిరి కవే అయేవాడుకదూ? ఏ పరిస్థితిలో వున్నా తన సంగతిని మరిచిపోలేని మిల్టన్‌తో కీట్సుకి ఎల్లా పొత్తు కుదురుతుంది? అందుకనే కొంతకాలం మిల్టన్‌ని అనుకరించి చివరికి తప్పు తెలుసుకుని "ఏది మిల్టన్‌కి ప్రాణప్రదమో అది నాకు మృత్యువువంటిది" అని కీట్సు చెప్పాడు. కాని మిల్టన్‌కీ, కీట్సుకీ ఒక విషయంలో పోలిక వుంది. ఇద్దరికీ మాటలమీద మక్కువ. "ప్రేయసిమీద ప్రియుడికి ఎంత ప్రీతివుంటుందో చక్కటి సమాసాలమీద నాకు అంత మక్కువ" అని కీట్సు స్వయంగానే చెప్పుకున్నాడు.

కవిలక్షణాన్ని గురించేకాక కవిత్వలక్షణాన్ని గురించికూడా కీట్సు కొన్ని స్వతంత్రమైన అభిప్రాయాలని వెల్లడించాడు. కవిత్వం పదజాలంతో చదివేవాళ్లని ఖంగారుపెట్టరాదు. చదివేవారి హృదయంలో చల్లగా ప్రవేశించాలి. శిల్పచాతుర్యంతో చదువరిని మిరుమిట్లుకొలపకుండా వస్తువిశేషంవల్ల

రంజింపజేయాలి. కవిఅనుభవాలే ప్రధానం. వీటిని వెల్లడించటానికి కవిత్వం కేవలం ఉపకరణం.

కవిత్వంలోని భావాలు ప్రతివాడి అనుభవానికీ అందేవిగా వుండాలి. కవిపలుకులు వింటున్నప్పుడు తన తలపులే అనుకోవాలి చదివేవాడు. "నేను ఎప్పుడూ అనుభవించేదే కవి చెబుతున్నాడు. అనుభవించినా నాకు చెప్పటం చేతకానిది కవి చెబుతున్నాడు" అని చదివేవాళ్లు అనుకునేట్లుగా వుండాలి. ఎక్కడా లేనిది తెచ్చి కవి తనకి అందించటం లేదనీ, సుర్తుకి తెచ్చుకుంటే అటువంటి భావం తనకీ ఎప్పుడో కలిగి వుంటుందనీ చదివేవాళ్లు అనుకోవాలి. అసాధారణ విషయాన్ని చెప్పటమే కవిగొప్పతనం కాదు. సర్వ సాధారణవిషయాన్ని అందంగా చెప్పి రంజింపజేయ టమే కవికర్తవ్యం.

కవిత్వం చదివేవాళ్ల మనస్సుల్లో అశాంతినీ, ఆ వేదననీ రగిలించకూడదు. ఒక కొత్తదృష్టిని పొంది నందుకు ఆనందమూ, సంతృప్తీ పాఠకులకి కలగాలి. కవికల్పనా, శిల్పమూ ఉషస్సులాగా మనోహరంగా ఆరంభించాలి. సూర్యకాంతిలాగా చదువరిని ఆవరిం చాలి. చివరికి వచ్చేసరికి క్రమంగా అంతమైపోయి సంజెవెలుగుల జిలుగులతో చదువరిమనసుని అలుముకో వాలి. ఈ విధమైన క్రమపరిణామం కవికల్పనలకి వుండితీరాలి.

చెట్లకి ఆకులు వచ్చినట్లుగా కవికి కవిత్వం రావాలి. లేని కవితావేశాన్ని బలవంతాన తెచ్చి పెట్టుకోకూడదు. కవిత్వం సహజంగా రావాలి.

ఈ లక్షణాలకి ఉదాహరణలు కావాలంటే కీట్సుకవిత్వంలోనే దొరుకుతాయ్. అయినప్పటికీ కీట్సుకవిత్వంలో సమాసాల ఇంద్రజాలమే కాని ఆలోచనాశక్తి లేదని కొందరి ఆక్షేపణ. దీన్ని పూర్తిగా కాదనటానికి వీలులేదు. కీట్సుకీ, ఆలోచ నాశక్తికీ సరిపడదు. భావనాబలమే కీట్సు అపార సంపద. కనకనే కీట్సు భావకవులకి మూలవిరాట్.

భావకవులందరి మాదిరిగానే కీట్సుకూడా జీవితంలోని దుఃఖాలకి దూరంగా వుంటాడనీ, శృంగా రమూ సౌందర్యమూ ప్రేమా అంటూ లోకానికి ఎడంగా విహరిస్తుంటాడనీ చాలమంది అభిప్రాయం. కీట్సుకవిత్వం కళ్లకీ, చెవులకీ విందుగా వుంటుందికాని మనస్సుకి సంతృప్తినివ్వదని చాలామంది అభిప్రాయం. ప్రజాజీవనాన్నీ, వాస్తవప్రపంచంలోని కష్టసుఖాలనీ, ఉద్యమాలనీ, విప్లవాలనీ, అభ్యుదయాన్నీ వదిలివేసి కేవలం ఊహాగానం చేస్తాడని వీరి అభియోగం.

కాని ఈ వాదంలో సత్యంలేదు. కీట్సు జీవి తాన్ని చూసి బెదిరిపోయి కవిత్వమనే కల్పితలోకా నికి పారిపోయే పిరికిపంద కాదు. ఎన్నిదుఃఖాలు వచ్చినా తట్టుకుని నిబ్బరంగా నిలబడగలిగాడు. తన తమ్ముడు క్షయవ్యాధితో మంచంపట్టి దినదినమూ క్షీణించిపోవటం కళ్లారా చూశాడు. తమ్ముడు మర ణించేవరకూ మంచంవిడవకుండా ఉపచారాలు చేశాడు. అప్పటికే తనలోకూడా క్షయ అంకురించిందని కీట్సుకి తెలుసు. తనుకూడా తమ్ముడిలాగే యాతనపడి క్రమంగా మృత్యువుకిక్కడికి ప్రయాణం చెయ్యాలని తెలుసుకున్నాడు. తను ఇంకెంతోకాలం బతకడని కూడా కీట్సుకి రూఢిగా తెలుసు. అటువంటి స్థితిలో కీట్సుకి కవిత్వంతప్ప ఓదార్పు వేరేముంది? అతను మనసారా ప్రేమించిన ఫేనీ అతన్ని అంతగా ప్రేమించ లేదు. అతన్ని తిరస్కరించి ఇంకొకడిని చేపట్టింది. ఈతిర స్కారాన్ని, ఈ పరాభవాన్ని ఎంతో ధైర్యంతో కీట్సు సహించాడు. అన్నిటిలోనూ సౌందర్యాన్ని దర్శించా లనే ఆదర్శంతో కీట్సు తపస్సు చేస్తున్నాడు. తను గమ్యాన్ని చేరకమునుపే, తను సాధించదలిచిన ప్రయో జనం సిద్ధించకమునుపే తను చనిపోతానేమోననే భయా న్నికూడా కీట్సు ఎదుర్కొనగలిగాడు. అటువంటి కీట్సు శుష్కమైన మాధుర్యంకోసం కవిత్వం రాశాడనటం సమంజసం కాదు. అన్నిటిలోనూ అందాన్ని కను గొనాలనే తపస్సులో కవిత్వాన్ని సాధనగా వినియో గించాడు. అందువల్లనే కీట్సుకవిత్వానికి ప్రయోజన లేదనటం, కవిత్వంలో గాంభీర్యం లేదనటం అబద్ధం.

అసలుకి, కీట్సుప్రేమవృత్తాంతమే ఒక విషాద గాథ. అతనొక సాధారణస్త్రీని ప్రేమించాడు. ఆమె పేరు ఫేనీబ్రాన్. నిజం చెప్పాలంటే కీట్సుకి ప్రేయసి

కావదగిన అర్హత ఆమెకి లేశమైనా లేదు. కాని ప్రేమ గుడ్డిది. అందులో కవిప్రేమ మరీ గుడ్డిది. తన ప్రేమాతిశయంవల్ల కీట్సు 'ఫేనీ ఒక దేవత' అనుకున్నాడు. ఆమెలో లేని గుణాలనీ, గొప్పతనాన్నీ ఆమెకి ఆపాదించాడు. తనని మనసారా ప్రేమిస్తుం దనుకున్నాడు. తనని చక్కగా అర్థంచేసుకోగల దనుకున్నాడు. ఫేనీ తప్ప వేరే ప్రపంచమే లేదనుకున్నాడు. అంతగా ప్రేమించాడు. కాని చివరికి ఫేనీ తన నిజస్వరూపాన్ని బైటపడేసుకుంది. తను సాధారణ స్త్రీ. తను కీట్సుని ఎందుకు ప్రేమించాలి? అతనిదగ్గర అందం లేదు; ధనం లేదు. కవి అయినంతమాత్రాన తనకి ఒరిగేదేమిటి? అతని మాటలూ, అతని వర్ణనలూ తనకేమయినా అర్థమౌతయ్యా? ఫేనీ కీట్సుగుండెల్లో చిచ్చురగిల్చింది. అతని కలలన్నిటినీ కూల్చివేసింది. అతని ప్రేమని భగ్నం చేసింది. తను నిశ్చింతగా మరొకడిని పెళ్లి చేసుకుంది. ఇందులో ఫేనీతప్పు లేదు. కీట్సుదీ తప్పు లేదు. ఇది కవుల అవివేకమని చెప్పాలి. సామాన్యమైనవారిలో అసాధారణమైన గుణా లున్నయ్యని వాళ్లు భ్రమపడతారు. అవి లేవని తెలిసేసరికి తలకిందులై పోతారు. తమ భ్రాంతిని అప్పటికి తెలుసుకుంటారు.

ఈ భగ్నమైపోయిన ప్రేమగాథ కీట్సుజీవితాన్ని విషాదాంతం చేసివేసింది. కాని కీట్సు ధైర్యాన్ని కోలుపోలేదు.

చివరికి ఇరవై నాలుగోయేట, తను తలపెట్టిన 'హైపరియాన్' అనే కావ్యాన్ని మధ్యలోనే వదిలేసి కీట్సు మరణించాడు. అతను చనిపోయేముందు అతని 'ఎండిమియాన్' కావ్యంమీద కొందరు దారుణమైన విమర్శలు రాశారు. వీటి ధాటికి తట్టుకోలేక నే కీట్సు చనిపోయాడని బైరన్, షెల్లీలాటి మిత్రులంతా అనుకున్నారు. జీవితంలో అంతదుఃఖాన్ని ఎదుర్కొనగలిగిన కీట్సు కేవలం విమర్శలధాటికి తట్టుకోలేక ప్రాణం విడిచా డనటం వింతసంగతి. కీట్సు అంత బలహీనుడు కాడు. క్షయవ్యాధే అతని ప్రాణాన్ని హరించి ఆంగ్ల సాహిత్యానికి గొప్ప అన్యాయం చేసింది.

చనిపోయేముందు కీట్సు రాసిన 'హైపరియాన్' చాలా ముఖ్యమైన కావ్యం. ఇందులో కీట్సు మహాకవి పదవిని అందుకోబోతున్నట్లు సూచనలు కనబడతయ్. మహాకవులందరూ గ్రహించిన సత్యాన్ని కీట్సుకూడా గ్రహించాడు. ఆ సత్యం ఏమిటంటే—తను ఇంతకాలమూ కవిత్వమనే ఆలయానికి బైటమెట్లమీద నే నిలబడివున్నట్లు తెలుసుకోగలిగాడు. తనకు ఆలయంలోని గర్భగుడిలోకి పోయే తాహతు లేదని గ్రహించాడు. కవి జగత్తుతో కలిసిపోవాలి. జగత్తుదుఃఖాలన్నీ కవి తన దుఃఖాలైనట్లే బాధపడాలి. అప్పుడే కవి కవిత్వమనే ఆలయంలోని గర్భగుడిలోకి ప్రవేశించగలుగుతాడు. అప్పుడే కవి మహాకవి కాగలుగుతాడు. ఆ విధంగా లోకంతో కలిసిపోగలిగినప్పుడే కవి గొప్ప కవిత్వాన్ని సృష్టించగలుగుతాడు.

ఈ సత్యాన్ని కీట్సు దర్శించగలిగాడు. ఆచరించి గొప్ప కవిత్వం రాయబోయే సమయానికే మృత్యువు కీట్సుప్రాణాన్ని దొంగిలించింది. అతని పరిణతమైన కవిత్వాన్ని అనుభవించే భాగ్యం ఆంగ్ల సాహిత్యానికి లేకపోయింది. ఇది ఒక్క ఆంగ్లసాహిత్యానికేకాక విశ్వసాహిత్యానికికూడా తీరని కొరత.

ఇరవై నాలుగేళ్ల కే కీట్సు మరణించాడు. "ఎవరు దేవతలకి ప్రియతములో వారు యౌవనంలోనే చనిపోతారు" అనే సామెత కీట్సుపట్ల ఎంతో సత్యం!



మంత్రాంగం

[ఏకాంకిక]

= శ్రీ జి. యస్. సూరి =

మొదటిరంగం

[మంగళాపురంలో గ్రామకచ్చేరీసావడి. ఒక నాటి సాయంసమయం]

కరణం—మోతాదూ! ఓరే మోతాదూ!

మోతాదు—(ప్రవేశిస్తూ) అయ్యా అయ్యా, వత్తుండ.

కర—ఈవసారాలో చాప ఒకటి వేసి ఆదస్త్రం ఇక్కడ పెట్టు.

మోతా—చిత్తమయ్యా చిత్తం.

(లోపలికిపోయి చాప తెచ్చి వేసి, దస్త్రాన్ని పెట్టి ప్రక్కగా నిలబడుతాడు)

కర—(చాపమీద కూర్చుని దస్త్రం విప్పుతూ) మునసబుగారు ఊరునుంచి వచ్చాడంట్రా?

మోతా—మద్దినాలదాకా రాలేదండి.

కర—ఊఁ...చౌదరమ్మగారికి రశీదు అందజేశావా?

మోతా-బుర్ర కెల్లినప్పుడు తీసికెళ్లి ఇచ్చానండి.

కర—సరేగానీ, సిద్ధాంతిగారు ఈవేళకూడా డబ్బు చెల్లించిపోలేదే! హెచ్చరించి రాకపోయినావా?

మోతా—నే నీకడ వత్తావుంటే సుబ్బయ్య శెట్టితో ఏదో మాట్టాడుకుంటాడు. ఇయ్యాళైనా తాశీలు కడితేనేగాని యీలులేదన్నారు కరణంగారని చెప్పానండి. కూసేపుండి ఈడకొచ్చి తమరితో మాట్టాడిపోతా నన్నాడు.

కర—అదుగో రానేవస్తున్నాడు... మరి నీవు వెంకటరెడ్డిగారింటికి వెళ్లి, కందులున్నయ్యన్నాడు గాని, మన ఇంటిదగ్గర పడవేసిరా...ఇదుగో చూడు! దోవలో సుబ్బన్నశెట్టి పొగాకేమైనా తెచ్చాడేమో చూసి రెండుతాళ్లు ఏరి తీసుకురా. పొర బాగాఉన్న కాడలుగా చూడు. తెలిసిందా?

మోతా—చిత్తం. అట్టాగేనండి. (వెళ్లిపోతాడు)

సిద్ధాంతి— (ప్రవేశించి) నమస్కారం కరణం గారూ. సాయంత్రంపూటకూడ దస్త్రం ముందువేసుకుని కూర్చున్నారే!

కర—ఓహో సిద్ధాంతిగారా! రండి; కూర్చోండి ...మామూలు రోజులు వస్తే మాకు ప్రొద్దుననీ, సాయంత్రమనీ భేదమేముంటుంది! ... అయితే, మీతాశీలు ఇంకా కట్టినట్లు లేదే?

సిద్ధాం—రేపో మాపో కట్టివేస్తానులెండి.

కర— రేపో మాపో అంటారేమండీ! ఎల్లుండి తెల్లవారేసరికి తాశిల్దారు వచ్చిపడుతున్నాడు. రేపు సాయంత్రంలోగా కట్టకపోతే మాట దక్కదు సుమండి!

సిద్ధాం—కొట్లో పోసిన ధాన్యాన్ని సుబ్బయ్య శెట్టికి బేరంఇచ్చాను. కొలగారానికి రమ్మంటే ఇవ్వాళ శుక్రవారమనీ, రేపు అమావాస్యఅనీ వీలుకా

దన్నాడు. ఎల్లుండికయితే తప్పకుండా చెల్లించుకుంటాను.

కర-ఈ శుక్రవారాలూ అమావాస్యలూ సర్కారు వ్యవహారాలకా చెప్పండి సిద్ధాంతిగారూ? ఇప్పటికే ఎంతో ఆలస్యమయింది. అనవసరంగా పైఅధికార్ల చేత నేను మాటపడేవాడిని కాదు. రేపటికైనా ఎట్లాగో చూడకతప్పదు.

సిద్ధాం—మీరుఅలా శెలవిస్తే మాలాటివాళ్లు మనగలరా? మా కష్టసుఖాలనుకూడ తమరు కొంచెం గమనించాలి. ఏదో మీ ప్రాపున బ్రతికేవాళ్లం. ఆ మాత్రం కనిపెట్టిఉండకపోతే ఎలాగు చెప్పండి!

కర—ఎంత ముఖప్రీతిమాటలు సిద్ధాంతిగారూ! మేము నిజంగా మీకు లెక్కలో ఉన్నామంటారా?

సిద్ధాం-అదేమిటి కరణంగారూ, అలా శెలవిస్తారు! తమకంటె నాకు ముఖ్యులు మరెవ్వరున్నారండి!

కర—ఎందుకు చెపుతారండీ ఈ బులిబుచ్చికపు కబుర్లు! కరణం అంటే గడ్డిపోచగా చూస్తూ, అవసరం వచ్చినప్పుడు 'అంతవాడివీ ఇంతవాడివీ' అంటే ఏం ప్రయోజనం?

సిద్ధాం—రామరామ! ఎంతమాట, ఎంతమాట! గడ్డి పోచగా చూడడానికి గుండె దెరువా?

కర—'అతివినయం ధూర్తలక్షణం' అని పెద్దలు ఊరికే అన్నారా? ఏం చేస్తాం! మేమంటే వేళాకోళమయిపోయింది.

సిద్ధాం—తమధోరణి నాకేమీ బోధపడడం లేదు. ఎందుకు నామీద ఇంత ఆగ్రహం కలిగిందో అంతు పట్టకుండా ఉన్నది.

కర—అట్లాగే ఉంటుంది. ఉండదు మరీ? నడమంత్రపు సిరి వచ్చినా, నరాలమీద పుండు పుట్టినా నిలంబనిస్తుందా!

సిద్ధాం—ఇంతకఠినంగా నన్ను తూలనాడడానికి నా వల్ల జరిగిన అపరాధ మేమిటో చెప్పివేస్తే సవరించుకోటానికైనా ప్రయత్నిస్తాను.

కర—అపరాధ మేమిటిలెండి. అయినా నానోటి మీదుగా అనిపించాలనిగాని మీకుమాత్రం తెలియకుండానే ఉన్నదంటారా?

సిద్ధాం-హరిహరీ, నా కేమీ పాలుబోవటం లేదు.

కర-అయితే చూడండి సిద్ధాంతిగారూ. మొన్న దశమినాడు మా యింట్లో తిథి ఉన్నదని మోతాదు వచ్చి మీకు చెప్పేవరకూ మీరు ఎరగరేం? పోనీ, ఆ తరువాతనైనా మంత్రం చెప్పేందుకు ఒక కుఱ్ఱవెధవను పంపుతారూ!

సిద్ధాం—అదన్నమాట నా అపరాధం. ఇక నామనవివినండి. నేను మీ ఇంటికి పంపిన శేషయ్యశాస్త్రిల్లు మా మేనల్లుడే. ఈ మధ్యనే వాడికి వివాహంఅయింది. అప్పటినుంచి పంచాంగగణితమూ, జాతకముహూర్తాదులూ నేను ఉంచుకొని, ఊరి పౌరోహిత్యం వాడికి ఒప్పగించాను. 'ప్రమాదో ధీమతామపి' అని వాడు మిమ్మల్లను ముందుగా హెచ్చరించటం మరచిపోయి ఉంటాడు. అంతేగాని బుద్ధిపూర్వకంగా తమపట్ల పొరబాటుచేస్తామా?

కర—అయితేమటుకు పెద్దా చిన్నా వ్యత్యాసం చూపనక్కరలేదూ? ఆ లొట్టికాయకు నేను కాళ్లు కడిగి నెత్తిన చల్లుకోవడమా! మంచిమాటే.

సిద్ధాం—మంత్రంచెప్పే విషయంలో ఇలాంటి ఆక్షేపణ ఉండకూడదని మనవిచేస్తాను. అదీగాక మా వాడుకూడ డొక్కశుద్ధి కలిగి చక్కగా వేదం చదువుకొన్నవాడు.

కర—లక్షణంగానే ఉన్నది మీ సమాధానం. విశ్వాసమునేది పూర్తిగా మరచిపోకూడదు. శాస్త్రం చదివినవారికి ఆమాత్రం తెలియదూ?

సిద్ధాం— కృతఘ్నత మాఇంటా వంటా లేదు కరణంగారూ. మీరు అలా శెలవిస్తే నేను ఏమనేది!

కర-విషయం వచ్చిందికాబట్టి చెపుతున్నాను. మొట్టమొదట మీరు ఎటువంటి స్థితిలో ఈ వూరు వచ్చిందీ, ఏవిధంగాన్నూ, మీకు నేను సహాయంచేసిందీ బొత్తిగా మరచిపోయినట్లున్నారు. ఇప్పుడు మీరు అనుభవిస్తున్న సుక్షేత్రమైన ఆ ఆరుఎకరాల మాగా

పొలమూ, ఆఇల్లూ ఎవరి దోహదంవల్ల ప్రాప్తించినవో కాస్త జ్ఞాకం తెచ్చుకోండి.

సిద్ధాం— చనిపోయి ఏలోకానున్నాడో ఆ మహానుభావుడు, నిత్యానందంగారు! ఆయనధర్మాన పధ్నాలుగేళ్లనుంచీ అనుభవిస్తూ హక్కుభుక్తమయిన ఆస్తి మీవల్ల నాకు లభ్యమయిందనడం న్యాయమేమో మీరే సెలవియ్యండి కరణంగారూ.

కర—అవునులేండి. అవసరం తీరినతరువాత అయినవాండ్లే అన్యులౌతారు. ఇక మాబోటివాళ్లు అసలు గుర్తేరారు...సరే కానివ్వండి.

సిద్ధాం—(లేచినిలబడి)అయ్యా కరణంగారూ! మరియాద అనేది ఇచ్చిపుచ్చుకోవలసినది. అనవసరంగా నిందిస్తుంటే ఊరుకుని పడిఉండడానికి నేనేమీ మీ దయాధర్మభిక్షమీద ఆధారపడి ఉండలేదు.

కర—ఊఁ...బాగానే ఉన్నది. తొండ ముదిరితే ఊసరవిల్లి అవుతుందిట. మాకు నీతులుకూడ చెప్ప వచ్చారూ! ఊఁ.

సిద్ధాం—చూడండి. మీ మీద ఉండే గౌరవంవల్ల ఇంతవరకూ ఓర్చుకోగలిగాను. ఈ విధంగా నోటికివచ్చి నట్లు దులిపివేస్తుంటే ఎవరికైనా కష్టంగానే ఉంటుంది. అయినా మీతో నాకీవాదం ఎందుకు లేండి. సర్కారుకు చెల్లించవలసిన తాశీలును తల కాయ తాకట్టుపెట్టి అయినా రేపీపాటికి కట్టిపోతాను. ఆతరువాత మీ రిక నన్ను చేయగలిగిన దేమున్నది!

కర—(చురచుర చూస్తూ) సిద్ధాంతిగారూ! ఇప్పుడు మీరు అన్నమాట బాగా జ్ఞాపకం ఉంచుకోండి. ఈ కరణం చేతగాని వట్టి చచ్చుపెద్దమ్మ అనిగామా మీ ఉద్దేశం? సరే చూతాం కానివ్వండి.

సిద్ధాం—గ్రహవీక్షణ చక్కగా ఉంటే ఎవరు ఏంచేస్తారులేండి! ఇదంతా ఎందుకుగాని, శెలవు పుచ్చుకుంటాను. (వెళ్లిపోతాడు)

కర—సిద్ధాంతిగారికి భూమిచుట్టూ ఉన్న గ్రహాల విషయం తెలిసినట్లు భూమిమీద ఉండే గ్రహాల శక్తి సామర్థ్యాలు అర్థమైనట్లు లేదు...గ్రహవీక్షణట గ్రహవీక్షణ...హ హ్హ హ్హ హ్హ!

[తెర]

రెండవరంగం

[కరణంగారి ఇంటిదగ్గర—మరునాటి ఉదయం. కరణం చుట్ట కాలుస్తూ స్తంభానికి ఆనుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తూఉంటాడు]

సుబ్బయ్యశెట్టి—(ప్రవేశించి) దణ్ణం పెడతా కరణంగారికి.

కర—ఇట్లా వచ్చి కూర్చో సుబ్బన్నశెట్టీ... ఏమిటి విశేషం?

శెట్టి— ఏమీ లేదు కరణంగారూ. పుగాకు కావాలని నిన్న మీ మెహతాదు అంటేనూ, ఇచ్చిపోదామని వచ్చాను.

కర—నాదగ్గరటోయ్ నీమాటలు? బేరం జరిగే వేళ ఈ మాత్రానికే కొట్టుదిగి వచ్చావంటే నమ్మమంటావా? అసలు పనేమిటో చెప్పు.

శెట్టి—ఆఁ, ఏమంత పనిలేండి. అయినా, పొద్దున లేస్తే మీ దగ్గరకు రాకుండా జరుగుతుందా మాకు; కరణంగారూ!

కర—అదుగో, నేచెప్పలే! ఊఁ. కానియ్యి. చల్లకొచ్చి ముంతదాచట మెందుకు?

శెట్టి—మనవిచేస్తా...మాఅమ్మ కాలంచేయటం మీరు ఎరుగుదురుకదా. రేపు వచ్చే ఏకాదశికి ఏడాది నిండుతుంది. ఏదో ఆమెపేరున చిన్న సత్రమొకటి కట్టిద్దామని ఆలోచనపుట్టింది. దానికి మీరేం చెప్తారో అడుగుదామని వచ్చాను.

కర—నీ కా బుద్ధి పుట్టాలిగాని, అంతకంటే సత్కార్యం ఏముంటుంది? అవశ్యం కట్టితీరవలసిందే.

శెట్టి— మచ్చుకుగాను ఈ యేడు పసుపు వ్యాపారం కొంచెం చేసి చూశాను. మీదయవల్ల కాస్త కలిసివచ్చింది. అందుకని తేలికలో ఏదైనా వీలవుతుందేమోనని మీతో సంప్రదించేందుకువచ్చాను.

కర—ఎంతవరకు మొగ్గదలచుకొన్నావో ముందు నీవు చెపితే దానిమీద ఆలోచించిచూతాం.

శెట్టి—ఏదో కొద్దిలోనే ముగించాలని ఉన్నది. అయిదు వేలకు మించకుండా చూడాలి కరణంగారూ.

కర—అయిదు వేలకు ఈ రోజులలో సత్రం అవుతుందా? అందులో సగం స్థలానికే పెట్టవలసిఉంటుంది.

శెట్టి—అక్కడే తమరు కొంచెం కలిపించుకోవాలి. మీరుగనక తలుచుకుంటే ఏ సర్కారుపోరంబోకనో మంజూరుచేయలేకపోతారా ?

కర—మన ఊరి పోరంబోకలన్నీ ఇదివరకే మంజూరైపోయినాయి. ఒక వేళ ఏదైనా మిగిలిఉన్నా శిపాయిలకుతప్ప ఇవ్వకూడదని కలెక్టరుగారు తాఖీదు పంపించాడు.

శెట్టి—మరి అట్లాగైతే ప్రస్తుతానికి సత్రంమాట ఆపుకోవాల్సిందేనంటారు !

కర—ఇంకా ఎవరైనా దీనికి నీతో కలిసివస్తారేమో చూడకపోయినావా ?

శెట్టి—నా మాట ఎవరు వింటారు కరణంగారూ? అదంతా మీరే చూడాలి.

కర—చౌదరమ్మగారేమీ పూనుకోరూ ?

శెట్టి—నాకేమీ నమ్మకంలేదు. పోయిన ఎలెక్షన్లకు బాగా ఖర్చుపడ్డాడని అంతా అనుకుంటున్నారు

కర—మరి వెంకటరెడ్డిగారేమైనా మొగ్గేనా?

శెట్టి—అదేమీ లాభంలేదు. నాకు రావలసిన బాకీకే మొన్న నోటు తిరగవ్రాసి ఇచ్చిపోయినాడు.

కర—ఊఁ...అయితే ఒకమార్గం చెపుతాను, చూస్తావా మరి!

శెట్టి—చెప్పండి. చేతనైతే వదులుతానా అనుకున్న తరువాత?

కర—మన సిద్ధాంతిగారి ఇంటికి దక్షిణంగా ఉన్న ఖాళీస్థలం నీవు ఎరుగుదువుగదూ ?

శెట్టి—ఆ. ఎరగకేమండి? చక్కని చదరపు ముక్క. యాభైసెంట్లకు పైగా ఉంటుంది.

కర—ఆ స్థలాన్ని సంపాదించగలిగితే ఊరికి మధ్యగా మంచి సత్రం ఒకటి నిర్మాణం చెయ్యవచ్చు.

శెట్టి—సత్రానికని అడిగితే మనకు ఊరికే ఇస్తాడంటారా?

కర—ఆయనంతట ఆయన ఇవ్వడులేగాని ఇచ్చేటట్లు చెయ్యవచ్చు.

శెట్టి—అందుకు తగిన పథకమేమైనా ఆలోచించండి మరి.

కర—నీవుగనక నేను చెప్పినట్లు చేస్తే సానుకూలం అయేట్లు చూస్తాను.

శెట్టి—శత్తి! మింగకుండా చెపితే దేనికైనా సిద్ధమేననుకోండి.

కర—మరేమంత లేదులే. కోర్టులో చిన్న వ్యవహారం జరపాలి. అందుకు నీవేమంటావు ?

శెట్టి—సత్రం లేకపోతే నాపీడాపోయిరికాని, కోర్టుగొడవలలోమాత్రం నన్ను ఇరకపెట్టకండి స్వామీ.

కర—నీకు వచ్చే ముప్పం ఏమీలేదు. ఎంతో స్వల్పంలో తేలిపోతుంది. సరేనా !

శెట్టి—ఏంతేలటమో బాబూ! వ్యవహారం ఎదురుతిరిగితే నెత్తికి చేతులురాకతప్పదు.

కర—సుబ్బన్నశెట్టీ! నీ వ్యవహారాలు ఇన్ని జరిపించానే, ఎప్పుడైనా నష్టపడేట్లు చేశానా చెప్పు ?

శెట్టి—అవుననుకోండి. నేనుకూడా మిమ్మల్ని చేతనైనట్లుగా సంతోషపెడుతూనే వచ్చాను.

కర—కాబట్టి, చెపుతా విను. ఇది ఎంతమాత్రం ఎదురుతిరిగే వ్యవహారం కాదు. నన్ను నమ్ముకుంటే చెడిపోవటం ఎప్పుడూ జరగదనుకో.

శెట్టి—నమ్మకం లేక కాదు కరణంగారూ, డబ్బుతో కూడిన విషయం చూడండి...అయినాసరే మీరు ఇంతగా ధైర్యం చెపుతున్నప్పుడు ఎట్లా కాదంటానుగాని, ఏమి చెయ్యమంటారో చెప్పండి.

కర—అట్లాగైతే ముందు మనం హైదరాబాదు దాకా పోయిరావాల్సిఉంటుంది.

శెట్టి—అబ్బో, చాలా దూరప్రయాణం పెట్టారే!

కర—మరేమీ ఫరవాలేదు. నాలుగోనాటికి తిరిగివస్తాము. ఏమంటావు ?

శెట్టి—ఇక నేను అనేదేమున్నది? ప్రయాణం ఎప్పుడో చెప్పండి.

కర—పంచమీ సోమవారం దివ్యమైన రోజు, మధ్యాహ్నం భోజనంకాగానే బయలుదేరిపోదాము. సరేనా ?

శెట్టి—అట్లాగే లెండి. (లేచి నిలబడి)ఇక నేను పోయిరానా ?

కర—మంచిది, వెళ్లిరా...పంచమీ సోమవారం. మరిచిపోయేవుసుమా ! [తెర]

మూడవరంగం

[హైదరాబాదులో రమణరావుఇంటివద్ద ఒక నాటి ఉదయం. రమణరావు కుర్చీలో కూర్చుని పత్రిక చదువుతూ ఉంటాడు.]

కర—(ప్రవేశిస్తూ) బాబూ, రమణరావు పంతులూ!

రావు—(పత్రిక బల్లమీద పడవేసి) ఎవరండీ?

కర—ఏం నాయనా! ఈ ముసలివాడిని గుర్తుపట్టినట్లు లేదే?

రావు—ఆ కుర్చీమీద దయచేయండి. ఆనవాలు పట్టలేకుండా ఉన్నాను. క్షమించాలి.

కర—మాది మంగళాపురం బాబూ. నే నావూరి కరణాన్ని; నన్ను రామయ్యపంతు లంటారు. (కూర్చుంటాడు)

రావు—అలాగాండి? అది మా తాతగారి ఊరే. చిన్నప్పుడు ఒక్కసారి కాబోలు అక్కడికి వచ్చాను.

కర—అవును బాబూ. నాకు కళ్లకు కట్టినట్లు జ్ఞాపకం ఉన్నది. మీ తాతగారు నిత్యానందంగారికి జబ్బుచేసినప్పుడు నిన్ను చంక నెత్తుకొని మీ అమ్మగారు మంగళాపురం వచ్చారు. వర్షాలవల్ల బండి కదలక పోతేను రైలుదగ్గరికి నేనే మేనాసవారి పంపించాను.

రావు—అప్పుడు మా తాతయ్య, తరువాత కొద్ది రోజులకే మా అమ్మమ్మా చాటిపోవటంవల్ల ఆవూరితో పూర్తిగా సంబంధం తీరిపోయింది. ప్రస్తుతం అక్కడ 'నా' అనేవాళ్లు ఎవరూ లేరు.

కర—అలా అనకూడదు నాయనా! మనమంతా ఒక్క కుదుటిలోనివాళ్లం. మీ తాతయ్యపినతండ్రి మనమరాలే నా భార్య. మీ రంతా ఎక్కడో ఉంటాన దూరమైపోయినాముగాని నేను మీ వాడినికాదూ?

రావు—అవును లేండి...అయితే తమరు వచ్చిన పని ఏమిటో శెలవిస్తారా?

కర—మా ముసలివాళ్ల గొడవ ఇట్లాగే ఉంటుంది. అసలు వ్యవహారానికి ఛప్పున రాలేము...ఆఁ. చూడు బాబూ! మీ తాతగారి ఆస్తిసమాచారం మీకేమైనా తెలుసునా?

రావు—నాకు ఆట్టే తెలియదు. తాతయ్యకు మా అమ్మతప్ప వేరే సంతానం లేకపోవటాన ఆ ఆస్తి మాకే సంక్రమించింది. ఆ వూరి సిద్ధాంతికి ఆస్తియావత్తూ మా తాతగారే కవులుకు ఇచ్చాడు. ఇప్పు డాయన అది అంతా తనదేనని ఒక్క కానీఅయినా పంపటం లేదు.

కర—అట్లా అన్నప్పుడు ఎందుకని ఊరుకొన్నారు బాబూ?

రావు—ఆ ఆస్తితో అవసరం లేకపోవటం మొదటి కారణం. అంతదూరం వచ్చి, ఆ బ్రాహ్మడితో వ్యవహారం జరపటం ఇష్టంలేకపోయింది. తరువాత ఈ వూరిలో ప్లేగురావటం, మా అమ్మా నాయనా మరణించటం అన్నీ జరిగిపోయినవి. దానితో నాకు అసలే ఆ విషయంమీదికి మనసుపోలేదు.

కర—అక్కడే మా కాలపువాళ్లకూ, మీకూ ఉండే భేదం. ఆస్తితో అవసరం ఉన్నా లేకపోయినా మేము ఈ విధంగా వదిలివెయ్యము. ఈ సిద్ధాంతి మొదటి రెండేళ్లూ శిస్తు మీ అమ్మగారి పేరటనే కట్టాడు. దరిమిలా తన పేరుతో చెల్లించటం సాగించాడు. పన్నెండుసంవత్సరాలు కాగానే తాశిల్దారుకు అర్జీ పెట్టి, పట్టా తన పేరుకు మార్పించుకొన్నాడు. ఇప్పు డాయన ఉండే ఇల్లూ, తినే తిండీ అంతా మీదేనన్నమాట.

రావు—ఏమిటో లేండి. చదువుకున్న పేద బ్రాహ్మడు అనుభవిస్తున్నప్పుడు నాకు ఎంతమాత్రం విచారం లేదు.

కర—అన్యులఆస్తిని అమాంతంగా కబళించమని ఏ శాస్త్రంలో ఉన్నదో చెప్పు బాబూ! చదువుకొన్న వాడి లక్షణమేనా ఇది?

రావు—ఏదీ మాకు పట్టకుండా ఉపేక్షచేసినప్పుడు, పిల్లలు గలవాడు ఆశించటంలో తప్పు ఏమీ కనబడదు.

కర—వయసుకు చిన్నవాడవయినా మంచి ఉదార స్వభావం గలవాడివి. నేను ఒక్కటి మనవిచేస్తాను. మీ తాతగారు మా వూళ్లో ఘనంగా బ్రతికారు. కాని ప్రారబ్ధం బాగుండక కుటుంబాన్ని నిలబెట్టేవాళ్లు లేకపోయినారు. ఆఖరుకు ఆయనఆస్తికూడ అన్యాక్రాంతం అయిపోయింది.

రావు—అదంతా నిజమేననుకోండి. కాని...

కర—నా మాట పూర్తిగా దయవుంచి వినండి. ఆ ఆస్తిప్రమేయమే మీకు అక్కరలేదనుకుంటే, అర్హుడైనవాడికి మీ తాతగారి పేరట మీ చేతులతో దానంచేయండి.

రావు—అనుభవిస్తున్నవాడికే అనుభవించనియ్యండి. ఆయనమాత్రం అర్హుడు కాడుగనకనా!

కర—అదీ కాదంటే మీతాతగారి జ్ఞాపకార్థం ఏదో ఒక సత్రమయినా ఆయనపేరట నిర్మాణం అయేట్లు చూడండి. ఆయనపేరు చెప్పుకొని పదిమందీ అనుభవిస్తారు.

రావు—సత్రాలూగిత్రాలూ మాటలతో తయారవుతయ్యా? వేలమీద ఉంటుంది.

కర—ప్రస్తుతం సిద్ధాంతిగారు ఉంటున్న మీ ఇంటికి ఆనుకొని రెండువేలగజాల ఖాళీస్థళం ఉన్నది. పోనీ దానినైనా మీ తాతగారి స్మారకంగా ఇచ్చివేస్తే సత్రం కట్టించే భారం నాది. విన్నారా?

రావు—నా స్వాధీనంలో లేని ఆస్తిని మీకెలా ఇవ్వగలనంటారు?

కర—బాబూ! తమకు మైనారిటీ వెళ్లి ఎంత కాలమయింది?

రావు—రెండున్నరఏళ్లయిండి.

కర—మూడేళ్లు నిండలేదుకదా! బ్రతికిపోయినాము. అయితే ఇకనేం! హరించిన ఆస్తిని యావత్తూ ఆసిద్ధాంతిచేత మూడురోజులలో వమనంచేయిస్తాను.

రావు—ఒక్కవిషయంమాత్రం మీకు ఖచ్చితంగా చెపుతున్నాను కరణంగారూ. ఈస్థళం విషయం, ఆ సిద్ధాంతి అనుభవిస్తున్న ఆస్తిజోలికి ఎంతమాత్రమూ మీరు పోగూడదు. ఆపైన, ఈస్థళం స్వాధీనం చేసుకోటానికి జరిపే వ్యవహారంకోసం ఒక్క దమ్మిడీ అయినా నేను ఖర్చుపెట్ట దలచుకోలేదు. తెలిసిందా!

కర—ఒక్కక్షణం ఉండుబాబూ...(ప్రక్కకు వెళ్లి బిగ్గరగా) సుబ్బయ్యశెట్టిగారూ!

శెట్టి—(ప్రవేశిస్తూ) ఆఁ. ఆఁ.

కర—ఇట్లా దయచేయండి.

శెట్టి—దణ్ణం పెడతానండి. నిత్యానందంగారి మనమలు కామాలు.

కర—బాబూ! వీరు మాపూరిలో పెద్దవ్యాపారస్థులు. తాతగారి కుటుంబం అంటే ఎంతో అభిమానం గలవారిలో వీరొకరు.

రావు—కూర్చోండి సుబ్బయ్యశెట్టిగారూ.

కర—శెట్టిగారూ! నిత్యానందంగారి పేరట మన ఊళ్లో శాశ్వతంగా ఉండేటట్లు సత్రమొకటి కట్టించమని వీరితో మనవిచేశాను. అందుకు తగిన అవకాశం ప్రస్తుతం లేదని వారు శెలవిచ్చారు. దానిమీదట సిద్ధాంతిగారి ఇంటికి ఆనుకొనిఉన్న ఖాళీస్థళమయినా అందునిమిత్తం దానంచెయ్యమని కోరాను. అందుకు వారు సరేనన్నారు.

శెట్టి—ఇంకా కావలసినదేమున్నది పంతులుగారూ! తమరు మీతాతగారి జ్ఞాపకార్థం స్థళం ఇస్తానంటే అక్కడ సత్రం కట్టేందుకు అయ్యే యావత్తు డబ్బూ నేను ఒక్కడినే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను.

రావు—అది చాలాసంతోషమైన విషయం.

కర—ఆస్థళాన్ని స్వాధీనంచేసుకోటానికి జరిపించవలసిన వ్యవహారం కూడ మీచేతిమీదుగానే జరుగవలసి ఉంటుంది శెట్టిగారూ.

శెట్టి—అట్లాగే కానివ్వండి. ఈ కాస్తకు లోభించదలచుకోలేదు లెండి.

రావు—అలాగైతే...నన్ను ఇప్పుడు ఏమి చెయ్యమంటారో చెప్పండి.

కర—మరేమీ అక్కరలేదు. అవసరమైన పత్రాలను తయారుచేసి సాయంకాలం పట్టుకొనివస్తాను. తమరు దస్కతుచేసి ఇస్తే సరిపోతుంది.

రావు—సరేగాని, మీ రిద్దరూ ఈపూట ఇక్కడే దేవతార్చన చేసివెళ్లండి.

కర—ఇప్పుడు కాదులే బాబూ! వెళ్లివస్తా.

శెట్టి—శెలవుపుచ్చుకుంటా పంతులుగారూ.

రమణరావు—మంచిది. వెళ్లిరండి.

[తెర]

నాలుగవరంగం

[తరువాత కొన్నిమాసాలకు మంగళాపురంలో కరణంఇంటిదగ్గర. సాయంసమయం]

కర—మోతాదూ!

మోతాదు—(ప్రవేశించి) అయ్యా అయ్యా!

కర—ఒకసారి రమ్మన్నానని శెట్టితో చెప్పావుట్రా?

మోతాదు—ఆ, చెప్పానండి. కాటాఎయ్యటం పూర్తిచేసి వస్తానన్నాడు...అదుగో రానేవస్తుండాడు. (వెళ్లిపోతాడు)

శెట్టి—దణ్ణం కరణంగారూ. ఎందుకో రమ్మన్నారంట.

కర—ఇదుగో ఈఉత్తరం చూడు.

శెట్టి—కళ్లజోడు లేదు, తమరే చదవండి; వింటాను.

కర—"ఫలానాకరణంగారికి. మీ తాలూకు అప్పీలు హైకోర్టులో నిన్నటిరోజున విచారణకురాగా, ఖర్చులతో సహా మీకు అనుకూలంగా తీర్పుచెప్పినారు కాబట్టి తెలియజేయడమైనది. మిగతా ఫీజును వెంటనే పంపవలసినది." విన్నావా శెట్టీ?

శెట్టి— అమ్మయ్య! మంత్తానికి బయటపడేశారు.

కర—అంటే ఏమిటో తెలుసునా? ఈసిద్ధాంతి నాకిప్పుడు గుప్పిటిలో దొరికిపోయినా డన్నమాట.

శెట్టి—అయితే మనఖర్చుల తాలూకు పైకం ఎప్పుడు వస్తుంది?

కర—ఎప్పుడో నా? డిక్రీకాపీలు రాగానే అమలు జరుపుకొందాము. వ్యవహారానికి ఖర్చు ఏ మాత్రం అయిందో లెక్కచూసి పట్టుకురా. సరేనా?

శెట్టి—రేపు ఉదయం పట్టుకొస్తాను ... ఆ వచ్చేది సిద్ధాంతిగారల్లే ఉన్నది. ఇక నేను శెలవతీసుకుంటా కరణంగారూ.

కర—సిద్ధాంతి వస్తున్నాడా? సరే, నీవు వెళ్లు. (శెట్టి వెళ్లుతాడు.)

సిద్ధాం—(ప్రవేశించి) నమస్కారం కరణంగారూ.

కర—ఎవరూ? సిద్ధాంతిగారా! మాది ఏమి అదృష్టం!

సిద్ధాం—ఇంకేమి సిద్ధాంతి స్వామీ! అక్షయపాత్ర చేతికి ఇప్పించారు.

కర—అట్లా అంటారేమండీ? ఏమి జరిగింది?

సిద్ధాం—తమకు తెలియని దేమున్నది? నా అప్పీలు కొట్టివేయటం మీరు వినకుండావున్నారా?

కర—ఓహో అప్పీలువిషయమా! ఈ పూటనే విన్నాను.

సిద్ధాం—కరణంగారూ! నన్ను సర్వనాశనం చేశారుగదా.

కర—సర్వనాశనం చెయ్యటానికి నే నెవడినండీ? అదంతా మీరు అన్నట్లు గ్రహవీక్షణ.

సిద్ధాం—తమ వీక్షణముందు గ్రహవీక్షణ పనికిరాలేదు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం ప్రయోగించటం న్యాయమేనా చెప్పండి! నామీదనా కక్షసాధించటం?

కర—ఈ మాత్రపు దూరదృష్టి మొదటిలోనే ఉండవలసినది. అనవసరంగా నన్ను రెచ్చగొట్టి తరువాత నిందిస్తే ప్రయోజనం ఏముంటుంది సిద్ధాంతిగారూ?

సిద్ధాం—మీరుగనుక అనుగ్రహిస్తే మించిపోయేదంటూ ఉండదు. నిస్సహాయుణ్ణి అయినాను. నన్ను ఒడ్డుకుచేర్చగలవారు మీరు ఒక్కరే.

కర—మీరు పొరబడుతున్నారు. నాకంతటి సామర్థ్యమే వుంటే నన్నింత చిన్నచూపు చూసేవారా మీరు?

సిద్ధాం—ఈ విధంగా నన్ను మీరు ఎత్తిపొడవదలచుకొంటే నేను చేసేది ఏమీలేదు. మీ వంటి ధీరోదాత్తులకు మన్నించటం ధర్మం.

కర—మన్నించేందుకు నే నెవరినండీ? గుడిలోకిపోయి దేవుణ్ణి ప్రార్థించండి.

సిద్ధాం—మీ వరం లేనిదీ దేవుడుకూడా ఈ గ్రామంలో ఏమీ చేయలేడు. తమరే కటాక్షించాలి.

కర—వేళం తప్పిపోయింది. నేను చేయగలిగింది ఇప్పు డేదీ లేదు. ఆ రమణరావుగారి దగ్గరకు వెళ్లి బ్రతిమాలుకోండి. ప్రయోజనం ఏదైనా ఉంటుంది.

సిద్ధాం—ఇందులో ఆయనప్రసక్తి ఏమున్నది? ఉద్ధరించినా అణగద్రొక్కినా మీరే చేయాలి.

కర—అనవసరంగా నన్ను నిర్బంధ పెట్టకండి. మీకీ విషయంలో నేను చేయగలిగింది ఏదీ లేదు.

సిద్ధాం—కరణంగారూ! మీప్రజ్ఞ చాణక్య ప్రజ్ఞవంటిది. మందబుద్ధినై తెలుసుకోలేకపోయినాను. అపరాధం చేశాను. కరుణించకూడదా తమరు?

కర—సిద్ధాంతిగారూ! దయచేసి నన్ను వత్తిడి చేయకండి.

సిద్ధాం— సాటివాడను. పిల్లలుగలవాడిని. వృద్ధాప్యంలో సకుటుంబంగా చెట్టుకో పుట్టకో పట్టి పోవలసిన పరిస్థితులు చేతులారా తెచ్చి పెట్టుకొన్నాను. అవివేకినై మీకు ఆగ్రహం తెప్పించాను. అందుకు నన్ను మీ రే విధంగానైనా శిక్షించండి. కాని నేను చేసిన అపరాధంకోసం నోరుతెలియని పిల్లలను క్షోభ పెట్టకండి. ఆమాత్రం కనికరం చూపండి.

కర—(క్షణం మౌనంగా ఉండి) సిద్ధాంతి గారూ! నేను దయాదాక్షిణ్యాలులేని కర్కోటకుణ్ణి కాదు. మీకు అపకారం చేయాలని నాకు ఏకోశానా లేదు. కాని అనవసరంగా నామనస్సు నొప్పించారు. అందుకని కక్షసాధించాను. నా ఆత్మగౌరవం నిలబెట్టుకొన్నాను. అంతకంటే కావలసింది నాకు లేదు.

సిద్ధాం—నన్ను ఎట్లాగైనా గట్టునపడవేయండి.

కర—అయిందేదో అయిపోయింది. నామాట వింటానంటే ఏదో విధంగా పరిష్కారం చెయ్యవచ్చు.

సిద్ధాం— మీరు చెప్పినట్లు చేయటానికి సిద్ధంగా ఉన్నాను. శెలవియ్యండి.

కర—ఆ రమణరావుగారితో ఎట్లాగో కాళ్లా వేళ్లా పడి ఆ ఇల్లూ, ఆ పొలమూ మీరే అనుభవించేట్లు దానపత్రం వ్రాయిస్తాను. కాని మీఇంటిప్రక్కన ఉన్న స్థలంమాత్రం నిత్యానందంగారి పేరట పత్రం కట్టేందుకు వదలివేయాలి. ఏమంటారు?

సిద్ధాం—అందుకు నిరభ్యంతరంగా ఒప్పుకొంటున్నాను.

కర—అలాగైతే తక్కిన విషయం తరువాత చూచుకొందాముగాని, ఇప్పటికి జరిగినదంతా మరచి పొండి. ఇంటి దగ్గర మీవాళ్లందరూ దిగులుపడిఉంటారు. మీరు పోయి ధైర్యం చెప్పండి.

సిద్ధాం—మీకు నాకృతజ్ఞత ఎట్లా చూపాలో తెలియకుండా ఉన్నది...సరే శెలవుతీసుకొంటాను.

కర—మంచిది. వెళ్లిరండి. (సిద్ధాంతి వెళ్లుతాడు) ఒరే మోతాదూ!

మోతా—ఆఁ. ఆఁ.

కర—లోపలినుంచి మంచి పొగాకుకాడ తీసుకురారా.

మోతా—చిత్తం చిత్తం.

[తెర



మట్టిమహిమ

*

= శ్రీ గుండిమెడ వెంకటసుబ్బారావు =

" సకలభోగంబులకు తిలోదకము లయిన - చావకున్నదికద రాచఠీవి నీకు!
దిట్టవగుదువు సరి కట్టిపెట్టుమయ్య - హద్దుమీరుచునున్న ఈ పెద్దరికము!

తీసుకొను మిదె: నీదు శరాసనంబు - పట్టుమివె నీదు శస్త్రాస్త్ర పరికరములు!
ఈ నికృష్టంపు శవభార మిట్లు మోయ - జాలనిక నీకు నే నోయభాజనుండ!"

అని కనులెఱ్ఱజేసి, యుచితానుచితజ్ఞత బాసి, ధూర్తభా
షణముల గుప్పి, దుర్వినయ సంక్షుభితుం డయి నిల్చియున్న ల
క్ష్మణుని యపూర్వవర్తనము గాంచి, యొకింత నిమీలితాక్షుడై
జనపతి, త్యాగమూర్తి, రఘుసత్తము డాత్మదలంచె నీగతిన్.

" స్థలమహత్త్వ మొండు కలదంచు తొల్లి సర్వజ్ఞులైన ఋషులు పలుక వింటి!
నెపము లేని యితని విపరీత వర్తనం - బునకు నిదియె హేతువని తలంతు.

సకలాశౌచ కళంక పంకిల జనస్థానంబు, దుర్గంధ మో
దకవాతావరణంబు, నిష్ఠురదివాంధక్షుద్రకూపంబు, కం
టకపాషాణ నిషాదభీషణవనాంతక్షోణియా నీ కిరా
తక దేశంబు మహానదీపరిసరస్థానంబుగన్ దోచెడిన్!

భరతభూభాగవర్ణనావసరమందు - ఈమహానదీప్రాంతంపు భూమి గూర్చి
గురుముఖంబున వినియున్న పరమసత్య - మరయగల్గితికద కన్నులార నేడు!

మతధర్మబాహ్యులై మత్స్యమాంసాహారమత్తులై తిరుగు బ్రాహ్మణులతోడ,
జ్ఞాన వివేకలక్షణశూన్యమగు ననాగరకంపు మనుజసంఘంబుతోడ
జీర్ణ శల్యాకీర్ణజీవచ్ఛవంబులై తనరు గోవృషభసంతతులతోడ,
అతిరిక్త జలవిప్లవాద్యరిష్టాగత క్షామపిశాచగర్జనలతోడ,

పాడువారెడు క్షుద్రభూభాగ మిద్ది! - ఈ యశుద్ధదేశమున కాలిడినయంత
నెట్టి నవనీతకోమలహృదయమైన - కలుషవిషకుంభమై పరాక్రమముజూపు!

జ్ఞాన మంతరించు సదసద్విచారమా-నసికశక్తులెల్ల నాశమందు!
మానుషత్వ ముడుగు మధ్యందినార్కమం-డలము తోచు మంటిగుళికవోలె!

ఇట్టి దగుసుమ, రామ, యీ మట్టిమహిమ-అనిన యానాటి గురువాక్య మనృతమగునె!
కాకయుండిన, సుగుణరత్నాకరుండు - లక్ష్మణుం డేమి, నీచప్రలాప మేమి!!"

అని సత్యంబు గ్రహించి, దుర్వినయగర్వాయత్తుడై యున్న త
మ్ముని చేరంజని, సుప్రశాంత వదనాంభోజంబు దీపింప, చెం
తను నేలంబడియున్న భీషణ ధనుర్దండంబు చేనంది, చ
య్యన తూణీరము జక్కవెట్టుకొని, సంధ్యాస్వర్ణ తేజస్వియై.

మందహాసంబు ముఖసీమ జిందులాడ - చకితయై మనస్తాప నిస్తబ్ధయైన
జానకీదేవి కంట బాష్పములు రాల-పలికె నీలీల నామహాభాగు డపుడు.

" అనుజ! యథార్థ మంతయు, మదాంధుడనై మితిమీరి, లేని పె
త్తనమును బూని, యక్కట! వృథాశ్రమ గూర్చితి నీకు పాపినై
నను క్షమియింపవే యనుజ! నాయపరాధము విస్మరింపవే! "
అని యనురోధవాక్యముల నాతని చేతులు బట్టె దీనతన్.

అంతలో జగద్బాంధవుం డస్తమించె - పశ్చిమాకాశ తేజంబు పలుచబడియె,
అల్లనల్లన భూతభయానకమగు - అంధకారంబు భువనంబు నాక్రమించె.

అయినన్ సూతయు సంశయింపడు, ఫలాహారంబు వాంఛింప డే
మియు విశ్రాంతి దలంప డొక్కబిగి సౌమిత్రికరగ్రాహియై
పయనంబై చనె నానిశీథమున తత్క్షేత్రమధ్యంగతుం
డయి పాఱంజను పాంథునట్టుల స్థలత్యాగైక దీక్షామతిన్.

వడివడి వెన్కజాడకయె పర్వతముల్ వనముల్ ప్రవాహముల్
మడుగులు దాటిపోయె, నటులన్ బదునాలుగు కాలరాత్రముల్
గడచె, ననంతరంబు శుభలక్షణ లక్షితమైన యొక్క చి
ట్టడవి మయూరవానరవిహారమనోహరమై కనంబడెన్.

అపుడె తెల్లవాఱుచునుండె నంధకార - భీషణచ్ఛాయ లవి మెల్ల వెల్లబాఱ
పట్టి ముకురోమముల మాడ్చివైచుచున్న - ఘోరదుర్గంధ మొకయింత దూరమయ్యె.

అనతిదూరంబునన్ గానవచ్చుచున్న - దివ్యరూపిణి యొక్క నదీమతల్లి
సదమలోదయభాను ప్రసారణమున - మిసిమిబంగరుపూత నెమ్మేన దాల్చె!

ఆ మనోహరదృశ్యంబు నరసియరసి - హృదయభారంబు క్షీణింప వదనసీమ
తళుకులొల్కుచు చిరునవ్వు మొలక లెత్త - పలికె నీలీల రామభూపాలహేళి.

" సుదతీ! కాంచితె, లక్ష్మణా యరసితే! సూర్యప్రభాభాసురం
బదియే కల్మషమోచనంబు ఋషికుల్యాపుణ్యతీర్థంబు! దు
ర్వ్యథకున్ క్షుద్రతమోంధకారమునకున్ హాద్దై విడంబించు నీ
నది దాటన్ వలె నాత్మశాంతికయి, పూర్ణజ్ఞానసంసిద్ధికై ! "

అని, పురోమార్గగామియై యతిముదమున - ఆ స్రవంతీ ప్రవాహంబు నధిగమించి
ముక్తపుష్పసుగంధసమ్మోహనమయి - యలరు నొక సుందరారామమందు విడిసె.

ఉత్తరక్షణంబుననె లోకోత్తరమగు - అద్భుతచ్ఛాయ పొడగట్టి యాక్రమించె
అల్లనల్లన నవనవావ్యక్తభావ - బంధురంబైన సౌమిత్రివదనసీమ!

కలగని లేచినట్టుల ముఖంబు చలింప, మహోగ్రవాయుసం
చలితతరంగసంక్షుభిత సాగరమట్లు హృదంతరాళ మా
కులమయి తల్లడిల్ల, పెనుఘోషమునన్ కనులం దనంతభూ
వలయము గిర్గిరన్ దిరుగ బాష్పజలాన్వితశూన్యనేత్రుడై.

" అక్రమ మాచరించి విమలాన్వయతేజము మాపినట్టి పా
పక్రిమి నేను, ఛీ!" యని చివాలున ఖడ్గము దీసి యాత్మహ
త్యాక్రియకున్ దలంపడిన తమ్ముని దక్షిణహస్త మంటి ని
ర్వక్రమనఃప్రవృత్తి రఘువల్లభు డిట్లను శాంతభాషలన్.

" ఎఱుగుదు నీమనోవ్యథకు హేతువు, తమ్ముడ! యామహానదీ
పరిసరకంటకోగ్రవనవాటమునన్ మతిమాలి నీవు క్ర
మ్మఱచిన చిత్తవిభ్రమమునన్ గల దేవరహస్యమెల్ల నే
నెఱుగుదు, చింత బాయు మొకయింతయు దోషము లేదు నీయెడన్.

బాల్యమందు విశ్వామిత్ర పరమపావని-ప్రకృతిమహిమంబు లెన్నో వర్ణనమొనర్చె!
మట్టిమహిమను వర్ణించు ఘట్టమునను - ఉత్తరకళింగభూతత్వ ముదహరించె!

అచటి వాయువు సోకినంత మనుష్యత్వ మంతరించి పశుత్వ మమరు ననుచు,
అచటి మట్టిని మట్టినంత మానసికసుజ్ఞాన తేజము మబ్బుగ్రమ్ము ననుచు,
అచటి నీరము గ్రోలినంత నెమ్మేని రక్తప్రవాహము విషాక్త మగు ననుచు,
అచ్చటి సూర్యచంద్రాతపంబులు దివారాత్రదీపకములై గ్రాలవనుచు,
ఇంక నెన్నెన్నో రీతుల నీప్రదేశ-వర్ణన మొనర్చె నామహాభాగు డపుడు!
అనుజ! నీదేమి యపరాధ మరయ, నప్ర-తిహతమైనట్టి యీ మట్టిమహిమగాక!

'మరుల మాతంగి' యనుపేర బరగు నొక్క--చిత్రలత! దాని తాకినమాత్రమునను
భ్రాంతిగప్పు జేసి యది యెట్టి పాంథునైన - త్రోవతప్పించి పెడదారి ద్రొక్క-జేయు!

ఆ లతామహాత్వమున గాబోలు మనము - దారితప్పి తుచ్ఛమగు నుత్తరకళింగ
మార్గమును బట్టితిమి స్వచ్ఛమార్గ ముడిగి-కర్మపరిపాక మనుజ! యీ ఘటన మనకు.

అని, దుర్వారమనోవ్యథన్ నిజతనుత్యాగంబు గావింప బూ
నిన తమ్మున్ దనచెంత జేర్చుకొని, కన్నీ రద్ది లోకోత్తర
ప్రణయోద్భాసితమైన బాహులతికాబంధంబునన్ జేర్చె, త
ద్వనసంచారసమగ్రజంతువిహగవ్రాతంబు హర్షింపగన్.

నాటిమొదలుగ నా పదునాలుగేండ్ల-ఘోరదండకారణ్యసంచారమందు
ఉత్తరకళింగమున గాంచియున్నయట్టి - మట్టిమహిమను సౌమిత్రి మరువడయ్యె!



విద్యావిధానము - కొన్ని మూలసూత్రములు

= శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య =

ఇతర విషయములనుగురించి అభిప్రాయభేదము లనేకము లున్నను దేశములోని ప్రజలందరు విద్యావంతులు కావలెననుటలో అభిప్రాయభేదము కనుపించుట లేదు. విద్య అందరికిని ఆవశ్యకమనియు, విద్యావిధానమును తగురీతిని సంస్కరించవలయు ననియు అందరును చెప్పుచున్నారు. ఈ విధముగ సంస్కరించు ఉద్దేశముతో మన రాష్ట్రమును ప్రస్తుతము పాలించుచుండు మంత్రివర్గమువా రీమధ్యన విద్యకు సంబంధించిన ప్రశ్నలను కొన్నిటిని తయారుచేసి వానికి సమాధానముల నియ్యవలసినదని విద్యాభిమానులందరిని కోరియున్నారు. ఈ సమాధానములు వచ్చినతోడనే వానిని విమర్శించి, క్రొత్త విద్యావిధానమును ప్రవేశపెట్టుటకు తీర్మానించియున్నారు.

ఈ విషయమును విమర్శించుటలో సామాన్యసూత్రములను కొన్నిటిని మనము జ్ఞాపకముంచుకొనవలసియున్నది. ఎట్టి సంస్కరణముకూడ ఆ సూత్రములపై ఆధారపడియుండవలెను.

౧. మానవజీవితమును శైశవము, బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధక్యము అని అయిదు దశలుగ విభజించియున్నారు. విద్యావిధానమంతయు బాల్య, కౌమారదశలకు సంబంధించియున్నది. ఈ రెండు దశలలో మానవుడు ఏ విధముగా జీవించుట యుక్తమో విద్యావిధానము ఏర్పరచుచున్నది. ప్రతిదేశమందును విద్యాభ్యాసము బాల్యదశతో ప్రారంభమగుచున్నది. బాల్యదశయొక్క చివరనుగాని, కౌమారదశయొక్క ఆఖరునగాని అది అంతమొందుచున్నది. వయోజనులు, వృద్ధులుకూడ క్రొత్తవిషయము లనేకములను నేర్చుకొనుట కలదు. కాని సామాన్యముగ "విద్యాభ్యాసము", "విద్యావిధానము" అను విషయములనుగురించి చర్చించునపుడు బాల్యకౌమారదశలకు సంబంధించిన విద్యనుగురించియే చర్చలు జరుగుట మామూలు.

౨. విద్యాభ్యాసమున కంతకు నియమబద్ధమగు జీవితము ప్రధానలక్షణము. బాల్యదశ నంతను విద్యాభ్యాసమునందే గడపవలె ననుటలో నియమబద్ధమగు జీవితమును అలవాటుచేసుకొనుటయే ఈ దశలో మానవుడు చేయవలసిన పని యని స్థిరపడుచున్నది. యౌవనదశలోను, వార్ధక్యమందును నియమబద్ధమగు జీవితము అవసరము కాదని దీని అర్థము కాదు. అట్టి జీవితము అన్నిదశలందు కావలసినదే. జీవితమంతయు నియమబద్ధముగనే యుండవలెను. అదియే మానవధర్మము. కాని అట్టిజీవితము దానంతట రాజాలదు. దానికి గొప్ప ప్రయత్నము, పరిశ్రమ అవసరము. అట్టి ప్రయత్నము చేయుటకు బాల్యదశయే సరియైన కాలమని దీని అర్థము. ఆ దశయం దీప్రయత్నమును తదేకదృష్టితో చేసిన యెడల తక్కిన దశలలో నియమబద్ధమగు జీవితమునకు మనుష్యుడు అలవాటుపడినవాడై జన్మసాఫల్యము గాంచును.

3. ఇందుచేతనే విద్యాభ్యాసకాలమును బ్రహ్మచర్యమందు గడపవలెనని మన పూర్వసాంప్రదాయము. ఇతరదేశములలోకూడ చాలవరకు ఇట్టి సాంప్రదాయమే అనుసరింపబడుచున్నది. బ్రహ్మచర్య మనగా వివాహమాడకుండుటమాత్రమే కాదు. ఆహారమందును,

వేషమందును, విహారములందును నియమమును పాటించుటయే బ్రహ్మచర్యము. చదువుట, వ్రాయుట, పుస్తకపాండిత్యమును సంపాదించుట, శాస్త్రపరిశోధనము చేయుట విద్యాభ్యాసమునకు లక్షణములైనను నియమబద్ధమగు జీవితమున కలవాటుపడుటయే దీని ప్రధానోద్దేశము. విద్యాభ్యాసమును చక్కగ చేసినవారు పండితులు కాకుండుటయు కలదు. వారిలో ననేకులు శాస్త్రవేత్తలు కాకపోవచ్చును. కాని వారందరు నియమసహితముగ జీవించువా రగుదురు. వారే శిష్టాచారసంపన్నులు. విద్యయొక్క ఆదర్శ మిదియే.

౪. బాల్యదశను బ్రహ్మచర్యమందు గడపి విద్యాభ్యాసము చేయుటచేత యౌవనదశయందు మానవుడు గృహస్థుడై కుటుంబభారమును వహించుటకును, భార్య, పిల్లలు, కులబంధువులు, ఇరుగు పొరుగువారు, ఇతరజనము — వీరందరితో ధర్మానుసారముగ ప్రవర్తింపగలవాడగుచున్నాడు! యౌవనదశలో నతడు పిల్లలను తగురీతిని పెంచవలసిన భారమును వహింపవలసియున్నది. సాంఘిక వ్యవహారములందును, దేశపరిపాలనమందును పాల్గొని సంఘములోని లోపములను సవరించి, ప్రజల సౌఖ్యమును వృద్ధిచేయవలసిన బాధ్యతయు నతనిపై నున్నది. ఇదియే గృహస్థధర్మము. విద్యాభ్యాసము మూలమున బాల్యకౌమారదశలందు నియమబద్ధమగు జీవితమున కలవాటుపడినగాని గృహస్థుడు వాని ధర్మములను చక్కగా నిర్వహింపజాలియుండడు!

౫. నియమబద్ధమగు జీవితముయొక్క ప్రాధాన్యమును బట్టియే విద్యాభ్యాసమునకు ప్రాధాన్యము కలుగుచున్నది. ఈ కాలమున సాధారణముగ "స్వేచ్ఛ" "స్వాతంత్ర్యము" మానవుని ఆదర్శములుగా నుండవలెననియు, ప్రాచీనకాలపు సాంప్రదాయములను విడనాడినగాని ఈ ఆదర్శములు సఫలములు కాజాలవనియు ప్రముఖులు సంస్కర్తలు చెప్పుచుండుట అందరికిని తెలిసిన విషయమే. ఇట్టి సందర్భములో నియమబద్ధ జీవితమునకు ప్రాధాన్యమును కల్పించుట ఆధునికకాలపు ఆదర్శములకు విరుద్ధముగ ప్రవర్తించుట యని కొందరనుకొనవచ్చును. కాని అట్టి అభిప్రాయమునకు అవకాశము లేదు. స్వేచ్ఛకంటెకూడ నియమబద్ధజీవితమే మనుష్యునికి ఎక్కువ అవసరము. దీనికి కారణము గ్రహింపవలసియున్నది.

౬. మానవుడు సంఘజీవి అన్న సత్యమును మనము మరువరాదు. అనగా అతడు ఏకాకి కాడు. పుట్టినదిమొదలు చచ్చువరకు అతడు ఇతరమనుష్యుల మధ్యన నివాసముచేయవలసియున్నది. ఆ ఇతరు లతని తలిదండ్రులు, కుటుంబములోనివారు, కులబంధువులు మాత్రమే కాదు. అతడు నివసించు గ్రామములోనివారు, పట్టణములోనివారు, దేశములోనివారు కూడ వారిలో చేర్చవలసియున్నది. ప్రస్తుతకాలమున మానవకోటి అంతయు ఒక సంఘముగ నేర్పడిన కారణమున మనుష్యులందరి మధ్యన ప్రతిమానవుడు జీవింపవలసియున్నది.

మనుష్యుడు సంఘజీవి యనుటలో పరమార్థమేది ? ఎవరు ఏపని చేసినను దానివలన కలుగు ఫలితమును అతడుమాత్రమే కాక ఇతరులుకూడ అనుభవించుట తప్పదు. ఇతరు లేదైన పని చేసినపుడు దాని ఫలమును అతడుకూడ అనుభవింపవలసియున్నది. ఈ పరస్పరాశ్రయమే సాంఘికజీవితమునకు లక్షణము.

౭. మనుష్యు డెల్లప్పుడు సుఖమునే కోరుచుండును. దుఃఖమును, బాధను అత డెన్నడు వాంఛింపడు. కాని జీవితము సుఖముతో మాత్రమేగాక సుఖదుఃఖములు రెంటితో కూడుకొనియున్నది. మనుష్య ప్రయత్నమంతయు సుఖమును వృద్ధిజేసికొనుటకును, దుఃఖమును తగ్గించుకొనుటకును వినియోగింపబడుచున్నది.

౮. మనుష్యుని సుఖదుఃఖములకు ప్రధానకారణములు రెండు. బాహ్యప్రపంచము—ప్రకృతి—ఒక కారణము. మనుష్యుని ప్రవర్తనము రెండవ కారణము. సకాలవర్షము, సమశీతోష్ణము, నదులు, పర్వతములు, సుభిక్షమగు దేశము మొదలైనవి సుఖకారణము లగుచున్నవి. అతివృష్టి, అనావృష్టి, తుఫానులు, వరదలు, భూకంపములు మొదలైనవి దుఃఖకారణము లగుచున్నవి. ఇదేవిధముగ దయ, దాక్షిణ్యము, అనుకంపనము, సత్యము, అహింస మొదలగువానితో కూడిన మనుష్య

ప్రవర్తనము ఇతరమనుష్యుల సుఖమునకు హేతువగు చున్నది. క్రౌర్యము, మనఃకాఠిన్యము, అసత్యము, హింస మొదలగువానితో కూడిన ప్రవర్తనము ఇతరుల దుఃఖమునకును, కష్టమునకును కారణ మగుచున్నది. మనుష్యునికి మనుష్యుడే శత్రువు.

౯. బాహ్యప్రపంచముమూలమున సంభవించు సుఖదుఃఖముల విషయమున ధర్మము - అధర్మము, న్యాయము-అన్యాయము, మంచి-చెడ్డ అను మాటలను వాడుట అసంగతము. వరదలు ధర్మములా, అధర్మములా అను ప్రశ్న సందర్భహీనము. అట్టి ప్రశ్నకు అర్థమే లేదు. మనుష్యుని ప్రవర్తనవిషయములో మాత్రమే ఈ మాటలకు అర్థమున్నది. ధర్మప్రవర్తనము - అధర్మప్రవర్తనము, న్యాయప్రవర్తనము - అన్యాయప్రవర్తనము, మంచి నడవడి - చెడ్డనడవడి అన్నమాటలు సార్థకములు. అనగా ధర్మాధర్మప్రచారమంతయు మనుష్యుని ప్రవర్తనను బట్టియే ఏర్పడుచున్నది.

౧౦. ఇట్టి సందర్భములో ధర్మము, న్యాయము, మంచి అన్న మాటలకు అర్థమును సులభముగ గ్రహింప వచ్చును. ఎట్టి మనుష్యప్రవర్తనము ఇతరమనుష్యుల సుఖమునకు హేతువగుచున్నదో అదియే ధర్మము; అదియే న్యాయము. ఎట్టి ప్రవర్తనము ఇతరుల దుఃఖమునకు హేతువగుచున్నదో అదియే అధర్మము, అన్యాయము.

౧౧. ఈ నిర్వచనము మూలమున నియమబద్ధమైన జీవితమునకు గల ప్రాధాన్యము స్పష్టమగుచున్నది. మనుష్యుడు సంఘజీవి యగుటచేత అత డేపని చేసినను దానిమూలమున ఇతరమనుష్యులకు సుఖమో, దుఃఖమో కలుగుచున్నది. నియమబద్ధ జీవితమనగా ఇతరులకు సుఖమును కలిగించు పనులుమాత్రమే చేయుట; వారికి కష్టము కలిగించు పనులను మానుట. ఎల్లప్పుడు ఇతర మానవులు కొందరున్నారను దృష్టితో ప్రవర్తించుచు వారికి బాధకలిగించు కార్యములను విసర్జించుటయే నియమబద్ధజీవితము. అట్లుగాక స్వసుఖమును మాత్రమే అభిలషించుచు, దానిని సంపాదించుటలో ఇతరులకు కలుగు కష్టములను గమనింపకుండుట నియమరహితమైన జీవితము. ధర్మమనగా నియమబద్ధజీవితము; అధర్మమనగా నియమరహితమైన జీవితము. నియమరహితమైన జీవితము మనుష్యునికి స్వభావసిద్ధము. నియమబద్ధమైనది ప్రయత్నముచేసినగాని లభింపదు. విద్యాభ్యాసమే ఆ ప్రయత్నము.

౧౨. పురాణములలో ధర్మమునుగురించిన విమర్శ విపులముగ నున్నది. కృతయుగములో ధర్మము నాలుగు పాదములతోడను, త్రేతాయుగమున మూడుపాదములతోడను, ద్వాపరమున రెండు పాదములతోడను, కలియుగమున నొకపాదముతోడను నడుచు నని మన పూర్వులు చెప్పుచుండువారు. భయంకరములు, బీభత్సములును అగు యుద్ధములను జేయుచు, తమకు గల శక్తిసామర్థ్యముల నన్నిటిని ఇతర జనులను చంపుటకును, బాధించుటకును ఉపయోగించుచుండు పాశ్చాత్యులను చూచినపుడును, మతమను పేర నిర్దోషులగు స్త్రీలకు మానభంగము కలిగించుచు పురుషులను చంపుచు రాక్షసులవలె ప్రవర్తించుచున్న మనవారిని చూచినపుడును కలియుగము సాగుచున్నదని ప్రత్యేకముగ చెప్పవలసినది లేదు.

౧౩. "విద్యయొసగును వినయంబు, వినయము వలన బడయు పాత్రత" అను వేమనపద్యములోని సార మిట్టిదే. నియమసహిత జీవితమే వినయము. వినయము కలవాడే మనుష్యు డను పేరున కర్హుడు. ఇట్టి నియమసహిత జీవితమున కలవాటుపడునట్లు చేయుటయే విద్యాభ్యాసము. ఈ అలవాటు కుదురుటకు గురుకులవాస మవసరమని పూర్వులు చెప్పుచుండువారు. స్వగృహమున తల్లిదండ్రుల శిక్షమూలమున ఇది లభించుట సులభసాధ్యము కాదు. బాలుడు చిన్నవయస్సుననే స్వగృహమును వదలి విద్యాలయమునకు వెళ్లవలెను. విద్యాభ్యాసమును తల్లిదండ్రులవద్దగాక ప్రత్యేకముగ నొక గురువువద్ద చేయవలెను. గారాబముగ పెంచిన పిల్లవానిని నియమమందుంచుట తల్లిదండ్రులకు కష్టము. కాఠిన్యము చూపవలసిన సమయములలో కూడ వారు మెత్తని మనస్సుతో ప్రవర్తింతురు. గనుక గురుసమక్షమునగాని విద్యాభ్యాసము జరుగుటకు వీలులేదు. ఇది

గాక ఇతరబాలురు కొందరితో కలిసి ప్రవర్తించినగాని సంఘమం దెట్లు ప్రవర్తించవలెనో ఏబాలుడును నేర్చుకొనలేడు. అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, నౌకర్లు-వీరిమధ్యన నియమసహిత జీవితము ననుసరించుట కష్టతరము. గనుక విద్యాభ్యాసమునకు ప్రత్యేక విద్యాలయములు, ప్రత్యేకమైన గురువులు అత్యవసరము. హిరణ్యకశిపునంతటివాడు కుమారుడగు ప్రహ్లాదునికి విద్యాభ్యాసము చేయదలచి "చదివించెద నాస్థ యొద్ద" అని చెప్పెను. గురువులగు చండామార్కులతనిని "గొనిపోయి యతనికి సవయస్కులగు సహశ్రోతల నసురకుమారులం గొందఱం గూర్చి" అతనిచేత శాస్త్రములను పఠింపించిరి. కుచేలు డతని తండ్రివద్ద చదువుకొనలేదు. శ్రీకృష్ణుడుకూడ అంతే. వీరిద్దరు సాందీపనివద్ద విద్యనభ్యసించిరి. అతని ఆశ్రమమున గురుకులవాసము చేసిరి.

౧౪. నియమబద్ధు డగుట యనిన సంఘధర్మమునకు బద్ధుడగుటయే. గురువగువాడు తన శిష్యులను ఈ ధర్మమునకు బద్ధులగునట్లు శిక్షింపవలెను. ధర్మాధర్మములను నిర్ణయించుట గురువుల పని కాదు. వానిని నిర్ణయించు అధికారము సంఘమునకంతకు చెందియున్నది. సంఘములోనివా రనుసరించు సాంప్రదాయముల సమూహమే ఈ ధర్మము. తరతరములనుండి సంఘములోని సమస్తజనమునకు కలిగిన అనుభవము నుండి ఈ సాంప్రదాయములు, ధర్మము ఏర్పడుచున్నవి. ఎట్టి నియమములకు సంఘములోని సభ్యులును, విద్యాభ్యాసము చేయు బాలబాలికలును బద్ధులు కావలెనో వీనినిబట్టి గురువులు గ్రహించవలసియున్నది. గురువులు ధర్మనిర్ణయము చేయువారు కారు; సంఘము నిర్ణయించిన ధర్మమును శిష్యు లనుసరించునట్లు చేయుటయే వారి పని.

౧౫. ధర్మము కాలానుసారముగ మారుచుండును; అట్లు మారుటకూడ అత్యవసరము. సంఘము ఒప్పుకొనిన ధర్మమునకును, ఒప్పుకొనవలసిన ధర్మమునకును అప్పుడప్పుడు ఘర్షణ జరుగుచుండును. ఒప్పుకొనిన ధర్మమునకంటె ఒప్పుకొనవలసిన ధర్మము ఉత్తమమైనదిగ నుండవచ్చును. అట్టి సందర్భములో గురువులు వారి శిష్యులకు ఏధర్మమును బోధింపవలెను? సంఘము ఒప్పుకొనిన ధర్మమునే బోధింపవలెనుగాని, బోధింపతగిన ధర్మమును కాదు. సంఘము చట్టబద్ధముగ నడువవలయు ననిన ఈ పద్ధతియే సరియైనది. ఒక గురువునకు నచ్చిన ధర్మము మరియొక గురువునకు నచ్చకపోవచ్చును. కొందరు గురువులు ప్రాచీనధర్మమును, మరికొందరు నవీనధర్మమును బోధించుచుండునెడల సంఘమం దరాచకము ప్రబలును. విద్యను నేర్పు గురువులందరు వారి శిష్యుల కొకేవిధమైన ధర్మమును బోధించవలెను. అదియే సంఘము సమ్మతించిన ధర్మము.

౧౬. పూర్వకాలమున ధర్మమునందు విస్తారముగ మార్పులు జరుగుచుండిన ట్లగుపడదు. కాని ప్రస్తుత కాలమున పరిస్థితులు మారుచున్నవి. ఇతరదేశముల తోడను, ఇతర నాగరికలతోడను, విజ్ఞానములతోడను సంబంధ మెక్కువగుటచేత మన ప్రాచీనధర్మములలో ననేక లోపములున్నట్లును, వానిని వెంటనే సవరించుకొనవలసిన అగత్యమున్నట్లును స్పష్టమగుచున్నది. దేశమందున్న నలుబదికోట్ల జనములో కులము, వర్ణము, మతము, భాష మొద లగువానినిబట్టి భేదము లనేకము లున్నను రాజకీయ విషయములలో నీభేదములను పాటించరాదనియు, రాజకీయముగా అందరు ఒకజాతివా రన్న భావముతో మనము ప్రవర్తించుటయే ధర్మమనియు బహుజనాభిప్రాయముగ నున్నది. సవర్ణులయెడ మన మెట్లు ప్రవర్తించుచున్నామో అవర్ణులయెడగూడ అట్లే ప్రవర్తించి అస్పృశ్యతను నిర్మూలముచేయుట ధర్మమని అనేకు లభిప్రాయపడుచున్నారు. విద్యాబోధ చేయు గురువులు ఎంతవరకు ఈ క్రొత్త ధర్మములను వారి శిష్యులకు బోధించవలయు నను విషయములో దేశనాయకులయొక్క అభిప్రాయములనుబట్టి వారు నడుచుకొనుట మంచిమార్గము.

౧౭. ఈ సందర్భములో ఒక క్లిష్టసమస్య ఏర్పడుచున్నది. పరాయిప్రభుత్వమునకు లోబడియుండు దేశములలో ఈ సమస్య కనబడుచుండును. అట్టి దేశములందు దేశనాయకుల అభిప్రాయములకును,

ప్రభుత్వమువారి అభిప్రాయములకును భేదముండుట తప్పదు. ఆ సందర్భములో, ఎవరి అభిప్రాయములను బట్టి గురువులు శిష్యులకు బోధించవలెనను సందేహము కలుగవచ్చును. దేశములో విప్లవము జరుగుచున్న కాలమందు ఇట్టి సందేహమున కవకాశ ముండును. విప్లవకాలమున సంఘ మనుసరించవలసిన ధర్మమునకును, సాధారణ శాంతికాలమున నది యనుసరించవలసిన ధర్మమునకును భేదము కలదు. దేశమందు పరాయి ప్రభుత్వ ముండునంతవరకు ధర్మము ఫలాని దని నిర్ణయించుట కష్టము. ప్రభుత్వమున కేది మంచి యని తోచునో దానినే వారు ధర్మమని చెప్పుచు, అట్టి ధర్మమునే విద్యాలయములలో ప్రబోధము చేయవలెనని శాసింతురు. దేశస్వాతంత్ర్యమున కట్టి ప్రవర్తన మవసరమో, స్వాతంత్ర్యము ననుభవించు దేశములలో ఎట్టి ప్రవర్తనము సాధారణముగ ప్రజలందరు అనుసరింతురో అదియే ధర్మముగ పరిగణింపవలెనని దేశనాయకులు చెప్పుచుందురు. అట్టి సమయములో తగిన విద్యాభ్యాసమునకు వీలుండదు. రాజకీయసమస్య పరిష్కారమగునంతవరకు విద్యాలయములందు ఘర్షణయు, అశాంతియు తప్పదు.

౧౮. పరాయి ప్రభుత్వమునకు లోబడక, స్వాతంత్ర్యము ననుభవించు దేశములలో ధర్మాధర్మనిర్ణయమం దిట్టి కష్ట ముండదు. అట్టిదేశములలో దేశీయనాయకులే ప్రభుత్వాధికారమం దుండెదరు. ధర్మ మేదియో వారే నిర్ణయింతురు. అట్టి నిర్ణయము ననుసరించి గురువులు విద్యాబోధ చేయవలసియున్నది. ప్రస్తుతము మన దేశ మిట్టి స్థితిలోనికి వచ్చుచున్నది. రాష్ట్రములను పరిపాలించు అధికారము ప్రజ లెన్నుకొనిన నాయకుల చేతులలోనికి వచ్చినది. సంఘ సౌష్ఠవమునకును, శ్రేయోభివృద్ధికిని ఎట్టి ధర్మ మనుకూలించునో, ఎట్టిది అనుకూలించదో వారు నిర్ణయించుచున్నారు. వా రావిధముగ నిర్ణయించుటయే ఉత్తమ మార్గము. వారి నిర్ణయమునకు బద్ధులై గురువులు తమ విధులను నెరవేర్చవలసి యున్నది.

౧౯. అనగా సాధారణ కాలమందు ధర్మాధర్మములను నిర్ణయించు అధికారము పరిపాలకులది యని మనము గ్రహించవలెను. కాని దీనికి కొందరాక్షేపణ చెప్పవచ్చును. ప్రజలను బలాత్కరించి పరిపాలనాధికారమును సంపాదించువారు నిర్ణయించు ధర్మమునుకూడ మన మనుసరించవలసినదా? కాని అట్టి ప్రశ్న విప్లవకాలమందే పుట్టును. సాధారణకాలమందు బలాత్కరించి రాజ్యాధికారమును సంపాదించుట జరుగదు. ప్రజామోదమును పొందినవారే అధికారములో నుండెదరు. ప్రజలు వారివారి అభిప్రాయములను వ్యక్తపరచుటకును, ప్రభువుల శాసనములను విమర్శించుటకును అవకాశ మేర్పడును. అందుచేత ప్రజాభిప్రాయమునకును, అధికారుల అభిప్రాయమునకును విస్తారభేద ముండదు. ప్రజకంత కెవరో నాయకు లుండుట అత్యవసరము. వారి ఆమోదముగాంచి పరిపాలకులైనవారే అట్టి నాయకులు. వారు నిర్ణయించు ధర్మము సర్వజనావలంబనీయముగ నుండును.

౨౦. ఈ సూత్రములవలన తేలిన విషయ మేది? స్వరాజ్య మనుభవించు దేశములందును, ప్రజ లెన్నుకొనిన నాయకులు పరిపాలనాధికారము వహించిన దేశములందును ప్రజలు ఎట్టి ధర్మములకును, నియమములకును బద్ధులు కావలెనో నిర్ణయించు బాధ్యత, అధికారము పరిపాలకులయం దున్నది. అనగా విద్యాలయములందు గురువులు ఎట్టి విద్యను బోధించవలసినదీ శాసించు బాధ్యత పరిపాలకులది. ఈ సూత్రము ననుసరించియే మన రాష్ట్రములోని ప్రభుత్వమువారు విద్యావిధానసంస్కరణమున కిప్పుడు ప్రయత్నము చేయుచున్నారు.

౨౧. విద్యావిధానమున కంతకు ప్రధానాంగము గురువు. విద్యావిధానమును సంస్కరింప గోరువారు ఈ విషయమును ముఖ్యముగ గమనింపవలసియున్నది. యోగ్యులగు గురువులు లేనియెడల ఎట్టి సంస్కరణము ఫలవంతము కాజాలదు. యోగ్యుడగు గురువునకు ప్రధానముగ మూడు లక్షణము లుండవలెను. అతని జీవితము నియమబద్ధముగ నుండుట మొదటి లక్షణము. పాండిత్యము రెండవలక్షణము, బోధనాశక్తి మూడవ లక్షణము. ఈ లక్షణములలో నేది లేకున్నను గురువు గురువుగ నుండుట కర్హుడు కాడు. వీటిలో రెండు

మూడు లక్షణములకన్న కూడ మొదటి లక్షణమే ఎక్కువ ప్రాధాన్యము. పసిపిల్లలకు బోధించువారికో ఇదియు, బోధనాశక్తియు ప్రధానములు. పాఠశాలలలోని పిల్లలకు విద్యను నేర్పుటకై ప్రభుత్వమువారు ఉపాధ్యాయులను తయారుచేయుచున్నారు. ఇందుకు గాను రాష్ట్రమం దనేకప్రత్యేకశిక్షణ (Training) విద్యాలయము లున్నవి. అందులో తయారగువారిలో ఈ మూడు లక్షణము లుండుటకు కావలసిన ఏర్పాటు జరుగవలెను. విద్యావిధాన సంస్కరణ మిచ్చటనుండి ప్రారంభముకావలెను.

౨౨. ముఖ్యముగ బాల్యదశయం దుండు వారికి బోధించు గురువులకో నియమబద్ధజీవిత ముండుట అత్యవసరము. ఆ వయస్సులోని పిల్లలు గురువు లెట్లు ప్రవర్తించిన అట్లు ప్రవర్తింతురు. అనుకరణము వారి సహజప్రవృత్తి. చిన్నపిల్లలకు బోధించు ఉపాధ్యాయులను నిర్ణయించుటలో పెద్దవారికి బోధించు కళాశాలలలోని ఉపాధ్యాయుల నియామకమందు చూపు శ్రద్ధ ప్రభుత్వమువారును, తదితరులును చూపుట లేదు. ముఖ్యముగ పల్లెటూళ్లలోని పాఠశాలలయందలి ఉపాధ్యాయుల విషయమున ఇందునిమిత్తమై ఇప్పటికంటె ఎక్కువ శ్రద్ధ చూపింపవలసియున్నది. ఉపాధ్యాయుల జీవితము ఇతరవృత్తుల ననుసరించువారి జీవితముకంటె కొంత విశిష్టత కలదిగ నుండవలెను. వారు ఆదర్శపురుషులుగను, మార్గదర్శులుగను ఉండుట అత్యవసరము. నీతి అందరికిని అవసరమే; కాని ఉపాధ్యాయవృత్తిలోనివారికి ఇది ఎక్కువ అవసరము. ఈ దృష్టితో ఆలోచించిచూచినయెడల సంఘసేవయే తమ ధర్మమని నమ్మిన కొన్ని మతసంస్థలకు చెందినవారు ఉపాధ్యాయులగుట ఉత్తమమని తోచుచున్నది. శ్రీరామకృష్ణమిషన్, దివ్యజ్ఞానసమాజము, క్రైస్తవ మిషనొ మొదలైన సంస్థలకు చెంది, ఉపాధ్యాయవృత్తిని స్వీకరించినవారు చాలవరకు ఆదర్శపురుషులై వారి విధులను నిర్వహించుచున్నారు. లక్షలకొలది ఉపాధ్యాయులు కావలసిన ఈ కాలమందు మతసంస్థలకు చెందినవారిని మాత్రమే ఉపాధ్యాయులుగ నియమించుట సాధ్యముకాని పని. కాని, అట్టివారి మనోభావముతో సమానమైన మనోభావము కలవారు మాత్రమే ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశింపవలెను.

ప్రాచీనకాలమందు మన దేశములో బ్రాహ్మణులే గురువులుగ నుండవలె నను ఆచారములో గల పరమార్థ మిదియే. నియమబద్ధజీవితమునకు బ్రాహ్మణులు పేరుగాంచినవారు. ఉషఃకాలమున లేచి, కాలకృత్యములను తీర్చుకొని, స్నానముచేసి, సంధ్యవార్చి, అగ్నిహోత్రము గావించి, పరిశుభ్రులై, ఆహారమందును, వేషభాషలందును నియమమును పాటించి, ఇతరప్రాపంచిక వ్యవహారములలో పాల్గొనక, కాలమునంతను సద్గ్రంథకాలక్షేపమందును, శాస్త్రపరిశోధనమందును గడపుచు బాలురకు విద్యను నేర్పు ఆకాలపు బ్రాహ్మణుల జీవితము ఆదర్శపూర్వమైన దనుటలో సందేహములేదు. ఆకాలమున నేది సాంఘికధర్మ మని ఎంచబడెనో దానిని భక్తిగౌరవములతో వా రనుసరించుచుండిరి. అట్టివారికడ్డ విద్యనభ్యసించు అవకాశము కలిగిన బాలురు ధన్యులని వేరుగ చెప్పవలసినది లేదు.

ప్రస్తుతకాలమున ఉపాధ్యాయులుగ నుండు వారందరు పుట్టుకచేత బ్రాహ్మణులగుట అనవసరము, అధర్మము. కాని వృత్తిచేత వారందరు బ్రాహ్మణులగుట అవసరము. అదియే ధర్మము. ప్రాథమిక పాఠశాలలయందు ఉపాధ్యాయులుగ నీకాలమున నుండు వారందరు వృత్తిచేత బ్రాహ్మణధర్మము ననుసరించినవారే. వారు నిజమైన బ్రాహ్మణులు కావలసియున్నది. శుచిత్వము, సంస్కారము వారికి అవసరము. వ్యసనము లన్నిటిని వారు వర్జింపవలెను. చుట్టలు సిగరెట్లు త్రాగుట, పేకట్లు ఆడుట, గ్రామములలోని పార్టీ వ్యవహారములలో జోక్యము పుచ్చుకొని కోర్టులకెక్కుట మొదలైన దురభ్యాసములు వారియందెంతమాత్ర ముండకూడదు. ఆత్మగౌరవము కలవారై, ఇతరుల గౌరవమునకు పాత్రులగునట్లు వారు ప్రవర్తించుచుండవలెను. అట్టివారు గురువులైనగాని విద్యావిధాన సంస్కరణము జరుగజాలదు.

ప్రాథమిక పాఠశాలలలోని గురువులేగాక, ఇతర ఉన్నత పాఠశాలలందును, కళాశాలలందును, విశ్వ

విద్యాలయములందును గురువులుగ నుండువారందరు ఇట్టి నియమబద్ధ జీవితము ననుసరించువారుగ నుండవలెను.

౨౩. ఉపాధ్యాయులుగ నుండువారికి పాండిత్యము ఆవశ్యకము. కాని ఈ విషయమును ఇదివరలో ప్రభుత్వమువారు పూర్తిగ గుర్తించి యుండలేదు. ప్రాథమిక విద్యకంటె ఎక్కువ విద్య నభ్యసింపనివారిని ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయులుగ నియమించుట ఆచారముగ నుండెడిది. అట్టివారు ఏమి బోధింపగలరు? అట్టివారినుండి పిల్లలు ఏమి నేర్చుకొనగలరు? ప్రాథమిక పాఠశాలలలో బోధించుటకు ఎక్కువ పాండిత్య మవసరము లేదను అభిప్రాయము అనేకులలో వ్యాపించియున్నది. కాని ఇట్లనుకొనుట గొప్ప పొరబాటు. పిల్లలకు బోధించువారే నిజమైన పండితులుగ నుండవలెను. పట్టపరీక్షలలో ఉత్తీర్ణులైనవారు పిల్లలకు బోధించగలిగినయెడల అంతకంటె ఉత్తమ సంస్కరణము మరియొకటి యుండదు. ఏదైనను, మొత్తము మీద, ఈ ఉపాధ్యాయులకు చక్కని మాతృభాషాజ్ఞాన ముండవలెను. రామాయణము, భారతము, భాగవతము చదివి అర్థముచేసుకొనగల జ్ఞానమున్నవాడు తప్ప ఇతరులు ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయులగుట గొప్ప పొరబాటు. ప్రస్తుత కాలపు ఉపాధ్యాయులలో ఎందరికి ఇట్టి జ్ఞానమున్నదో చదువరులే ఊహింపగలరు. మాతృభాషా జ్ఞానము సంపాదించుట కిట్టి గ్రంథములు ప్రధానసాధనము లగుటయేగాక, మనజాతికి సంఘమునకు సంబంధించి సాంప్రదాయముల మంచిచెడ్డలను గ్రహించుటకును, విమర్శించుటకును ఇంతకంటె ఉత్తమసాధనములు వేరు లేవు. మన సాంప్రదాయములు తెలియనివారు, అందు గౌరవములేనివారు, తెలియకనే వానిని ఖండించువారు ఉపాధ్యాయులగుటకంటె ప్రమాదము వేరొకటి లేదు. సంఘము శిథిలమగుచుండుట కిదియే ప్రధానకారణము. గనుక దేశమును ఈ ప్రమాదము నుండి రక్షింపవలెనన్న భాషాపాండిత్యము గలవారినే ఉపాధ్యాయులుగ నియమించవలసియున్నది.

౨౪. పాండిత్యముతో పాటు ఉపాధ్యాయునికి పిల్లలకు బోధించుశక్తి అపారముగ నుండవలెను. ఈ శక్తి అనేకులకు పుట్టుకతోడనే కలుగుచుండును. అట్టివారే ప్రఖ్యాతిగాంచిన ఉపాధ్యాయు లగుచున్నారు. అనేకులు ఈ శక్తిని ప్రయత్నపూర్వకముగ సంపాదించవలసియున్నది. అందుకుగాను మన ప్రభుత్వమువా రచ్చటచ్చట కొన్ని శిక్షణపాఠశాలలను (Training Schools) స్థాపించియున్నారు. మన రాష్ట్రములో కొన్ని శిక్షణకళాశాలలు (Training Colleges) కూడ నున్నవి. కాని ఈ సంస్థలు మిక్కిలి అసంతృప్తికరముగ పనిచేయుచున్నవి. పిల్లలకు బోధించు పద్ధతుల విషయమున మన దేశమున కనుగుణమగు పద్ధతులను కనుగొనుటయం దివి ఎంతో వెనుకబడియున్నవి. క్రొత్తపద్ధతులనుగురించి పరిశోధనలు ఈ సంస్థలలో జరుగుటయే లేదు. అందుకు తగిన ఉపాధ్యాయులు వీనిలో లేరు. ౫౦, ౬౦ సంవత్సరముల క్రింద పాశ్చాత్యదేశములలో నుండినట్టియు, ఇటీవలి కాలమున వారు విసర్జించినట్టియు పద్ధతులను పట్టుకొని మన శిక్షణపాఠశాలాధికారులు వ్రేలాడుచున్నారు. మాతృభాషను బోధించు విధానమునుగురించి వీనిలో శ్రద్ధవహించుటే లేదు. ఈ కారణములచేత పిల్లలకు బోధించు శక్తి గల ఉపాధ్యాయుల సంఖ్య ప్రస్తుతము చాల తక్కువగ నున్నది.

ఈ లోపమును వెంటనే సవరించినగాని తగిన ఉపాధ్యాయులు లభింపజాలరు. కనీసము స్కూలు ఫైనల్ పరీక్షయందు కృతార్థులైనవారు తప్ప తక్కిన వారెవ్వరు ఉపాధ్యాయులు కాకూడదు. అట్టివారిని మాత్రమే ఈ శిక్షణపాఠశాలలందు చేర్చుకొనవలెను. వారు కనీసము రెండు సంవత్సరముల కాలము శిక్షను పొందవలెను. వీలైనయెడల శిక్షణకాలమును మూడు సంవత్సరములకు పొడిగించుటకూడ మంచిదే. ఆయిదు సంవత్సరములు చదివినగాని వైద్యుడగుటకు వీలులేదు. నాలుగుసంవత్సరములు చదివినగాని ఇంజనీయరగుటకు వీలులేదు. పిల్లలను విద్యావంతులను జేసి, తగిన గృహస్థులగునట్లు తయారుచేయు బాధ్యతగల ఉపాధ్యాయులు ఒకసంవత్సరముశిక్షతో తమ విధులను చక్కగ

నిర్వహింపగలరని అనుకొనుట హాస్యాస్పదము. గనుక విద్యావిధాన సంస్కరణమునకు శిక్షణపాఠశాలల యొక్కయు, కళాశాలలయొక్కయు (Training Schools and Colleges) సంస్కరము మూలమని సంస్కర్తలు గ్రహింపవలెను.

ప్రవేశవసతులు లేక అనేకులు ఇట్టి సంస్థలలో చేరుటకు వెనుదీయుచున్నారు. అట్టివారికి విద్యార్థి వేతనము లిచ్చియు, తర్ఫీదు పొందిన ఉపాధ్యాయుల వేతనములను వృద్ధిచేసియు ఈ లోపమును సవరింప వలెను.

విద్యావిధాన సంస్కరణమునకు సంబంధించిన మరికొన్ని విషయములు ఇంకొక వ్యాసమున వివరింపబడును.

మా శవ్యా !

❀

— శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి —

క్రవ్యాదుల్ చెలరేగి పూరుషుల నోకాళిన్ హతంబార్చె, త
ద్ద్రవ్యమ్ముల్ హరియింప - నెత్తురులపర్దాచాటు హింద్వాంగనల్
ఆవ్యోమమ్ముగ నేడ్చి యేత్తు రవె! హాహాకారముల్! శోకి, మా
శవ్యా! గుండియ విచ్చిపోయిన వె! కాలం బిట్టి దీనాటికిన్.

కతలై నీ మతదీక్ష, యోగ్యతయు విఖ్యాతిన్ ప్రపంచించె, కీ
ర్తి వెల్గించిన నీకు స్వాగతము లుల్లేఖింత్రు దివ్యాంగనల్
సుతు డీ మేరువువంటివానికయి సంశోకించు పుణ్యావని
సతి దుఃఖమ్మును బాపు పుణ్యతము జ్ఞానజ్యోతి ఏడీ యికన్?

ఏల గంగాధవాని! వాయెత్తి ఏడ్తు?
శ్రీయుతుడు పూర్ణపురుషార్థజీవి యతడు
నీచ జీవచ్ఛవాల యున్కికి తపింప
న్యాయమగుగాక! వగపేల అమృతపతికి?

కావ్యాలోకము

= శ్రీ నండూరి రామకృష్ణమాచార్య =

కావ్యము రసాత్మకము. రసానందమే కవికిని ఏకైకసిద్ధి. రసానుభూతియే భావుకునకు పరమ ప్రయోజనము. కావ్యము యశస్సును చేకూర్పవచ్చును. ధర్మమును ప్రబోధింపవచ్చును. ఇంద్రియములను స్వాధీనముచేసి పరిశుద్ధాంతఃకరణప్రవృత్తిని కల్పింపవచ్చును. అర్థసంపాదనకు దోహదము గావచ్చును. ఈ సిద్ధులన్నిటికిగూడ కవితాసరస్వతిని ఉపాసింపవచ్చును. కాని, స్వచ్ఛతానిసర్గమైన కావ్యాత్మ స్వయంప్రకాశమానమైన రసానందస్వరూపము మాత్రమే.

కావ్యసృష్టిలో కవిగాని, కావ్యానుశీలనములో భావుకుడుగాని యీ కవితాసిద్ధులనే పరమప్రయోజనములుగ నెంచిన బ్రహ్మానందసదృశమగు రసానందమును ఆస్వాదింపలేకపోవచ్చును. కావ్యప్రయోజనము ప్రధానముగ రసానందముమాత్రమే. యశస్సు, ధనము, వ్యవహారకౌశలము, పరిశుద్ధాంతఃకరణప్రవృత్తి ఇత్యాది సిద్ధులు గౌణములు. సద్యఃపరనిర్వృతిని గల్పించు రసానందసాక్షాత్కారమునకై కవి యోగివలె ఋషియై తపస్సు సల్పును. కవితాతపస్సునకు రససాక్షాత్కారమే ఏకైకసిద్ధి.

కళాసృష్టిని వేదయుగములనుండి భారతీయాలంకారికులు పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి అను చతుర్వర్గములుగా విభజించినారు. ఋషియైన కవి నిరంతరతపస్సుచే సౌందర్యమును ఉపాసించును. పరమ సత్యమును ఆరాధించును. తపస్సిద్ధుడైన కవి 'పర'లో సౌందర్యమును, సత్యమును అనుభవించును. ఈ సౌందర్యానుభూతిలో కవి యోగి. ఈ యోగము అనుభూతి అనిర్వచనీయము, వర్ణనాతీతము, అనుభవైకవేద్యము. ఈ స్థితి 'పర'. ఈ పరానుభూతిని ఆత్మానుసంధానము చేసికొనిన కవికి ఇంద్రియములు రసస్నిగ్ధము లగును. అతని దివ్యనేత్రము విప్పారును. ఆ దివ్యనేత్రము చూడలేని వస్తువు లేదు. 'రవి గాంచనిచో కవి గాంచును' అన్న సుభాషిత మీ అర్థమునే ప్రవచించుచున్నది. కవితాదృష్టికి సర్వప్రపంచము, ప్రకృతి రసప్లుతమై అమృతత్వమును అందించును. నదులు నర్తించును. పుష్పములు చిరునవ్వులతో పలుకరించును. ఉషాదేవి ముసిముసినవ్వులతో శీత వెలుగులు కురిపించును. మన్మథుడు పుష్పబాణములతో సాక్షాత్కరించును. పాషాణములు జీవములు దాల్చి ప్రత్యక్షమగును. స్వర్గలోకము వివృతద్వారములతో ఆహ్వానించును. పుష్పకోమలము, నిత్యనూతనము, నవనీతపేశలములు నైన భావములు రెక్కలు వచ్చి నిత్యము, నిరవధికము, నిర్వికల్పము నైన అపారమహాకాలాకాశములో స్వైరవిహారము సల్పును. స్వర్గలోకములో నందనవనములో కలహంసపై వీణ వాయించుచు సరస్వతి విహరించును. మందాకినీ కనకేందీవరముల మకరందమత్తములైన ఇందిందిరపాళి నృత్యములకు శ్రుతిగల్పుకొని గంధర్వులు కమ్మని గానము సల్పుదురు. అది ఈ జగత్తు కాదు. మన చర్మచక్షువులతో ఆ లోకమును దర్శింపలేము. అక్కడ దుఃఖము లేదు. సుఖము లేదు. అది కల్యాణనిలయము. ఆనందభువనము. క్షుధార్తుని దీనారావములు, పుత్రశోకార్తదుఃఖనినాదములు రసప్రపంచమున ఆనందగీతికలుగా మారిపోవును. రక్తవాహినులు, ఘోరసంగ్రామరంగములు, శ్మశానవాటికలు- మృత్యుదేవత వికటాట్టహాస తాండవముగూడ ఆనందలీలావిలాసముగా సాక్షాత్కరించును. కల్పకల్పాంతరములలోని బ్రహ్మశిరస్సుల పూలమాలగా ధరించిన నటరాజు లీలాతాండవమునకు కళాజగత్తు రంగభూమి. ఆ లీలాతాండవమునకు, ఆ నాట్యవిన్యాసములోని లయకు శ్రుతి

గల్పుకొని కవి తన ఛందస్సును వినిర్మించుకొనును. కవిత ఛందోరూపమున అభివ్యక్తమగుటకు కారణము వాచామగోచరమైన యీ అనుభూతిని వ్యక్తముచేయు శక్తి వాక్కునకు లేకపోవుటయే. ఛందస్సులోని లయవలన వాక్కు చెప్పలేని అర్థమును కవి ప్రపంచించుచున్నాడు. రసప్రపంచమున సూర్యుడు, చంద్రుడు, భూమి, నక్షత్రములు, నవగ్రహములు, నదులు, వృక్షములు, మనుజులు, పక్షులు, మృగములు—సమస్త ప్రకృతి ఆనందపూరితమైన సౌందర్యదీప్తిలో ఓలలాడుచు నర్తించుచుండును. ఆ సౌందర్యస్ఫురణకు ఆ ఆనందపరవశత్వమునకు అంతర్వాహినివలె ప్రవహించుచు, జీవనాడివలె స్పందించుచున్న సత్యమునకు, సౌందర్యమునకు, దివ్యగానమాధుర్యములకు శ్రుతిగల్పుకొని ఆలపించుటయే కవితాగానము.

అనిర్వాచ్యమైన యీ అనుభూతిని లౌకికార్థచిహ్నితమైన భాషలో ఋషియైన కవి అప్పుడు చెప్పలేడు. చెప్పవలయునను ఉత్కంఠయూ నుండదు. అంతవరకు ఆ యోగి ఋషియేగాని కవి గాడు. అనుభవతన్మయుడై, సమాధినిష్ఠుడై, రసపరవశుడై నిమీలితనేత్రుడై యుండును. విప్పారిన దివ్యనేత్రముగూడ అనుభవపారవశ్యమున ఆనందబాష్పవిలులిత మగును. అనుభవించిన కవి పులకితుడై సత్యమును, సౌందర్యమును ఉపాసించును. ఈ ఉపాసన పశ్యంతి. ఋషియైన కవి క్రాంతదర్శనముచే సౌందర్యమును దర్శించి సత్యమును అనుభవించును. కాని, సందర్శించిన సౌందర్యమును వెంటనే ప్రదర్శించుటకు వీలులేదు. కవిత ఆత్మానుసంధానము. తపస్సు. ఆధ్యాత్మికానుభూతి. పరిమితశక్తి గల వాక్కు అపరిమితార్థమును ఆవిష్కరించుకొనుట, మర్త్యహృదయము ఆత్మజ్యోతిని అమర్త్యము, దివ్యము నైన అమరజ్యోతిలో లీనమొనర్చుట, ఐహికకలుషితమైన భావన అనంతత్వమును ఆవిష్కరించుకొని కాలమువలె నిత్యము, నిరవధికము, నిర్వికల్పముగా సనాతనముగా వెలుగుట కవితాసృష్టి.

అనిర్వచనీయమైన యీ అనుభూతిని, సందర్శనమును అంతరాత్మలో లీనమొనర్చుకొనుట 'మధ్యమ'. కావ్యసృష్టి 'వైఖరి'గా వెల్లివిరియుటకు అవ్యవహిత పూర్వముగా నున్న సమాధి 'మధ్యమ'. లౌకికమైన ప్రదర్శనముగా అభివ్యక్తమగుటకు ముందు, అర్థచిహ్నితమైన వాఙ్మయముగా విలసిల్లుటకు పూర్వము కవి దర్శనము మధ్యమలో అంతఃకరణము నావేశించియుండును. అప్పుడే యీ దర్శనము కవి ఆత్మీయ మగుచున్నది. ఒకే సత్యమును, సౌందర్యమును దర్శించిన కవుల కావ్యసృష్టి భిన్నరూపము దాల్చుటకు కారణము సమాధిభేదమే. కావ్యసృష్టికి సమాధి అవసరము. వేదాంతులు ఈ సత్యమునే వేరొకరీతిగా ప్రవచించుచున్నారు. పరమాత్మ పునఃసృష్టికి పూర్వము యోగనిద్రాముద్రితుడై పరమసమాధినిష్ఠుడై యుండును. 'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః' (అపారమయిన కావ్యసంసారములో కవియే సృష్టికర్త) అన్న ఆలంకారికసూక్తి మిక్కిలి అర్థవంతము.

కళ పునఃసృష్టి. యథార్థజగత్తు వేరు; కళాజగత్తు వేరు. ఒకటి సత్యము అయిన వేరొకటి అంతకన్న సత్యము. కళ అనిన ఏమి? మానవుడు ఈ విశాలవిశ్వమున ఏనాడు ఉద్భవించెనో ఆనాడే యీ జిజ్ఞాస బయలుదేరినది. సృష్టిలో ఉద్భవించిన తొలిమానవుని హృదయమును రసతరంగితము చేయుచు తొలిఉషస్సుల సంధ్యారాగములో వికసించిన తొలిపువ్వును, అనంతాకాశములో బయలుదేరి అలనాటి మానవుని నేత్రము సోకిన తొలినక్షత్రకిరణము, కొండచరియలనుండి జలజల జారుచు దిగివచ్చి అవ్యక్తగానముతో మానవహృదయమును పరవళ్లుత్రొక్కించిన సెలయేరు- ఈ జిజ్ఞాసను రేకెత్తించినవి. సౌందర్యస్ఫురణము వాసనలుగా రేకెత్తించినవి. అయిన కళకు ప్రకృతిచిద్విలాసము మూలమా? అన్న ప్రశ్న ఉదయించును. సౌందర్యస్ఫూర్తి కళోపాసకు మూలము. ప్రకృతిలో సహజసౌందర్యస్ఫోరకములైనవి కళాసృష్టికి ఆద్యప్రకృతులు. కాని ప్రకృతి, కళ కాదు. ప్రకృతి, కళ ఎచ్చటను కలియని సమాంతరరేఖలు. ప్రకృతిసౌందర్యములో గల స్ఫుటితస్ఫూర్తియే భావుకుని పులకితుని చేయుచున్నది. కళ ప్రకృతికి అనుకరణము కాదు. ఒక సెలయేరు. ఆ సెలయేటి యొడ్డున రెండు తాడిచెట్లు, ఆ తాడిచెట్ల మధ్య

పొదరిండ్లపై శీతవెన్నెల వెలుగులు కురిపించుచున్న చంద్రవంక — ఇట్టి మనోహరదృశ్యమును చిత్రించిన చిత్రకారుని చిత్రలేఖనము కళ. ఆ ప్రకృతిసన్నివేశమును ఛాయాచిత్రమును తీసిన అది ఛాయాగ్రహణ విద్య. కళ కాదు. చిత్రకారుడు తన దివ్యచక్షువుచే సందర్శించిన సౌందర్యమును ప్రదర్శించినాడు. అనగా చిత్రకారునికి ప్రకృతియొక్క భౌతికరూపము గాక రసస్వరూపము గోచరించినది. సౌందర్యముయొక్క విశ్వరూపప్రదర్శనము రసస్వరూపము. వాస్తవిక జగత్తు సత్యమా? కళాజగత్తు సత్యమా? వాస్తవికజగత్తు మిథ్య యని వేదాంతు లన్నారు. కాని, కవి తన దివ్యనేత్రముతో క్రాంతదర్శనముచే సందర్శించిన కళాజగత్తు నిత్యము, సత్యము, నిరవధికము, నిర్వికల్పము.

సమాధిస్థుడైన ఋషికి తాను దర్శించిన సౌందర్యమును, అనుభవించిన సత్యమును ప్రదర్శింప సంకల్పము ఉదయింపగనే ఆ ఋషి కవి యగుచున్నాడు. కవితాసృష్టికి కారణమేమి? ఈ ఋషికి సృష్టిసల్పు సంకల్పమేల ఉదయింపవలెను? అన్న ప్రశ్నలకు సమాధానము అనుభవైకవేద్యము. విశ్వసృష్టికి కారణ మేమి? పరమాత్మకు సృష్టిసల్పు సంకల్పము ఏల ఉదయించినది? అన్న ప్రశ్నలు వేదాంతులకు అనుభవైకవేద్యములు. కవిగూడ సృష్టికర్త. కళ పునఃసృష్టి. రాజశేఖరుడు 'కావ్యమీమాంస'లో కావ్యకారణమైన ప్రతిభను భావయిత్రి : సమాధి : కారయిత్రిగా ప్రస్తరించినాడు. మధ్యమలో సృష్టిసంకల్పము కలుగగనే ఋషి కవి యగును. కారయిత్రి అను ఈ శక్తి నిద్రావస్థలో నున్న గొంగళిపురుగు సీతాకోకచిలుకవలె మారునట్లు చైతన్యము దాల్చి 'వైఖరి'గా మారి రెక్కలు తొడుగుకొని విశ్వవిహారమునకు బయల్వెడలును.

'వైఖరి'గా కవిభావన మర్త్యలోకమునకు అవతరించుచున్నది. వైఖరి భిన్నభిన్నకళలలో భిన్నభిన్న రూపములు దాల్చుచున్నది. కవిత్వము చిత్రలేఖనము సంగీతము శిల్పములతో అవస్థాపరిణామములతో, నామభేదములతో సాక్షాత్కరించుచున్నది. 'పర'లో దివ్యలోకములో నధివసించిన సౌందర్యమును- చర్మచక్షువుల కందని ఆ సత్యమును- అనిర్వచనీయమైన ఆ అనుభూతిని వచనీయముగా చేసి లౌకికార్థచిహ్నితమైన భాషలో- పరిభాషలో వైఖరిగా కవి ప్రతిపాదించుచున్నాడు. కళ స్వర్గమర్త్యముల వియ్యమందు కల్యాణసదనము. కావున భాష కవిభావనకు ఒక క్రీనీడవంటిది మాత్రమే. కవి వైఖరిలో శబ్దశక్తిని ఉపాసించుచున్నాడు. తపస్వి, మంత్రద్రష్టయైన కవి ఉపాసించిన శబ్దమునకు ఎంతయో శక్తివచ్చును. ఈ శక్తిని ఆలంకారికులు వాచ్యము, లక్షణ-జహల్లక్షణ, అజహల్లక్షణ, వ్యంగ్యము, ధ్వని అను శాఖోపశాఖలుగా ప్రస్తరించినారు. ఇది వాచ్యమైన అర్థమును అనిర్వాచ్యమైన కవిభావనను చేర్చును. లక్షణ-వ్యంగ్యము- ఇత్యాది శక్తులవలన భావుకుడు వైఖరిని దాటి కవితానుభూతిని ప్రవేశించి మధ్యమను చీల్చుకొని పశ్యంతిని జేరి కవి దర్శించిన సౌందర్యమును దర్శించును. సత్యమును అనుభవించును.

ఈ అనుభూతి వైవిధ్యము. భావుకులకు అధికారతారతమ్యము గలదు. శబ్దశక్తిగూడ పరిమితము. ఉత్తమాధికారియైన భావుకుడు ఉత్తమోత్తమమైన ధ్వనిసహాయమున పశ్యంతిని గాక 'పర'ను చేరుటకు ప్రయత్నించును. ఇట్లు 'పర'ను చేర్చుటలో శబ్దము ఛందస్సులోని నాదసహాయము నపేక్షించును. ఈ అనుభూతి అనుభవైకవేద్యము. అనిర్వచనీయము గనుక. అప్పుడు భావుకుడు బ్రహ్మానందసదృశమైన రసానందమును అనుభవించును. రసజ్ఞుని ఇంద్రియములు రసస్నిగ్ధమై దివ్యదర్శనము కలుగును. దివ్యగానము వినిపించును. కావున కవిత ఛందోమయముగ, నాట్యము తాళలయాన్వితముగ, సంగీతము శ్రుతిశుద్ధముగ అభివ్యక్తమగుచున్నది. రసానందము సద్యఃపరనిర్వృతి అన్న ఆలంకారికప్రవచనము నీ అర్థములో గ్రహింపవచ్చును. పుంఖానుపుంఖముగ నీ అనుభూతిని సమీక్షించిన పర- పశ్యంతి - మధ్యమ - వైఖరి - వాచ్యము - లక్షణ - వ్యంగ్యము - ధ్వని - నాదము - పరగా చివరకు 'పర'ను చేరుచున్నది.

కవితాసృష్టికి, అలంకారములకు అవినాభావ సంబంధము గలదు. అనిర్వచనీయమైన అనుభూతిని

ప్రవహించు కవికి ఉపమాద్యుపకరణములు మిక్కిలి తోడుపడును. ఉదాహరణమునకు పంచపాండవుల మధ్య నడుచుచున్న ద్రౌపది ఐదు కొండల నడుమ ప్రవహించుచున్న నదివలె నున్నదన్నప్పుడు 'కొండలు' 'నది' అన్న శబ్దములేగాక ఆ శబ్దములు ప్రపంచించిన ఉపమానమువల్ల భావుకుని మనఃఫలకమందు సాక్షాత్కరించిన ఐదుకొండల మధ్య ప్రవహించు ఒక నది కవి భావనను ప్రదర్శించును. కాని సమ్యగ్దర్శనము లేని కవి చేతిలో ఉపమానాద్యుపకరణములు అపకర్ష హేతువులగు ననుట భూతార్థము. ఒకవేళ సమ్యగ్దర్శన మున్నను వైఖరికి అవ్యవహితపూర్వముగా నున్న మధ్యమలో సమాధిలోపించినను లౌకికార్థచిహ్నితమైన వైఖరిగా వెలువడలేదు. కవి దివ్యనేత్రము విప్పారినప్పుడు మధ్యమలో కారయిత్రిగ సంకల్పము కల్గినప్పుడు కవి శబ్దబ్రహ్మము నుపాసించును. ఆ తపఃఫలమే వైఖరి. ఆదిని స్థాయీభావముగా బయలుదేరిన రసభావము వ్యభిచారాదిభావములచే, ఉద్దీపనవిభావములచే పరిపుష్టినంది చివరకు రసస్వరూపముగా అభివ్యక్తమగును. భావుకునికి కవితలో రసభావపరంపర ఉదయించినను, చివరకు కొన్ని భావములు మాత్రమే స్థాయీభావములై రసముగా సాక్షాత్కరించును.

వ్యావహారికముగ జూచిన, కావ్యమునకు బహుళ ప్రయోజనములు గలవు. కాని కవి ఆ ప్రయోజనము లక్షై కవిత చెప్పడు. కావ్యము అల్లడు. అనగా మహాకవికి కవిత నిసర్గలక్షణము. నదులు పారునట్లు, చెట్లు చిగిరించునట్లు, పుష్పములు వికసించునట్లు కోకిలలు కూయునట్లు కవి కవిత నాలపించును. కవిత కవితకొఱకే. సృష్టికర్త విశ్వమును సృష్టించునట్లే కవి కావ్యసృష్టి సల్పును. అది విశ్వలీల. ఇది కావ్యలీల. అయిన కవి కావ్యము నేల ప్రచురింపవలెను ? అను ప్రశ్నకు సృష్టికర్త విశ్వము నేల సృష్టింపవలెను అని సమాధానము. కాని, కావ్యప్రచురణ కవి కవిగా గాక పౌరుడుగా సల్పుచున్నాడు. ప్రచురణగూడ కావ్యసృష్టిలో అంతర్భాగము కాదనుట భూతార్థము.

కవి నర్మోపదేష్ట కాడు, ఆలంకారికులు కావ్యమును కాంతాసమ్మితమనిరి. అనగా ప్రత్యక్షబోధ కావ్యలక్షణము గాదు. కావ్యము రసానందస్వరూపము. రసానందము బ్రహ్మానందసదృశము. బ్రహ్మానందము రజోతమస్సు లడగినతర్వాత సత్త్వముగూడ సమసిపోయినగాని సిద్ధింపదు. రసానందముగూడ సాత్త్వికభావములకు పైమెట్టు. కవి ఋషిః ఋషియైన కవి ద్వంద్వాతీతుడు. కావ్యగౌరవమునకు ధర్మప్రబోధము గీటురాయి కానేరదు. పాపము ఎట్లు ఋషిని చేరదో అట్లే పుణ్యముగూడ తాకలేదు. మహర్షుల తపస్సు విశ్వశ్రేయమునకు హేతుభూత మగునట్లు సాహితీతపస్వియైన కవికావ్యముగూడ నిసర్గముగ విశ్వకల్యాణోదర్క మగుచున్నది. సాహితీతపస్వికావ్యము భావుకుని అసత్తునుండి సత్యమునకు, చీకటినుండి వెలుగునకు, మృత్యువునుండి అమృతత్వమునకు మార్గదర్శక మగును.

"రసోజ్ఞ సః"

ఇంతటి త్యాగమా!

("తోటమాలి" * తరువాతికథ)

❁

— శ్రీ ఆచంట జానకిరామ్ —

[రాజకుమార్తె తోటమాలిని ప్రేమిస్తుంది. ప్రేమచిహ్నంగా అతని వ్రేల తన వెలలేని వజ్రపుటుంగరాన్ని ఉంచుతుంది. కాని, తాను పిలువనంపగా కోటలోకి తనవద్దకు వచ్చిన తోటమాలిని తన తల్లి, అన్నగార్ల యెదుట 'ఎవరు నువ్వు! ఎవరు నువ్వు!' అని ప్రశ్నిస్తుంది. కూతురిచేతిలో తోటమాలి కానుక పూలమాలను చూచిన రాజమాత సంగతి గ్రహించి అతనికి ఆపద రాకుండా కాపాడి, ఆగంతుకుని త్వరగా కోటలోంచి పంపించివేస్తుంది. అవమానంతో క్రుంగిపోతూ ఇంటికి వచ్చిన తోటమాలిని, తండ్రి పెద్దమాలి తన సందిటిలోకి తీసుకుని ఓదార్చుయత్నిస్తాడు. తోటమాలి నిద్రాహారాలు మాని, ఉదయభానుని చూస్తూ, రాజకుమార్తె ఇచ్చిన వజ్రపుటుంగరంతో తన ఎర్రనికళ్లు తుడుచుకుంటూవుంటాడు - ఇప్పటికీ, ఎప్పటికీని.]

చంద్రునిలోని మచ్చ అల్లా వెండిపళ్లెమంతా వ్యాపించిపోయిన ఆ రాత్రిని ఎన్నటికీ మరువలేడు తోటమాలి ...... సెలయేటి ఇసుకతిన్నెలలో పిచుకగూళ్లు కట్టుకుంటూ ఆడుకుంటూవుండగా రాజకుమార్తె తన వేలిని వుంచిన ఉంగరం — వజ్రపుటుంగరం, ఎంత మరచిపోవాలన్నా, ఆమెను మరచిపోనివ్వదు.

ఎంతో ప్రయత్నించాడు తోటమాలి తండ్రి—పెద్దమాలి—కొడుకును మన ప్రపంచకంలోకి మరల్చాలని. కాని, లాభంలేదు. కొడుకు పలుకడు — నిట్టూర్పైనా లేదు. గంటలతరబడి వజ్రపుటుంగరంలోకి అల్లాగే చూస్తూవుంటాడు. పెద్దమాలి మరీ సముదాయింపబూనితే, జాలిగా తండ్రికేసి చూస్తాడు: "నాన్నా! నాన్నా!" అంటాయి, కడుపు చెరువయ్యేటట్టు, అతని కళ్లు. అల్లాంటప్పుడు పెద్దమాలిమనోవీథిని కాలము ఇరవైయేళ్లు వెనక్కి జరిగిపోతుంది ఒక్కపరుగున. పొత్తిళ్లలోని పసికూన, పురిటిలోనే తల్లిని పోగొట్టుకున్న అర్భకుడు కనిపిస్తాడు; పసికందును వణికే తన చేతులలో ఉంచి, 'తల్లైనా మీరే! తండ్రైనా మీరే!' అన్న ఆమెకడసారిమాటలు వినిపిస్తాయి...

ఎంతో బతిమాలాలి అనుకుంటాడు. "కన్నతండ్రీ! నాకోసం — నీ ముసలితండ్రి కోసం"-అనాలి అనుకుంటాడు. కాని, తన ఓదార్పు నిష్ప్రయోజనం అని తెలుసు.

కాలమే మాన్పాలి ఈ గాయాన్ని...

*　　*　　*

* ౧౯౪౩ సెప్టెంబరు భారతిలో ప్రకటింపబడినది.

మూడు రాత్రింబవళ్లు అల్లాగే, తదేక దృష్టితో శూన్యంలోకి చూచాడు తోటమాలి. నాల్గవనాటి వేకువను తూరుపు తెల తెలవారుతూ ఉండగా, ఆ శూన్యమవతల ఏమి కనబడిందో, ఆ కాటుకచీకటిలో ఏమి మెరిసిందో చటుక్కున లేచి తండ్రిపాదాలను తాకాడు.

"ఎర్రావుపాలు పితగనా, నాన్నా!" అన్నాడు.

పెద్దమాలిఆనందానికి మేరలేదు. "నేను పితుకుతాను, నువ్వు దూడను వదులు" అన్నాడు.

తండ్రి పాలు పితుకుతూఉండగా, లేత గరికచిగుళ్లు తినిపిస్తున్నాడు దూడకు తోటమాలి. దూడను అతిఆప్యాయంగా మూజూస్తూవున్న గంగగోవుకళ్లు ధగధగ మెరిసిపోతున్నాయి.

ఆ ధగధగ తోటమాలికి వింతచైతన్యాన్ని కలిగించింది. తండ్రి అందిచ్చిన గుమ్మపాలు ఒక్కబిగిని తాగివేసి, గునపం, పార పుచ్చుకొని తోటలోకి వెళ్లిపోయాడు తోటమాలి. దక్షిణపువైపు కంచె పడిపోయిందని ఎత్తికట్టడానికి అటువెళ్లాడు పెద్దమాలి.

తోటమాలి మిట్టమధ్యాహ్నం ఒక్క అరగడియ విశ్రమించాడు, అంతే! ప్రొద్దుగ్రుంకేలోపుగా పూలమొక్కలన్నీ త్రవ్వేశాడు. ఒక్క మొక్క లేదు.

మాలతీతీగవద్దమాత్రం ఒక్కక్షణం అనుమానించాడు. ఎంతో ప్రయత్నాన, ఆవేళ, మామిడిమొక్కపైకి తామిద్దరూ కలిసి ఎక్కించిన తీగ...ఆ కాస్తపనికే అలసిపోయింది ఆమె!

...ఒక్క దెబ్బతో తెగిపోయింది తీగ. ఒక్క గునపపుపోటుతో పెల్లగిలివచ్చింది వేరు.

చీకటిపడేటప్పటికి ఆ తోటలో ఒక్క పూలమొక్క లేదు.

* * *

మరునాడు, తండ్రీ కొడుకూ కలసి శుభ్రంగా దున్ని వేశారు తోటనంతా.

మూడురోజులు ఆరనిచ్చి, క్రొత్తవిత్తులు చల్లాడు తోటమాలి......

...తండ్రీ కొడుకూ కలసే పని చేస్తున్నారు...కలసే భోంచేస్తున్నారు ... ఒక్కచోట పడుకుంటున్నారు. కాని, ముక్తసరిగానే మాటలు. కొడుకుముఖాన మునుపటి మేఘాలు లేవు. అతని కళ్లల్లో ఒక క్రొత్త వెలుగు...హఠాత్తుగా చూస్తే మాత్రం, తోటమాలి ఒక పదేళ్లు పెద్దయినట్టు వుంటుంది. అతడొక యోగిలా కనపడతాడు ఇప్పుడు—తండ్రికికూడా!

* * *

మళ్లీ పున్నమ వచ్చేసరికి తోటంతా పువ్వులతో నిండిపోయింది. అన్నీ ఎర్రటి పువ్వులే. ఏ వంక చూచినా ఎర్రటిపువ్వులే— అదీ, అప్పుడు తగిలిన గాయంలోంచి ద్రవించే రక్తపు ఎరుపు!

* * *

ఈ నెలరోజులూ తోటమాలి ఊరుకోలేదు. కోడికూతవేళనే లేచి, బండికి ఎడ్లను పూన్చి, పైకొండలలోకి వెళ్లేవాడు. ప్రొద్దు నెత్తిమీదికి వచ్చేసరికి తిరిగి వచ్చేవాడు...

ఒక్కడూ, ఎండిపోయిన ఆ సెలయేటి ఇసుకలో దింపేవాడు కొండను దొల్చి తాను తెచ్చిన చలువరాతి పలకలను.

ఎవరి సహాయం లేకుండానే, ఆ నదీగర్భంలో, వైశాఖమాసంలో, ఆ వెన్నెలలో రాజకుమార్తే, తానూ కథలుచెప్పుకున్న చోటనే నిర్మించాడు చలువరాతి మందిరం.

ఆమె పలికిన ఒక్కొక్కమాటే వల్లించుకుంటూనే కట్టాడు చలువరాతి మెట్లు....

రత్నఖచితమైన ఆమెగాజుల మ్రోత వింటూనే నిర్మించాడు ఆమెలాంటి ప్రతిమనే...

వాడి నేలకు వాలిన తీగను పైకి ఎత్తుతూ ఆమె చూపిన అలసత్వాన్ని తలుచుకుంటూనే చెక్కాడు ఆమెనేత్రాలను...

మొదటిమాటు వాగులోని నీటిని తన దోసిలిలోంచి రుచిచూస్తూ "ఎంత తియ్యగా ఉన్నాయి" అన్న ఆమెనోటిని చూస్తూనే దిద్దాడు చలువరాతి పెదవులను...

* * *

మళ్లా పున్నమకు మందిరము పూర్తయింది. పొగడచెట్లమరుగున వాగులో, నదీగర్భాన, చలువరాతి మందిరం. చలువరాతి వేదికపైన, బొటనవ్రేలిమీద అంటీఅంటనట్టు నుంచున్న అప్సరసభంగిమ, తోటమాలితీయటి కలలన్నీ రూపందాల్చి వెలసిన చలువరాతి ప్రతిమ—ప్రతిమకాదు, హృదయాన్ని చీల్చుకువచ్చిన పాట...

సూర్యుని మొదటి కిరణాలు వేదికకు బంగారపుపూత పూస్తూవుండగా, ఆమె పాదాలను అలంకరించేవాడు రక్తవర్ణమైన రకరకాల పువ్వులతో...

మధ్యాహ్నపు వేళలలో, విశ్వప్రపంచకమే ఒక్కక్షణం కునుకుతూవున్నప్పుడు, మందిరప్రాంగణంలో కూర్చొని మొగలిరేకులలో నింపేవాడు—తాము ఆ రోజులలో ఒకరిచెవిలో ఒకరు చెప్పుకున్న అందమైన మాటలన్నీ......

చీకటిపడుతూవుండగా, తాను వెలిగించిన తైలదీపపు తోరణాలక్రింద నుంచుని ఆ విజనప్రదేశంలో గొంతెత్తి ఆమెదివ్యనామ సంకీర్తనం చేసేవాడు ... ఉషాబాలనుగూర్చి పాడడానికి సాహసింపలేకపోయిన పాటలన్నీ పాడేవాడు గొంతెత్తి, ఆ విజనప్రదేశంలో—తోటమాలి!

"దేవీ! ఈ శిథిలాలయంలోనే నాట్యం చేస్తావా! భగ్నహృదయవినిర్గతశోకగీతమే నీకు శ్రావ్యమా!......స్వర్ణసీత ఒక అన్వేషణ...ఒక దివ్యానుభూతి స్వర్ణసీత!... అంతమే లేని ఆవేదన స్వర్ణసీత!"—అంటూ విలపించేవాడు తోటమాలి!

* * *

మళ్లా నవరాత్రులు వచ్చాయి ... బొమ్మల పండుగ... దేవీపూజ.

"రాజమాత దేవీపూజ చేస్తున్నారు. మీ తామరకొలనులో పెద్దతామరపువ్వులు ఒక వేయిపూవులు పంపమని సెలవైంది" అన్నది పెద్దమాలితో దివాణంలోని పరిచారిక చంపకం. అప్పుడెప్పుడో, వేసవిరాత్రి వెన్నెలలో వాగువద్ద ఇసుకతిన్నెపై కూర్చొని ఈ చేతిలోని ఇసుక ఆ చేతిలో పోసుకుంటూ, పరధ్యానంగా ఉన్నప్పుడు తోటమాలితో "దేవిగారి సెలవైనది" అన్న పరిచారికే.

పెద్దమాలి ఏదో పనిమీద వున్నాడు. "వస్తా-పద. పొగడచెట్లకు ఉత్తరంగా వున్న ఎర్రతామరకొలనిలోని పువ్వులు లాగి ఇస్తాను. వెళ్లు - నీ వెనుకనే వ స్తా ను" అన్నాడు...

...పొగడచెట్లకు ఉత్తరంగా వెళ్లడానికి బదులు పొన్నపువ్వులు కోసుకుంటూ వాగుదరి జేరింది పరిచారిక. వాగుమధ్య ఏటవాలుగా వస్తూవున్న సూర్యకిరణాలలో ధగధగ మెరిసిపోతోంది మందిరం.

కొన్ని అడుగులు ముందుకు వెళ్లి పరీక్షతో చూచింది పరిచారిక.

చలువరాతి మెట్లు...మెట్లకు అవతల, దేవతలే చెక్కారా అనిపించే అతిచక్కని నగిషీమకరతోరణాలు...

ఇంకా లోపల, ఎర్రని పూలతో నిండిన ఎత్తైన వేదికపైన ప్రతిమ...

ప్రతిమముందు వంగి పువ్వులు అలంకరిస్తున్నాడు తోటమాలి.

ఇంక రెండు అడుగులు ముందుకు వేసింది పరిచారిక.

ప్రతిమమెడలో ఎర్రని కాశీరత్నాల మాల వేసి, ఒకప్రక్కకు జరిగాడు తోటమాలి.

ఆ నిమిషమే సూర్యుని కిరణాలు ప్రతిమ ముఖాన్ని బంగారపు కాంతితో నింపివేశాయి.

పరిచారిక చూచింది : ఆ ముఖమే ! ఆ కన్నులే ! ఆ పెదిమలే...

...పూజ ముగించుకుని మందిరముబయటకు వచ్చే తోటమాలికి పొన్నలగుంపులో కలసిపోతూవున్న ప రి చా రి క చీరచెరగు మాత్రం కనిపించింది...

"దివాణంనుంచి ఎవరో వచ్చినట్టున్నారు" అన్నాడు తండ్రితో. "అవును - కామాక్షి కూతురు చంపకం వచ్చివెళ్లింది. పూజకోసమని ఎర్రతామరపువ్వులు తెమ్మని పెద్దరాణీగారు పంపారు" అన్నాడు పెద్దమాలి.

*   *   *   *

గంపనిండా ఎర్రతామరపువ్వులు తీసుకుని దివాణంలోకి వచ్చింది పరిచారిక—

మరునాడు ఊరు ఊరంతా సాటిపోయింది : లోయతోటలోని వాగులో చలువరాతి మందిరంలో తోటమాలి పూజచేసే దేవతా విగ్రహం రాజకుమార్తె ... రాజకుమార్తే ! అని.

*   *   *

అల్లనేరేడుచెట్టుదగ్గర ఆవును పాలు పితికి, దూడను వదలి, పలుపు చెట్టుకు కడుతున్నాడు పెద్దమాలి.

తోటగుమ్మంవద్ద దివాణంవారి మేనా ఆగింది. మేనాతలుపులు తెరచుకొని తోటలో అడుగుపెట్టింది రాజమాత !

పెద్దమాలి గుండె దడదడ కొట్టుకొంది ...కొడుకు పనిచేస్తున్న పారిజాతపు చెటు క్రింది కొండగోరింటి మడివేపు ఒక్కసారి చూచి, రాజమాతను ఆహ్వానించడానికి తొందరగా నడిచాడు పెద్దమాలి.

వంగి అతను చేసిన ప్రణామం అందుకుంటూ, సౌజన్యం వెదజల్లుతూ, సెలవిచ్చినది రాజమాత :

"తామరపువ్వులు చాలా బాగున్నాయి. రేపు ఉదయం ఇంకో వేయిపువ్వులు

పంపు మాలీ! ... తోటంతా క్రొత్తగా వేశారా?...ఆ పారిజాతపు చెట్టుక్రింద, అత నేనా మీ వాడు?"

పెద్దమాలి తలెత్తలేకపోయాడు...పొర్లి వచ్చే దుఃఖాన్ని ఆపుకోవడమే విశ్వప్రయత్నమైంది...

భూమివైపు చూస్తూనే "చిత్తం" అన్నాడు.

ముందుకు నడుస్తూనే అన్నది రాజమాత :

"అన్నీ క్రొత్తమొక్కలే! ... ఏమి ఎరుపు! ఏమి ఎరుపు!"

తండ్రీ, రాజమాతా మాట్లాడుకోవడ చూచాడు, దూరాన పారిజాతపు చెట్టువద్ద వున్న తోటమాలి. గబగబ వాగువైపు వెళ్లిపోయాడు......

...తోటవిషయమే మాట్లాడుతూ, తామరకొలనువైపు నడచింది రాజమాత. అతిభక్తితో ఆమెను అనుసరించాడు పెద్దమాలి, కొడుకు వాగువైపు వెళ్లిపోవడం క్రీగంటితో చూచి.

ఆరబోసిన కుంకంలా వుంది తామర కొలను. ఎర్రతామరలు అద్భుతంగా వికసించాయి.

"ఓ పదిపువ్వులు కోసి ఈ సజ్జలో పెట్టు మాలీ!—మా పూజకు కావాలి" అని పురమాయించి, తాను పొగడచెట్లవేపు నడిచింది.

...పొగడచెట్లకేసి నడుస్తూ రాజమాత తోటనంతా ఒకసారి పరకాయించి చూచింది. ఎంతో కొత్తగా వుంది తోట. కాని ఏదోలోటు కనపడుతోంది ఆవిడకు.

ఆ మధ్య భాగవతం చదువుతూ ఉన్నప్పుడు, కృష్ణుడు లేని బృందావనంగురించిన వర్ణన జ్ఞాపకంవచ్చింది ఆవిడకు :

శరత్కాలమే...వెన్నెలే...బృందావన సీమే...కాని, కృష్ణుడు లేడు.

పొగడచెట్లు దాటి వాగుఅంచు చేరింది రాజమాత.

ఎదుట నదీగర్భంలో తెల్లని మందిరం. ఎంత అందంగా ఉంది! జయపురంనుంచి ప్రత్యేకంగా తాను పిలిపించిన శిల్పులు కట్టిన, జనానాలోని తమ కృష్ణమందిరమూ ఇంత అందంగా లేదు.

మందిరపు సోపానపుటంచులు రాచుకుంటూ సన్నగా ప్రవహిస్తోంది వాగులోని ఊటనీరు, సన్నగా, తెల్లగా.

ఎందుచేతనో, క్రిందటిరోజు, పూజా సమయంలో, తన చేతిలోంచి జారి క్రింద పడ్డ వెండిగిన్నెలోంచి నేలమీద ప్రాకిన పాలచాలు జ్ఞాపకం వచ్చింది ఆమెకు...

మడమలు తడుస్తూ, వాగులో నడిచి, చలువరాతిమెట్లపై కాలుపెట్టింది రాజమాత...

రాజమాత ప్రవేశింపరాని స్థలం లేదు కాని, ఈ మెట్లు ఎక్కడానికిమాత్రం ఎంతో సందేహించింది రాజమాత!

ఒక్కొక్క అడుగుకు గంపెడంత ధైర్యం కావలసివచ్చింది...

ఎంత అద్భుతమైన నగిషీపని! నిజంగా దేవతలే చెక్కారు-ఈ మకరతోరణాలు!!--

మందిరంలో ప్రవేశించింది రాజమాత, వణికే గుండెలను చేతితో అదుముకుంటూ.

పైనున్న గవాక్షమునుంచి రెండు జంట కిరణాలు వెలుతురుబాణాలలా వేదికపై ప్రసరిస్తున్నాయి. ఆ వెలుతురుకు ఒక్క-క్షణం కళ్లుమూసుకుంది రాజమాత !...

కళ్లు విప్పి చూచింది రాజమాత :

వేదికపైన ప్రతిమ లేదు.

జీవకళ ఉట్టిపడుతోంది అనుకున్న తన కూతురి విగ్రహం లేదు.

విగ్రహ ముండవలసినచోట గుండ్రని కాంతిలో ఉన్నవి రెండుదోసిళ్ల పారిజాతపు పువ్వులు.

దగ్గరకు వెళ్లి చూచింది రాజమాత.

తెల్లటి రేకలపైన మంచుముత్యాలు-వేయి కన్నీటిచుక్కలు !

పారిజాతపు గొట్టాలన్నీ ఆమె కేసే చూస్తున్నాయి-వేయి ఎర్రని సూదిమొనల లాగ !—ఎర్రని సూదిమొనలలాగ !!

రాజమాత పెదవులు అదిరినవి.

ఇంతటి త్యాగమా! ఇంతటి త్యాగమా!! అన్నది రాజమాత.



ఆరోగ్య ప్రణాళికలు

= శ్రీ భాస్కర్ల సూర్యనారాయణమూర్తి =

భారతదేశంలో ప్రజల ఆరోగ్యం చాలా ఘోరంగా ఉందని యావన్మందీ ఏకకంఠంతో అంగీకరించారు. ప్రపంచంలో మిగిలిన దేశాలతో పోల్చిచూస్తే భారతదేశంలో జీవితపరిమితి తక్కువ అనే విషయం స్పష్టం. శిశుమరణాల సంఖ్య హృదయ విదారకంగా ఉంది. మలేరియా, క్షయ మొదలగు వ్యాధులు లక్షలాది నిండుప్రాణాలను బలిగొంటున్నాయి. అనేకలక్షలమంది వికలాంగులు. నిత్య రోగిష్టులుఅయి నిర్జీవు లయిపోతున్నారు.

యుద్ధానంతర పునర్నిర్మాణానికి ప్రణాళికలు తయారుచేయడం భారతదేశంలో పరిపాటైపోయింది. అనేకవిషయాలపై తయారుచేయబడ్డ లెక్కలేని ప్రణాళికలమాటటుంచి ఒక్క ఆరోగ్యవిషయమై చూస్తే అధమం అరడజను ప్రణాళిక లున్నాయి. ఈ ప్రణాళిక లన్నీకూడా సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో చాలా గొప్ప విషయాలను సాధించి, నరక సదృశంగా ఉన్న మన దేశాన్ని స్వర్గతుల్యం చేయాలనే సంకల్పంతో తయారుచేయబడినవే! కాని ప్రస్తుతం మాత్రం భారతదేశం 'రోగక్రిముల స్వర్గం'లా ఉందనే అభిప్రాయాన్ని యిచ్చాడు, యీ ఆరోగ్య పరిస్థితులూ, వైద్యసౌకర్యాలూ కళ్లారా చూచిన ఒక బ్రిటిషుపత్రికావిలేఖరి.

ప్రజారోగ్యవిషయంలో నిపుణులు యిచ్చిన వివిధప్రణాళికలను పరిశీలించి చూడడానికి ముందు మన ప్రస్తుత పరిస్థితులు పర్యాలోకిద్దాం. ఈదిగువ సంఖ్యలు ఆరోగ్యవిషయంలో ప్రపంచంలో మన స్థానాన్ని నిర్ణయిస్తాయి:

దేశం	జీవిత పరిమితి (సంవత్సరాలు)	
	పురుషులు	స్త్రీలు
అమెరికా	60.60	64.50
బ్రిటన్	60.18	64.40
జర్మనీ	59.86	62.81
ఆస్ట్రేలియా	63.48	67.14
జపాన్	46.92	49.63
ఇండియా	26.91	26.55

పసివాళ్ల చావుల సంఖ్యలు కూడ ప్రపంచంలో మనకే అగ్రస్థానా న్నిచ్చాయి.

	(1000 మందిలో)
ఇండియా	167
జపాన్	114
కెనడా	61
జర్మనీ	60
బ్రిటను	53
అమెరికా	48
ఆస్ట్రేలియా	38
న్యూజీలాండు	31

మన పసివాళ్లు నూటికి 33 మంది మూడేళ్ళైనా నిండకుండా మరణిస్తున్నారు. శిశుమరణాలు ప్రతి యింటిలోనూ కలిగించే దుఃఖమే కాకుండా దేశానికంతటికీ తీరని నష్టం ఆపాదిస్తున్నాయి. దేశసౌభాగ్యానికి పట్టుగొమ్మలైన లక్షలాది భావిపౌరులు అకాలమరణానికి గురికావడం దేశదౌర్భాగ్య మనక తప్పదు.

భారతదేశంలో గర్భిణీస్త్రీలలో చాలా హెచ్చు చావులు సంభవిస్తున్నాయి. అనేకమంది స్త్రీలు ప్రసవ

సమయంలో మరణించడమో, లేక ప్రసవానంతరం క్షయవ్యాధికి గురికావడమో పరిపాటి గర్భధారణకూ, ప్రసవానికీ సంబంధించిన కారణాలవల్ల బ్రిటిష్ఇండియాలో రెండులక్షలమంది స్త్రీలు మరణిస్తున్నారు. సుమారు 40 లక్షలమంది స్త్రీలు పై కారణాలవల్లనే వివిధమైన రోగాలకు గురియై బాధపడుతున్నారు.

ఈ శతాబ్దంలోని మొదటి 30 సంవత్సరాల్లో అంటువ్యాధులు కారణంగా భారతదేశంలో సంభవించిన మరణాల సంఖ్య పరిశీలిద్దాం.

మలేరియా	3 00 కోట్లు
కలరా	1 07 ,,
ఇన్ఫ్లుయెంజా	1.40 ,,
ప్లేగు	1.25 ,,

నివారణసాధ్యాలయిన రోగాలమూలంగానే 50-60 లక్షలమంది మరణిస్తున్నారు. భారతదేశంలో లక్షకు 450 మందిచొప్పున గ్రుడ్డివారున్నారు. 1939 లో సంభవించిన 6,165,234 చావులలోను మలేరియా వలన 1,411,614 మంది, మశూచికంవలన 48,103 మంది, కలరావల్ల 97,566 మంది, రక్తవిరేచనాలవల్ల 260,300 మంది — మరణించారని జి. బి. గ్రాంట్ లెక్కకట్టాడు. మన దేశంలో ప్రతిప్రాంతంలోకీ వ్యాపించి, ప్రతివ్యక్తినీ బాధిస్తున్న పాడుజబ్బు మలేరియా. ప్రతిసంవత్సరం 10 కోట్లమంది మలేరియావల్ల పీడింపబడుతున్నారు. 20 లక్షలమందిని ఏటేటా ఈ వ్యాధి పొట్టనపెట్టుకుంటోంది.

ప్రపంచదేశాలతో పోల్చిచూస్తే మరణాల విషయంలో భారతదేశంయొక్క అభాగ్యస్థితి విశదం అవుతుంది.

	(1000 మందిలో)
ఇండియా	22.4
ఇంగ్లండు	12.4
అమెరికా	11.2
ఆస్ట్రేలియా	9.4
న్యూజీలాండు	9.1
జపాను	17.1

పైన చూపబడిన సంఖ్యలన్నీకూడా మన దేశపు జనసామాన్యంయొక్క ఆరోగ్యం ఎంత దుస్థితిలో ఉన్నదో స్పష్టపరుస్తున్నాయి. ప్రతిభారతీయుడూ యీ పరిస్థితిని గమనిస్తే ప్రజారోగ్యవిషయంలో ప్రభుత్వం ఎంత ఉదాసీనంగా ఉందో అవగతం అవుతుంది.

ఈ సంఖ్యలన్నీ ముందుంచుకుని, మన కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రజారోగ్య, వైద్యసదుపాయాల కోసం ఎంత ఖర్చు పెడుతున్నాయో పరిశీలిద్దాం.

ప్రజారోగ్య, వైద్యసదుపాయాలకు 1939-40 లో మనిషి ఒక్కంటికి పెట్టిన ఖర్చు:

బీహారు	రూ. 0	1	7
బెంగాలు	0	1	9
మద్రాసు	0	3	6
బొంబాయి	0	5	9
బ్రిటన్	54	8	11
అమెరికా	51	6	0

అంటే, ఈ దేశంలో తల ఒక్కంటికి సగటున వైద్యసదుపాయాలకు, పట్టణపారిశుద్ధ్యానికి పెట్టే ఖర్చు మూడణాలైతే, అదే బ్రిటన్ అమెరికాలలో 54, 51 రూపాయ లన్నమాట! ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాబడిలో నూటికి 2.3 నుండి 7.8 వరకు ఆరోగ్యావసరాలకు ఖర్చుపెడుతున్నాయి. అదే ఖర్చు అమెరికాలో 20.4; ఇంగ్లండులో 18.8. ఇంగ్లండు ప్రజారోగ్యంకోసం నూటికి 25 చొప్పున ప్రభుత్వరాబడినుండి వ్యయంచేయడానికి నిశ్చయించుకుంది. భోర్ కమిటీసలహా ప్రకారం మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాబడిలో నూటికి 15 చొప్పున వైద్య, ప్రజారోగ్యసదుపాయాలకు ఖర్చు పెట్టాలి. ఒక్క మద్రాసురాష్ట్రంలోమాత్రం ప్రతిమునిసిపాలిటీ ప్రభుత్వగ్రాంటుమినహా మిగిలిన రాబడిలో నూటికి 30 చొప్పున తమ ప్రదేశాలలో ప్రజారోగ్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకించాలని శాసనసభలో నిర్ణయించబడింది.

బ్రిటన్, అమెరికాలలో ప్రతివ్యక్తి విషయంలోనూ జన్మించినది మొదలుకొని మరణపర్యంతం వైద్య

రీత్యా తామే బాధ్యత వహించడం ప్రభుత్వాల ఆశయం. కాని మన దేశంలో రోగులవైపు చూచేవాళ్లు లేరు. సరికదా, చివరకు శవాన్ని కప్పడానికి సహితం కావలసినంత గుడ్డలేని స్థితిలో ఉన్నాం. ఈ దారుణ స్థితినుంచి బయటపడడానికి ప్రజలు ప్రజాప్రభుత్వాలపై కొండంత ఆశ పెట్టుకున్నారు. కాంగ్రెసు ప్రభుత్వాలు మిగిలిన అన్నివిషయాలకంటే ప్రప్రథమంగా ప్రజారోగ్య, వైద్యసదుపాయాలనుగూర్చి శ్రద్ధతీసుకోవాలి.

ఇక, వివిధ ఆరోగ్యప్రణాళికలను పరిశీలిద్దాం.

గాంధేయుల ప్రణాళిక:—గాంధీజీఆశయాలననుసరించి తయారుచేయబడిన ప్రణాళికప్రకార్యం ప్రతిగ్రామంలోనూ ఒక డాక్టరు, తరిఫీదుపొందిన ఒక నర్సుతో మందులిచ్చే శాలలు అత్యంతావశ్యకం.

పట్టణప్రదేశాలకు ప్రతి 10,000 మందికి ఒక సర్వసదుపాయాలతో కూడిన వైద్యశాల ఉండాలి. ఈ లెక్కప్రకారం మన పట్టణాలలో 5000 ప్రజా వైద్యశాలలు కావాలి. గ్రామవైద్యశాలల ఖర్చులో—జీతాలుకూడా కలుపుకొని—సగం గ్రామపంచాయతీలు భరించాలి; మిగిలిన సగం రాష్ట్రప్రభుత్వం పెట్టుకుంటుంది.

క్షయ, కుష్టు, సుఖరోగాలు, ఉన్మాదరోగాలకొరకు ప్రత్యేకవైద్యశాలలు నిర్మించేనిమిత్తమై ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టాలి.

ప్రజారోగ్యంకొరకు అయ్యే మొత్తంఖర్చు:—

	పెట్టుబడిఖర్చు	సాలీనాఖర్చు
గ్రామవైద్యశాలలు	రు. 75 కోట్లు	రు. 35 కోట్లు
పట్టణవైద్యశాలలు	,, 15 ,,	,, 5 ,,
ప్రత్యేకవైద్యశాలలు	,, 10 ,,	,, — ,,
నీటి సరఫరా, గ్రామ పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం	160 ,,	,, 5 ,,
	,, 260 ,,	,, 45 ,,

ప్రజాప్రణాళిక:— ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ యొక్క యుద్ధానంతర పునర్నిర్మాణ ఉపసంఘనివేదికప్రకారం ప్రజా ప్రణాళిక యొక్క ఆశయం గ్రామాలలో నివసించేవారికి ప్రతి 1000, లేక 1200 మందికి ఒక వైద్యశాల ఉండాలి. దానిలో పది మంచాలు. ఇందులో నాలుగుమంచాలు ప్రసూతి కొరకు ప్రత్యేకించబడాలి.

వీరు పట్టణాలలో 5,000 వైద్యశాలలు కావాలని సలహాయిచ్చారు. ఒక్కొక్కదానిలో 80 మంచాలు. వాటిలో 30 కాన్పులకోసమని ప్రత్యేకించబడాలి.

ప్రతిగ్రామవైద్యశాలకూ ఒక మాతాశిశు సంరక్షణాలయం కూడా చేర్చబడాలి. ప్రత్యేకవ్యాధుల కొరకు ప్రత్యేకవైద్యశాలలు నిర్మించబడాలి.

ప్రతిగ్రామంలోనూ నీటిసరఫరా, పారిశుద్ధ్యాల కొరకు గ్రామానికి రూ. 5000 చొప్పున ఖర్చుపెట్టాలి.

	పెట్టుబడిఖర్చు	సాలీనాఖర్చు
గ్రామవైద్యశాలలు	రు. 100 కోట్లు	రు. 137.5 ,,
పట్టణాలలోవైద్యశాలలు	,, 30 ,,	,, 25 ,,
నగరాలలోవైద్యశాలలు	,, 15 ,,	,, 14.8 ,,
మాతాశిశుసంరక్షణశాలలు	,, —	,, 2 ,,
ప్రత్యేకవైద్యశాలలు	,, 86 4 ,,	,, 48 6 ,,
గ్రామనీటిసరఫరా, పారిశుద్ధ్యం	,, 260 ,,	—
పట్టణ నీటిసరఫరా, పారిశుద్ధ్యం	,, 50 ,,	—

మొత్తం రూ. 760 కోట్లు

పై అంకెలు సమగ్రమైనవి కావనీ, ఆచరణలో పైని వివరించినదానికన్న అధికంగా వ్యయంచేయవలసిన అవసరాలు సంభవించవచ్చుననీ ఈ ప్రణాళికా నిర్మాతలు ఒప్పుకున్నారు. ఏది ఏమైనప్పటికీ, ప్రణాళికలో సూచింపబడిన ఆరోగ్య, వైద్య, గృహసౌకర్యాలన్నీ ప్రజలకు ఉచితంగానే అందజేయాలని వారి నిశ్చితాభిప్రాయం.

జాతీయ ఆరోగ్యప్రణాళిక:—నేషనల్ ప్లానింగ్ కమిటీ ఆరోగ్య ఉపసంఘంవారుకూడా యీ విష

యంలో తమ విలువైన సలహాలను యిచ్చారు. వారి సలహా లివి:

(అ) ప్రజాసామాన్యం ప్రస్తుతం తీసుకునే ఆహారం కన్న పుష్టికరమైన ఆహారం తీసుకునేటట్లు చేయాలి.

(ఆ) భారతదేశంలో రోగనివారణ, చికిత్సాపద్ధతులను తగినవిధంగా సమీకరించి, ఒకే సంస్థద్వారా నడుపుకోవడానికి తగిన ఆరోగ్యసంస్థ నెలకొల్పబడాలి.

(ఇ) అట్టి సమీకరణఆరోగ్యసంస్థ ప్రభుత్వ అధికారంలోనే పనిచేయగలదు. ప్రజలయొక్క ఆరోగ్యాన్ని కాపాడడం ప్రభుత్వపు విధి.

(ఈ) అట్టి సంస్థ చక్కగా పనిచేయడానికి వైద్య, ఆరోగ్యవిషయాలలో పరిశోధన హెచ్చుగా జరగడం చాలా అవసరం. ఆరోగ్యాన్ని కాపాడడానికి పూర్వంనుంచీ అవలంబిస్తున్న పద్ధతులను వైజ్ఞానికంగా పరిశీలించాలి. రోగ నిరోధం, చికిత్సలనుగూర్చికూడా యీ పరిశోధకులు శ్రద్ధవహించాలి.

(ఉ) నిపుణులైన వైద్యుల సంఖ్యను తొందరగా హెచ్చుచేయవలసిన ఆవశ్యకత ఎంతైనాఉంది.

(ఊ) భారతదేశపు ప్రత్యేకపరిస్థితులు, తక్షణ అవసరాలకై ప్రతివేయింటికి ఒక ఆరోగ్యసేవకుడు ఉండాలి. వీరందరూ 5 సంవత్సరాలలో సేకరింపబడాలి. వీరిలో సమర్థులైనవారిని ప్రత్యేకించి, వారికి యింకా అదనపు తరిఫీదు యివ్వాలి.

(ఋ) దేశపు జనసంఖ్యలో ప్రతి 1000 మందికి ఒక వైద్యుడు, ప్రతి 600 మందికి ఒక మంచం చొప్పున సమకూరాలి.

రాబోవు 10 సంవత్సరాలలోపున ప్రతి 3000 మందికి ఒక వైద్యుకు, ప్రతి 1500 మందికి ఒకమంచం చొప్పున ఏర్పడడం అవధిగా పెట్టుకుని ప్రయత్నించాలి.

(ౠ) ఆరోగ్యసేవయొక్క సాంఘికప్రాముఖ్యతను విద్యావ్యాప్తిద్వారా, తగిన ప్రచారంద్వారా ప్రజలకు తెలియచేయాలి.

(ఌ) వైజ్ఞానికపరికరాలు, శస్త్రసాధనాలు, మందులు, తదితరవైద్యపరికరాల విషయంలో దేశం స్వయంసమృద్ధి నందేటట్లు ప్రయత్నించాలి.

(ౡ) ఆయుర్వేదయునానీ పద్ధతులపై వైద్యం చేసే వారికి తగు వైజ్ఞానికశిక్షణ యిచ్చి ప్రభుత్వ ఆరోగ్య సంస్థలోకి తీసుకోవాలి.

• బొంబాయి ప్రణాళిక:— ప్రజలకు కనీస ఆరోగ్యసదుపాయాలను కలుగచేయడానికి బొంబాయి ప్రణాళిక యీదిగువ వ్యయపట్టిక యిచ్చింది:

	పెట్టుబడిఖర్చు	సాలీనాఖర్చు
గ్రామాలకుపట్టణాలకు నీటిసరఫరా, పారిశుద్ధ్యపు ఏర్పాట్లకొరకు	రు. 100 కోట్లు	రు. 7.5 కో.
గ్రామవైద్యశాలలు	,, 32 ,,	,, 141.9 ,,
జనరల్ ఆసుపత్రులు	,, 22 ,,	,, 16.5 ,,
మాతాశిశుచికిత్సాలయాలు	,, 8 ,,	,, 6.6 ,,
క్షయ, సుఖరోగాలు, ఉన్మాదరోగాలకు ప్రత్యేక వైద్యశాలలు	19 ,,	,, 12.5 ,,

ఈ ప్రణాళికప్రకారం సాలీనాఖర్చు తల ఒక్కంటికి రూ. 5 లు అవుతుంది. మొత్తం మొదటి 15 సంవత్సరాలకు 320 కోట్ల రూపాయలకు తక్కువ కాకుండా కావలసివస్తుందని అంచనా వేయబడింది. 6.8 లక్షల డాక్టర్లకు, 13.7 లక్షల నర్సులకు శిక్షణ యివ్వడానికి చాలా హెచ్చుసొమ్ము కావలసివస్తుంది. 1939 లో భారతదేశంలో మొత్తం వైద్యవిద్యకైన ఖర్చు రూ. 5,048,023. ఇది 12 వైద్యకళాశాలలలో చదివిన 5,640 మంది విద్యార్థులకైన ఖర్చుల అంచనా.

జాతీయ కనీస వైద్యప్రణాళిక:— బి. కె. షా "India Tomorrow" (రేపటి భారతదేశం) అనే గ్రంథంలో భారతదేశపు జాతీయ ఆరోగ్యసమస్యను గూర్చి కొంత చర్చించాడు. ఆయన ప్రజారోగ్య సమస్యను యీ దిగువవిధంగా విభాగించాడు.

(అ) దేహారోగ్యం, పారిశుద్ధ్యం, నీటిసరఫరా, అంటు రోగాల నిరోధం మొదలైన విషయాలలో తోడ్పడే క్రిమిసంహార అంటురోగ నిరోధక సంస్థలు.

(ఆ) ఔషధశాలలు, మాతాశిశుసంరక్షణగృహాలు, వైద్యశాలలు, శానిటోరియంలు.

(ఇ) వైద్యకళాశాలలు, లేబొరేటరీలు, వైజ్ఞానిక పరిశోధక సంస్థలు.

(ఈ) మందులు తయారుచేయడానికి, వైద్యపరికరాల ఉత్పత్తికి పనికివచ్చే పరిశ్రమలు.

ఈయన అభిప్రాయంప్రకారం ప్రజారోగ్య కార్యక్రమం ప్రభుత్వం నిర్వహించాలి. ఈ సందర్భంలో సోవియట్‌రష్యాయొక్క అనుభవాలు తెలుసుకోదగినవి: "దేశంలోని యావన్మంది వైద్యపరివారం —వైద్యులు, నర్సులు, మందులు తయారుచేసేవారు, అమ్మేవారు, విజ్ఞానవేత్తలు, ఆచార్యులుసహితం ప్రభుత్వపు కొలువులోనివారే. ప్రజారోగ్యకార్యక్రమం యావత్తూ కేంద్రంనుంచి నడుపబడుచున్నందున, దేశంలోని అన్ని అవకాశాలూ పూర్తిగా ఉపయోగించుకోవడానికి, వైద్యశాస్త్రంలో వచ్చిన క్రొత్తవిషయాలు సక్రమంగా వినియోగించబడడానికి, సమీకరణ పద్ధతిలో పనిచేయడానికి ఆస్కారం యిస్తుంది."

5,000 జనాభా ఉన్న ప్రతిగ్రామానికీ ఒక క్రిమిసంహారక అంటురోగనివారక కేంద్రం ఉండాలి. అటువంటి ప్రతి మూడుగ్రామాలకూ ఒక అధికారసంస్థ ఉండాలి. ప్రతి 5 లక్షలమందికీ ఒక పరిశోధక పరిపాలనాకేంద్రం ఉండాలి. ఇది రాష్ట్రపరిపాలనాకేంద్రపు అధికారంక్రింద పనిచేస్తుంది. ఇవన్నీ కూడా అఖిల భారత సంస్థ యాజమాన్యాన పనిచేస్తూఉంటాయి.

మనం అసమం 80,000 గ్రామకేంద్రాలు, 20 రాష్ట్రసంస్థలు, ఒక అఖిలభారతసంస్థ సృష్టించవలసి వస్తుంది. వీటన్నిటికీ కలిపి గ్రామపారిశుద్ధ్యంలోను, అంటురోగనివారణోపాయాలలోను చక్కటి శిక్షణ పొందిన 2,50,000 మంది కావలసివస్తారు. ప్రతి 2,000 మందికి ఒక డాక్టరు చొప్పున కావాలంటే మనకు 2 లక్షలమంది డాక్టర్లు కావలసివస్తారు. ప్రతి 800 మందికి ఒక నర్సుచొప్పున 5 లక్షల నర్సులు కావాలి. 80,000 మందు లిచ్చే కేంద్రాలు, 8,000 చక్కటి వైద్యశాలలు మన దేశానికి కావలసివస్తాయి.

భోర్ కమిటీ ఆరోగ్యప్రణాళిక:— ఇంతవరకు తయారైన ప్రణాళిక లన్నింటిలోకీ భోర్ కమిటీ నివేదిక దేశంలోని ఆరోగ్యవైద్యసమస్యలను సమగ్రంగా చర్చించినదనే విషయం అన్నివర్గాలూ అంగీకరించాయి.

భారతదేశంలో గ్రామాలలో నివసించే ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువగా వైద్యసహాయం, రోగనిరోధక ఆరోగ్యకేంద్రాలు ఏర్పాటుచేయబడాలని కమిటీ సలహాయిచ్చింది. భారతదేశ సౌభాగ్యానికి మూల పురుషుడు పల్లెటూరి పేదరైతు. కరువు, అంటువ్యాధులకు హెచ్చుగా బలి అయ్యేది అతడే అయినా, వానికి లభించే వైద్యసహాయం అతిస్వల్పం. నేటివరకూ గ్రామాలకు వైద్యసహాయ విషయంలో జరుగుతూ వచ్చిన అన్యాయం తొలగించబడాలి.

దేశంయొక్క ఆరోగ్యం ప్రజల జీవిత పరిస్థితులు, పారిశుద్ధ్యం, వసతిసౌకర్యాలు, ఆహారనియమాలు, రాబడి మొదలగు అనేకవిషయాలపై ఆధారపడి ఉంటుందని భోర్ కమిటీవారు అంగీకరించారు. ఆధునిక వైద్యశాస్త్రవేత్తలు రోగాలను మరివేటితోను సంబంధించని ప్రత్యేకవిషయంగా పరిగణించారు. భోర్ కమిటీ ప్రజల వసతిసౌకర్యాలు, నీటిసరఫరా హెచ్చుచేయడం, పట్టణపారిశుద్ధ్యం మొదలగు సలహాలతోపాటు ఆరోగ్యాన్ని అభివృద్ధిచేయడానికి, ఆహార నియమాల అభివృద్ధి, నిరుద్యోగాన్ని తొలగించడం, హాయిగా జీవించడానికి తగిన కూలి, వ్యావసాయిక పారిశ్రామిక ఉత్పత్తి, రహదారులు రాకపోకల అభివృద్ధి కార్యక్రమంకూడా కావాలని సలహాయిచ్చింది.

వారి ఆరోగ్యప్రణాళిక ప్రకారం 10,000 నుంచి 20,000 మందివరకు ఉన్న ప్రదేశానికి ఒక ప్రాథమిక వైద్యసంస్థ ఉండాలి. ఒక్కొక్కదానిలో ఆరుగురు డాక్టర్లు, 26 గురు నర్సులు, ఆరుగురు శిక్షణపొందిన మంత్రసానులు, 18 మంది తదితర సాంఘిక పట్టణ పారిశుద్ధ్యపుపనివారు ఉండాలి.

మొదటి 10 సంవత్సరాలలోను చాలామంది జనానికి కొద్ది వైద్యశాలలే ఉన్నా 40 సంవత్సరాల అనంతరం ప్రతి వెయ్యిమందికి ఒకమంచం చొప్పున ఏర్పడే అవకాశం కలిగేటట్లుగా వైద్యశాలలు నిర్మించబడాలి.

ఈ విధంగా భోర్ కమిటీ ప్రణాళిక రెండుభాగాలుగా ఉన్నది. మొదటిది తాత్కాలిక ప్రణాళిక; రెండవది సావకాశ ప్రణాళిక. మొదటి పదిసంవత్సరాల ప్రణాళిక నిర్వహణకు రూ. 362 కోట్ల పెట్టుబడి ఖర్చు, రూ. 601 కోట్ల సాలీనా ఖర్చు అంచనా వేయబడింది.

ఈ ప్రణాళికను అమలుజరపడానికి పరిపాలక వర్గాలను కమిటీవారు సూచించారు.

రాష్ట్రాలలోను, కేంద్రంలోను ఆరోగ్యమంత్రి వర్గాలు ఏర్పరచబడాలి.

కేంద్రరాష్ట్ర ఆరోగ్యమంత్రులతో కూడిన ఒక శాసనాధికారసంస్థ ఉండాలి.

ప్రజలకు సేవచేయడానికి అనువుగా ఆరోగ్య పరిపాలనకు సహాయంగా ఉండేటట్లు వసతిగృహ నిర్మాణం, వైద్యవిషయాలలో నిపుణుల సంఘం నియమించబడాలి.

భోర్ కమిటీవారు జనాభా మొదలు పారిశ్రామికాభివృద్ధివరకు ప్రజారోగ్యానికి సంబంధించిన సర్వ విషయాలపైని సలహాలు యిచ్చారు. కాని అన్ని ఆశయాలనూ అందుకోవడానికి వివిధ ప్రణాళికలు వివిధ అంచనాలు ఇచ్చాయి. వీటిలో బహుసామాన్యమైన ప్రణాళిక ఆశయాలను అందుకోవడానికి సహితం మనం ప్రపంచంలోని తక్కిన సభ్యదేశాలు 50 ఏండ్లక్రితం ఎక్కడ ఉన్నాయో అక్కడ ప్రారంభించవలసివస్తుంది. పరప్రభుత్వం బాధ్యతారహితంగా ప్రజావసరాలను పట్టించుకోకుండా ఘోరంగా ప్రవర్తించడమే దీని కంతటికీ కారణం.

ఈ నివేదికపై వచ్చిన విమర్శలన్నీ దానికుండేటి వసతిపై వచ్చినవే. భారతదేశానికి కావలసిన ఆరోగ్య అవసరాలు తీర్చడానికి 40 సంవత్సరాలు, ప్రజలకందరికీ మంచినీళ్లు సమకూర్చడానికి 35 ఏండ్లు పడుతుందని వారు చెప్పడంలో, భారతీయుల శక్తిసామర్థ్యాల విషయమై త్రుప్పుపట్టిన పాతఅలోచనలనే ఆధారంగా తీసుకున్నట్లు స్పష్టం అవుతుంది. ప్రజారోగ్యవిషయాలలో రష్యా సాధించిన విచిత్రాలు భారతదేశం ఎందుకు సాధించలేకపోవాలో ఊహించడం కష్టం.

ఆరోగ్యసంస్థలలో ఉద్యోగాలవిషయమై సలహాలనీయడంలో కమిటీ జాతిమతవర్గవిభేదాలు పాటించడం శోచనీయం. మానవసేవే పరమాదర్శంగా కల వైద్యఆరోగ్యసంస్థలలో సహితం యిట్టి విభేదాలను ఊహించడం జాతీయపురోభివృద్ధికి భంగకరం. అంతే కాదు. యింత బ్రహ్మాండమైన ఆరోగ్యప్రణాళికను నిర్మించిన నిపుణులు ఆయుర్వేద యునానీ పద్ధతుల విషయంలో యిదమిత్థమని నిర్ణయించకపోవడం క్షమించరానిది.

ఈ ప్రణాళిక లన్నింటిని నిశితంగా పరిశీలించినట్టయితే ప్రజారోగ్యవైద్యసౌకర్యాలకొరకు వేయబడిన కనీసపు అంచనా రూ. 300 కోట్లు. భోర్ కమిటీవారు కేంద్రరాష్ట్రరాబడిలో నూటికి 25 చొప్పున ఆరోగ్యసౌకర్యాలకు ఉపయోగించాలన్నారు. అయితే, యింత ధనం ఎక్కడనుంచా ఖర్చుపెట్టడం అనేది ప్రతివారికీ సమస్య అయింది. అన్ని యుద్ధానంతర ప్రణాళికలుకూడా సొమ్ము విషయంలో సృష్టింపబడిన ధనం, ప్రభుత్వఋణాలు, స్టెర్లింగు నిల్వలపై ఆధారపడ్డాయి. వీటికితోడు సోవియట్ రష్యా మొదటి పంచవర్ష ప్రణాళిక విషయంలో అవలంబించిన **National Monopolies** పద్ధతికూడా అనుసరించవచ్చును.

దేశంలో వైద్యఆరోగ్యసౌకర్యాలు యావన్మందికీ ఉచితంగా ఉండాలా? లేక ఫీజుపద్ధతి మంచిదిగా ఉంటుందా? అనే నిర్ణయం రాబోయే ప్రభుత్వం దేశంయొక్క ఆర్థిక సాంఘిక రాజకీయ అవసరాలను బట్టి నిర్ణయించుకోవాలని భోర్ కమిటీ అన్నది. వైద్య ఆరోగ్యసౌకర్యాలు ప్రతివ్యక్తికీ ఉచితంగా ఉండాలనే విషయం వేరే చెప్పనక్కరలేదు. ధనం, శిక్షణ పొందిన నిపుణులు, మొదలైన అడ్డంకులు, ప్రజారోగ్యాన్ని అభివృద్ధిచేయడానికి కంకణంకట్టుకున్న జాతీయప్రభుత్వానికి ఎంతమాత్రం గడ్డుసమస్యలు

కాకూడదు. దేశప్రజల ఆరోగ్యంమీదనే దేశసర్వస్వం ఆధారపడిఉందనే పరమ సత్యాన్ని గ్రహించిన ప్రజాసేవకులు రాష్ట్రాలలోను, కేంద్రంలోను పరిపాలనలో ఉన్న యీ శుభసమయంలో ఆరోగ్యవైద్య సౌకర్యాల అభివృద్ధిని ఆశించనంలో క్రొత్తదనం లేదు. పరదేశాలను ఆరోగ్యవిషయంలో అందుకోలేకపోతే భారతీయులు మరేవిషయంలో అందుకోగలిగినా ఫలం లేదు. ప్రజామంత్రివర్గాలు, ప్రజలు యీ ప్రణాళికలను పరిశీలించి వీటికి ఆచరణసాధ్యమైన ఒక రూపం యివ్వడానికి ప్రయత్నిస్తారని ఆశ.

భోర్ కమిటీ భవిష్యత్తులో భారతదేశ ఆరోగ్య వైద్యసౌకర్యాలకోరకు కావలసిన నిపుణులవిషయమై అంచనాయిస్తూ, ప్రస్తుతం ఉన్న డాక్టర్లు, వైద్యశాలల వివరాలుకూడా విపులంగా తెలియజేశారు. అవి యీ దిగువ చూద్దాం.

భోర్ కమిటీ అంచనాలు

ఉద్యోగులు	ప్రస్తుతం ఉన్న సంఖ్య	జనాభా సంఖ్యతో నిష్పత్తి (300 మిలియన్లు)	1971 నాటికి అంచనా ప్రకారం కావలసిన నిష్పత్తి (370 మిలియన్లకి)	1971 నాటికి కావలసిన సంఖ్య
డాక్టర్లు	47500	6000 మందికి	2000 మందికి	185000
నర్సులు	7000	43000 ,,	300 ,,	740000
ఆరోగ్యపరిశీలకులు	750	400000 ,,	5000 ,,	74000
మంత్రసానులు	5000	60000 ,,	100 కాన్పులకు	100000
మందులు తయారు చేసే వారు	75	4000000 ,,	3 డాక్టర్లకు	52000
దంతవైద్యులు	1000	300000 ,,	4000 [illegible]	92500


రాష్ట్రాలు	రిజిష్టర్డు డాక్టర్లు		వైద్యశాలలు, మందులిచ్చేచోట్లు		మొత్తం మంచాల సంఖ్య	మాతా శిశు సంరక్షణ కేంద్రాలు	క్షయ వైద్యశాలలు	కుష్ఠు రోగ చికిత్సాలయాలు	పిచ్చి వైద్యశాలలు	అంటురోగ చికిత్సాలయాలు	సుఖరోగ చికిత్సాలయాలు	[illegible]		
	పట్టభద్రులు	లైసెన్షియేట్లు	పట్టణ	గ్రామ								కాలేజీలు	[illegible]	[illegible]
అస్సాం	194	1,165	59	229	1,469	—	—	1	3	—	—	1	—	10
బెంగాల్	4,586	7,690	304	1,511	10,905	37	1	2	6	1	1	2	3	27
బీహారు	991	2,262	125	528	6,025	21	—	2	8	1	—	1	—	10
బొంబాయి	4,430	4,971	316	442	7,979	118	3	5	13	3	—	8	5	15
సి. పి., బీహారు	279	874	184	223	2,738	83	—	1	9	2	—	1	—	7
ఢిల్లీ	174	82	21	13	1,382	34*	1	—	1	1	1	—	1	1
మద్రాసు	2,974	5,056	276	972	14,776	—	1	3	12	3	—	5	1	17
వాయవ్యసరిహద్దురాష్ట్రం	121	161	59	123	1,868	—	—	1‡	—	—	—	1	—	6
ఒరిస్సా	129	535	21	160	1,386	39	—	—	2	—	—	—	—	3
పంజాబు	1,994	4,330	287	778	12,307	106	—	1	6	—	—	9	3	14
సింధు	155	323	73	154	2,057	5	2†	1	1	1	—	2	—	—
యు. పి.	1,627	2,421	388	456	11,219	—	6	1	16	16	—	5	—	8
మొత్తం ...	17,654	29,870	2,113	5,589	74,111	443	14	20	77	28	2	35	13	118

* వీటిలో నాలుగు స్త్రీల వైద్యశాలలు.


† పెషావరులో, వీనికితోడు సెంట్రల్ జైలులో ఉన్నవద్దా దీలక్షు ఉంచడానికి సదుపాయాలున్నాయి.

‡ సంచాలక వైద్యశాలలు.

మొట్టమొదటి కాంగ్రెసు భవనం



[1885-వ సంవత్సరములో భారతజాతీయ కాంగ్రెసు ప్రథమ సమావేశము జరిగిన చారిత్రక భవనము, బొంబాయి.]



రేపటి దుస్తులు

= శ్రీ వెంకటేశ్వర్లు, గోపాలరావు =

మనకు తిండితరువాత అత్యవసరమైన వస్తువు బట్ట. మన ముపయోగించు బట్ట ముఖ్యముగా మన ఆర్థిక పరిస్థితులపై ఆధారపడియుండును. కాని మనకు కనీసము కావలసిన బట్ట మన అలవాట్లనుబట్టియు, వాతావరణపరిస్థితులనుబట్టియు ఉండును. మన దుస్తులు నేటివరకు ముఖ్యముగా మూడు రకములు: నూలు, ఉన్ని, పట్టు. మన దేశమందు వీటి సాలుసరి ఉత్పత్తి నూలుబట్ట 5600 మిలియను గజములు; ఉన్నిబట్ట 19 మిలియనుగజములు; పట్టుబట్ట 600,000 పౌనులు. ఈ మూడింటియందు ముఖ్యమైనది నూలుబట్ట. తరువాత ఉన్ని, పట్టుబట్టలు వరుసగా వచ్చును. ఈ సంఖ్యలు చాల పెద్దగా కన్పించినను, మన దేశపు జనాభానుబట్టి చూచినచో తల ఒక్కంటికి 16 గజముల నూలుబట్ట, 5 పౌనుల ఉన్నిబట్ట, 0.0015 పౌనుల పట్టుబట్ట వచ్చుట కష్టము. నిన్న మొన్నటివరకు ప్రబలియున్న యుద్ధపరిస్థితులలో తల ఒక్కంటికి వచ్చు బట్ట 12 గజములకు తగ్గినది. మనిషి ఒక్కంటికి 30 గజముల బట్ట కనీసపుటవసరమని నేషనల్ ప్లానింగుకమిటీవారి అభిప్రాయము. వారు చెప్పిన 30 గజముల కనీసముచొప్పున చూచినను మన దేశముయొక్క నూలుబట్టల ఉత్పత్తి ఇంకను 2½ రెట్లధికము కావలయును. ఇట్లే ఉన్ని, పట్టుబట్టల ఉత్పత్తికూడ అధికము కావలయును.

నేటి విశేషములు :

నేడు నేతబట్టలు బజారునందనేకరకముల నేతలలోను, రంగులలోను, నమూనాలలోను దొరకుచున్నవి. మిశ్రమ నేతలలో (అనగా నూలు, ఉన్ని) ఉన్ని, పట్టు కలిసిన బట్టలుకూడ దొరకుచున్నవి. ఈ మూడురకముల బట్టలను తయారుచేయు పద్ధతులలో భేదములు కలవు. ఇందుకు కారణము ఈ మూడురకముల దారములలోను గల ముఖ్యమైన భేదమే. ప్రత్తి ప్రత్తిచెట్టుద్వారా మనకు లభించుచున్నది. అందువలన అది వృక్షసంబంధమైనది. ఈ ప్రత్తిలో ముఖ్యమైనది 'సెల్యులోస్'. సెల్యులోసును మనచుట్టు నున్న గాలిలోని కార్బను, ఆక్సిజనులతోను, నీటిలోని హైడ్రోజనుతోను ప్రతి వృక్షము తన ఉపయోగముకొరకు తయారుచేయును. అందుచే వెదురులోకూడ సెల్యులోస్ కలదు. కాగితములు వెదురునుండి తయారుకాబడుచున్నవి. మనము వ్రాయు కాగితములోని వస్తువు, ధరించు దుస్తులలోని వస్తువు కూడ ఈ సెల్యులోసే. ఉన్ని, పట్టుదారములు చూచినచో అవి జంతుసంబంధమైనవి. ఎందుచేతనంటే, ఉన్ని జంతువుల రోమములనుండి తయారుకాబడును. పట్టు పట్టుపురుగునోటినుండి వెలువడు పదార్థము. మరియొక విశేష మేమంటే, ఉన్ని, పట్టు ఈ రెండింటిలోను ప్రత్తిలో నుండెడి ధాతువులేకాక ఉన్నిలో నైట్రోజెను, గంధకములు గలవు; పట్టులో నైట్రోజెను మాత్రము గలదు. అందుచేతనే ఉన్నిగాని, పట్టుగాని కాల్చిన చెడువాసన వచ్చును. ప్రత్తి, ఉన్ని, పట్టు ఈ మూడింటి భౌతికరూపములలోను, రసాయనికకలయికయందును గల భేదములవలననే వీటిని తయారుచేయు విధానములందుకూడ చాల భేదము లున్నవి.

విదేశీ వింతదారములు :

మనము సాధారణముగా చూచుచున్న ప్రత్తి, ఉన్ని, పట్టుదారములేకాక విదేశములలో క్రొత్తరకములగు దారములనుకూడ తయారుచేయుచున్నారు. వాటిని మన దేశము దిగుమతిచేయుచున్నది. మన దేశమందీరోజులలో ఈ క్రొత్తదారములతో చేయబడుచున్న బట్టలకు చాల గిరాకీ యున్నది.

వాటిలో ముఖ్యమైనవి వాలుగు : (1) Mercerised Cotton; (2) Artificial Silk; (3) Synthetic Fibres–Nylons; (4) Glass fibre.

నూలుదారానికి పట్టునిగనిగలు :

ఈ నాలిగింటిలోను మొట్టమొదట తయారుకాబడినది Mercerised Cotton (మెర్సరైజ్డ్ కాటన్). ఒక వందసంవత్సరముల క్రితము 9 ఏండ్ల ఆంగ్లబాలుడొకడు చదువుకొనుటకు ఆర్థికపరిస్థితులనుకూలములు కాకపోవుటచే ఒక బట్టల పరిశ్రమలో నౌకరీకి కుదురుకొనెను. కాని, తన తెలివితేటలవల్ల మెల్ల మెల్లగా ఉన్నతపదవులను పొందుచు పరిశోధనలు చేయుచుండగా మామూలునూలుదారమును కాస్టిక్ సోడాలో ముంచినచో దానికి పట్టుదారముయొక్క మెరుపు వచ్చునని కనుగొనెను. ఈ పరిశోధనవల్లను, ఇట్టి ఇతర రసాయనశాస్త్ర పరిశోధనలవల్లను, ఆంగ్లదేశమందు శాస్త్రజ్ఞులకు గౌరవము లన్నిటిలో అగ్రగణ్యమైన F. R. S. (Fellow of the Royal Society)కు అతడు ఎన్నుకోబడెను. ఇప్పటికిని అతనిని Father of Textile Chemistry అని పిలుతురు. అతడు కనిపెట్టిన విధానమును 'మెర్సరైజేషను' అందురు. మెర్సరైజ్డుకాటన్ కూడ మామూలు నూలుదారమే అయినప్పటికిని పట్టుదారముయొక్క మెరుపు, మెత్తదనము ఉండును. బిగువుతనము కలిగిన నూలుదారమును కాస్టిక్ సోడాలో ముంచుదురు. తరువాత ఆ బిగువుతన ముంటూఉండగనే దానినుండి ఆ ద్రావకమంతయు కడిగివేయుదురు. ఇదియే మెర్సరైజ్డు కాటన్. ఈ శతాబ్దములో ఇది సాధారణవస్తువే.

మాయపట్టు :

దారములయొక్క చారిత్రాత్మకపరుసలో తరువాత వచ్చేడిది కృత్రిమపట్టు (Artificial Silk). సెల్యులోస్ నీటిలో కరుగకపోయినను కొన్ని ఇతర ద్రావకములలో కరుగు నన్న పరిశోధనపై ఈ కృత్రిమపట్టుపరిశ్రమ ఆధారపడియున్నది. ఆ కరగినదానిని 'స్పిన్నరెట్' అను సూక్ష్మరంధ్రములు గల ఒక గొట్టము ద్వారా ఒత్తిడిచేసి బయటికి పంపుదురు. అట్లు పంపబడిన ద్రావకము బయటికి వచ్చినంతనే దారముగా మార్చబడి పట్టువంటి మెరుపు, మెత్తదనము కలిగియుండును. నిజమునకు అది మామూలు సెల్యులోస్, అనగా నూలుదారమే కాని చూచుటకు పట్టుదారమువలె కనిపించును. అందువలన 'కృత్రిమపట్టు' అన్న పేరు దానికనుకూలమైనదైనను బజారులోనికి వచ్చునరికి కృత్రిమపట్టు అన్నచో అందరికి అనుమానము కలుగును. 'కృత్రిమము' అన్న మాటలో అట్టి అర్థముండుటయే దానికి కారణము. ఇందువలననే కృత్రిమపట్టుకు 1924 లో రేయను (Rayon) అని పేరు పెట్టిరి. రేయనులలో అనేకరకములు కలవు. ఈ భేదము సెల్యులోసును కరగించుట కుపయోగింపబడు ద్రావకముపై నాధారపడియుండును. కాని ముఖ్యముగా ఇప్పుడు తయారుకాబడుచున్నది విస్కోస్ రేయను (Viscose Rayon). దీనిని తయారుచేయుటకు అవలంబించు విధానమును కొంచెము పరిశీలింతము. ఈ రేయను శుభ్రపరుపబడిన 'పల్పు' (Pulp)నుండి తయారుకాబడుచున్నది. శుభ్రపరుపబడిన ఈ పల్పును పలకలుగా చేసి కాస్టిక్ సోడాలో ముంచెదరు. ఎక్కువగా ఉన్న ద్రావకమును తీసివేసి, దానిని దూదివలె ఏకి 2, 3 రోజులవరకు డబ్బాలలో నుంచెదరు. ఈ కాలము పూర్తి అయినతరువాత దీనిని కార్బన్ డైసల్ఫైడు (Carbon disulphide)తో కలుపగా, ఒక నారింజరంగు గల పదార్థము తయారగును. దీనిని ఆల్కలిక్ సొల్యూషనులో కరగింతురు. ఈ మాదిరిగా తయారుకాబడిన చిక్కని పదార్థమును తిరిగి 2, 3 రోజులు అట్లే ఉండనిచ్చెదరు. తరువాత దానిని వడపోసి స్పిన్న

గొట్టుద్వారా పంపుదురు. బయటకు వచ్చుచున్న సన్నని ధారను సోడియం ఆసిడ్ సల్ఫేటు (Sodium acid sulphate) గుండా పంపిన అది గట్టిపడి దారముగా మారును. దానితో చక్కని బట్టలు నేయుదురు.

ఈ నాడు ప్రపంచమంతటి రేయానుఉత్పత్తి 3500 మిలియనుపౌనులు. మన దేశములో ఈ పరిశ్రమ లేదు. కాని దీనికి మంచి ఆవశ్యకము కలదన్న విషయము 1937 లో 5 కోట్ల రూపాయల విలువ గల 48 మిలియనుపౌనుల రేయాను దిగుమతికాబడుటవలన తెలియుచున్నది.

రసాయనాలతో రమ్యమైన దారాలు :

1939 లో అమెరికాసంయుక్తరాష్ట్రములలో నున్న డ్యూపాంటుపరిశోధనశాలలో కొన్ని క్రొత్తదారములు కనిపెట్టబడెను. ఈ పరిశోధనముందు పూర్వపు పరిశోధనలన్నియు అతిస్వల్పములు. ఈ క్రొత్తదారములు 11 సంవత్సరముల బ్రహ్మాండమైన పరిశోధనాఫలితము. మెర్సరైజ్డ్ కాటన్ రేయాన్‌కు పట్టుయొక్క మెత్తదనము, మెరుపు ఉన్నను, ప్రత్తిలో నుండెడి సెల్యులోసే వాటిలో నున్నదికూడ. కాని డ్యూపాంటుపరిశోధనాలయములలో సెల్యులోస్ మీద ఆధారపడకుండ కేవలము రసాయనములనుండి దారములను చేసిరి. డ్యూపాంటులేబొరేటరీలలో చేయబడిన పరిశోధనలు ఈ క్రొత్తదారములను తయారుచేయుటకేకాక బట్టల పరిశ్రమయొక్క ఎన్నియో ఇతరశాఖలలో పరిశోధనల కవకాశములు కల్పించెను. ఈ పరిశోధనలలో ముఖ్యముగా రెండు రసాయనములు (ఒక amide, ఒక amino acid) ఒక దానితో నొకటి కలిపి కరగించగా వచ్చిన ముద్దనుండి దారము తీయవచ్చునని కనుగొనబడెను. ఇట్టి ఇతరరసాయనముల కలయికలనుండి కూడ దారము తీయవచ్చునా అని చూడగా, అట్టివి అధమము 10 కలవని తెలిసికొనిరి. ఈ దారములకు నైలాను (Nylons)లని పేరుపెట్టిరి. ఈ క్రొత్తదారము లన్నిటిలోను మొట్టమొదట అమ్మబడినది "ఫైబరు 66" అనునది. దానిని తయారుచేయుటకు కావలసిన రెండు రసాయనములు బొగ్గు, గాలి, నీరునుండి తీయుదురు. అలాగని బొగ్గు, నీరు కలిపి గాలిలో మరగించినచో నైలాను వచ్చునా అని అడుగరాదు. దాని అర్థమేమనిన గాలి, నీరు, బొగ్గు ముడిపదార్థములుగా చేసికొని అనేక క్లిష్టమైన రసాయనికవిధానములద్వారా నైలాను తయారు కాబడును. నైలాను కనుగొనబడినతరువాత మరికొన్ని ఈ మాదిరివే ఇతరదారములను కనుగొనిరి. పెట్రోలియము నాధారముగా చేసికొని విన్యాన్ (Vinyon), సరాన్ (Saran), కేసీన్ (Casein) అను పాలనుండి వచ్చెడి ప్రోటీన్‌నుండి అరలాకు (Aralac), సోయాబీనులనుండి ఆర్డిల్ (Ardil), లేక సోయాబీనుపూలు మొదలగునవి తయారుకాబడుచున్నవి. నిరుపయోగములగు కోడెయీకలు మొదలగువాటినుండికూడ దారములను తయారుచేయుటకు పరిశోధనలు జరుగుచున్నవి.

ప్రపంచములో ఈ దారముల ఉత్పత్తి మామూలు దారముల ఉత్పత్తితో పోల్చినచో చాల తక్కువ. సుమారు 25 మిలియనుపౌనుల నైలాను, 8 మిలియనుపౌనుల అరలాక్ ప్రస్తుతము తయారుచేయుచున్నారు. వీటిని ఇంకను ఎక్కువగా చేయుటకు అన్ని దేశములలోను - ముఖ్యముగా అమెరికాలో క్రొత్తకర్మాగారములను నిర్మించుచున్నారు.

గాజుదారాల విచిత్రాలు :

వీటితరువాత చెప్పవలసినది గాజునుండి తయారగుచున్న దారము. మంచితరహా గాజును తయారుచేసి, కరగించి దారముక్రింద లాగుదురు. ఒకపౌను గాజునుండి 3600 మొదలు 90,000 గజములవరకు దారము లాగవచ్చును. దీనినిబట్టి ప్రస్తుతము తయారుకాబడుచున్న గాజుదారముయొక్క సన్నతనము తెలియును. గాజుదారము విషయములో ముఖ్యముగా గమనించవలసిన సంగతి ఒకటె కలదు. గాజురేకులద్వారా మనము చూడగలిగినప్పటికీ గాజుదారములద్వారాగాని, వాటితో తయారగు బట్టలద్వారాగాని చూడలేము. ప్రస్తుతము గాజుదారముయొక్క ఉత్పత్తి 30,000 టన్నులు.

ఇటీవల తయారుకాబడిన ఈ క్రొత్తదారములలో కొన్నింటిని మనము చూచితిమి. కొన్నింటి నింకను చూచి ఎరుగము. అట్టివి తయారగుచున్నవని

మాత్రము వినుచుంటిమి; చదువుచుంటిమి; అంతే. వీటిని చవుకగా తయారుచేయుటకు తగిన మార్గములు వెదకుచు పరిశోధనలు విధివిరామములులేకుండ అమెరికా మొదలగు దేశములలో జరుగుచున్నవి. ఎంతో ధనము వెచ్చింపబడుచున్నది. ప్రస్తుతము వాటి అధిక ధరల వల్ల అందరు ఉపయోగించుట కవకాశము లేదు. యుద్ధ పరికరములు, కొన్ని పారిశ్రామిక పరికరములే కాక వీటినుండి బట్టలు, టోపీలు, చేతిసంచులు మొదలగు వస్తువులుకూడ తయారుచేయుచున్నారు. కాని ప్రస్తుతపు అధికధరలవల్ల ఇవి శ్రీమంతులకేకాని సామాన్యుల అందుబాటులో లేవు. ఈ పరిశోధనలవలన ఇవి అందరికి చవుకధరలకు దొరకగలవు. ఉన్ని పట్టుబట్టలకంటె, నూలు బట్టలకంటెకూడ చవుకధరలకు దొరుకగలవు. ఈ తోత్రగా మన బట్టలపరిశ్రమ ఇంకా చవుకధరలకు బట్టలు తయారు చేయగలిగితే తప్ప విధిగా దెబ్బతినును.

పారిశ్రామిక చరిత్రలో సహజవస్తువుల స్థానము కృత్రిమవస్తువులు (మనిషిచే చేయబడినవి) ఆక్రమించుట ఎన్నియో మారులు జరిగెను. మనదేశమందు బాగుగా వృద్ధిచెందిన నీలిమందు పరిశ్రమ Synthetic Indigo (మాయనీలిమందు) తయారుకాబడిన కొద్దికాలమునకు పూర్తిగా నశించిపోవుటయే ఇందుకు ఉదాహరణము.

ఈ నాడు కాకున్న మరియొక రోజునైనా మనము ధరించు దుస్తులు పరిశ్రమలనుండి, వ్యవసాయమునుండి విసర్జింపబడిన వస్తువుల (wastes) నుండి తయారు కాబడునేమో!!



వెలనాటిరాజుల వంశావళి - - -

= శ్రీ మామిడిపూడి వెంకటేశ్వర్లు =

వెలనాటిరాజులు కొంతకాలము చోళరాజుల సామంతులుగను, కొంతకాలము స్వతంత్రులుగను ఆంధ్రదేశమును పాలించిన రాజులు. వారి చరిత్రము నిదివర కెవ్వరును పూర్తిగ వివరించియుండలేదు. అట్టి వివరణము చేయుటకు పూర్వము వారి వంశక్రమమును నిర్ణయించుట అవసరము.

ముఖ్యముగ రాజ్యస్థాపకుడగు మొదటి మల్లరాజునుంచి నన్నిరాజువరకు వంశక్రమము, కాలము నిర్ణయించవలసియున్నది. నన్నిరాజుకు తర్వాత వచ్చిన వెలనాటి నాయకుల వంశావళి శాసనములందు ఒకే విధముగ చెప్పబడియున్నది. కాబట్టి అనుమానమునకు తావు లేదు. వెలనాటి రాజులను గూర్చి పరిశోధన మొదలుపెట్టిన డాక్టరు హల్ట్జుగాని, ఆంధ్రచరిత్ర నెక్కువగ పరిశోధనగావించిన శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గాని వెలనాటి చరిత్రనుగూర్చి చేసిన విమర్శలయందు ఏలనో ముఖ్యవిషయములను గమనింపరైరి. ఈ వ్యాసము ఈ వంశక్రమమును నిర్ణయించుటకై వ్రాయబడినది.

వెలనాటిరాజుల వంశావళికి ముఖ్యముగ మూడు శాసనములు ఆధారముగ నున్నవి. అవి రెండవ చోడరాజుయొక్క శకవర్షము ౧౦౬౩ నాటి ద్రాక్షారామశిలాశాసనము;1 అతని యొక్క శకవర్షము ౧౦౯౧ నాటి తామ్రశాసనము; 2 శకవర్షము ౧౧౦౮ నాటి పృథివీశ్వరుని శిలాశాసనము. 3 ఈ మూడుశాసనములు మొదటివెలనాటి రాజుల కాలమునాటికి చాలా దూరమైనవి. కాని, అవితప్ప వేరు శాసనము లేవియు లేక పోవుటచేత వానినే ప్రధానాధారములుగ తీసుకొనవలసియున్నది.

పిఠాపురశిలాశాసనములో మొదట పేర్కొనబడిన రాజులు చారిత్రకపురుషులు కారు. ఆశాసనమున పేర్కొనబడిన రాజులలో మొదటివాడు ఇంద్రసేనుడు. ఇతడు యుధిష్ఠిరుని దత్తపుత్రుడు. యుధిష్ఠిరునినుండి రాజ్యచిహ్నములను సంపాదించి, కీర్తిపురము రాజధానిగా చేసుకొని మధ్యదేశమును పరిపాలించెను. అతని తర్వాత నెంతోకాలమునకు మల్లవర్మ రాజయ్యెను. అతని కుమారుడు రణదుర్జయుడు; వాని కుమారుడు మూడవ కీర్తివర్మ. వారి పేర్లుతప్ప వారినిగురించి మరే విషయములును తెలియవు.

తర్వాత మొదటి మల్లరాజు నాయకుడయ్యెను. ద్రాక్షారామ, పిఠాపురశాసనములవల్ల, ఈ మల్లరాజు త్రిలోచనపల్లవుని దక్షిణాపథదిగ్విజయయాత్రయందు పాల్గొని, అతని కెక్కువ సహాయపడెనని తెలియుచున్నది. గంగ, కళింగ, వంగ, మగధ, ఆంధ్ర, పుళింద, కుంతల, కేరళ, గౌడ, పాండ్య, భోజ, లాట, మరాట, కటక దేశములను జయప్రదముగ సాధించి, ఆఖరున మట్నహ్యప్రదేశమునుకూడ సంపాదించెను. ఈ మట్న

---

1. ద్రాక్షారామ శిలాశాసనము. S. I. I. Vol. IV. 1182.

2. C. P. 23/1916-17 A. R. E.

3. No. 4 E. I. IV. పృథివీశ్వరుని పిఠాపురశాసనము.

ప్రదేశము దక్షిణమున కృష్ణ నానుకొనియున్న దేశ మని శాసనములవల్ల తెలియును. వెలనాటివంశమును స్థాపించిన మొదటి మల్లరాజేగాక పదకొండు, పండ్రెండవ శతాబ్దములందు ఆంధ్రదేశములో ప్రఖ్యాతిగాంచిన ఇతరరాజు లనేకులు,—కోటరాజులు, కొండపడమటి వారు, పరిచ్ఛేదినాయకులు, తదితరు లనేకులు—త్రిలోచనపల్లవునకు సహాయముచేసి, అతని మెప్పు వడసి, తమ వంశములను స్థాపించితిమని చెప్పుకొనియున్నారు. ఆకాలము నాటి శిలాశాసనములనుండి యిది స్పష్టమగును. కాని, డాక్టరు హల్ట్జు, ఆచార్య కే. ఏ. నీలకంఠశాస్త్రి గారును త్రిలోచనపల్లవుడు చారిత్రకపురుషుడు కాడని నిరూపించిరి.[4] వీరి సిద్ధాంతమే సత్యమైనదని చెప్పదగియున్నది.

పిఠాపురశిలాశాసనమువల్ల మల్లరాజు యొక్క రాజధాని ధనదుపురమని తెలియుచున్నది. శాసనముల మూలముగ, ఇది రేపల్లి తాలూకాలో నున్న చందవోలే యనికూడ తెలియనగును. మొదటి మల్లరాజు కాలము ఏ శాసనమందును ఇవ్వబడలేదు. ఇతని తర్వాత అధికారమువహించిన వెలనాటి నాయకుల మూలముగ ఇతని కాలమును నిర్ణయింపవచ్చును.

పిఠాపురశిలాశాసనమున మొదటి ఎరియవర్మ మొదటి మల్లరాజుకుమారుడుగా చెప్పబడియున్నాడు. అతని కుమారుడు మొదటి కుడియవర్మ; అతని కుమారుడు పిడువలాదిత్యమల్లుడు. గొప్ప బలవంతుడగుటచేత కాబోలు, పిడువలాదిత్య డను బిరుదు వహించెను. అతని కుమారుడు రెండవ కుద్యవర్మ. మిగత రెండుశాసనములలో మొదటి ఎరియవర్మ, మొదటి కుద్యవర్మ చెప్పబడలేదు. పిఠాపురశిలాశాసనములో రెండవ కుద్యవర్మ పిడువలాదిత్యమల్లుని కుమారుడని చెప్పబడియున్నది. కాని ఇది సందేహాస్పదమైన విషయము, ద్రాక్షారామశిలాశాసనమున పిడువలాదిత్యమల్లునకు, రెండవ కుద్యవర్మకు మధ్య అనేక వెలనాటినాయకులు చెప్పబడియున్నారు. పిఠాపురశాసనములో వారి పేర్లగుపడుట లేదు. ద్రాక్షారామశాసనమువల్ల రెండవ ఎరియ పిడువలాదిత్యమల్లుని కుమారుడని తెలియుచున్నది. అతడు రెండవ చాళుక్యభీమరాజు యొక్క అనుచరుడు. చాళుక్యభీమరాజు తూర్పుచాళుక్యరాజ్యమును రమారమి క్రీ. శ. ౯౩౪ నుండి ౯౪౫ వరకు పరిపాలించెను. ద్రాక్షారామశాసనమున మూడవ ఎరియయు, కొరయయు కొట్యమాంబవల్ల రెండవ ఎరియకు గల్గిన పుత్రులని సూచింపబడియున్నది.

తామ్రశాసనమున వేరొకవిధముగ నున్నది. అది యీక్రింది పట్టికలో చెప్పబడియున్నది:

పిడువలాదిత్యమల్లుడు
|
ఎరయ
|
మొదటిమల్లయ (రెండవ చాళుక్యభీముని అనుచరుడు.)
|
ఎరయ

ద్రాక్షారామశాసనమున మొదటి మల్లయ చెప్పబడియుండలేదు. దీనికి కారణము మన మూహింపలేము. తామ్రశాసనమున పైనవర్ణింపబడిన వంశక్రమమునే అంగీకరించుట ఉత్తమముగ దోచుచున్నది. ద్రాక్షారామశాసనమున పేర్కొనబడిన రెండవ ఎరయయు, తామ్రశాసనమున గల పిడువలాదిత్యమల్లుని కుమారుడైన ఎరయయు ఒకరే యని చెప్పవచ్చును. మూడవ ఎరయ —అనగా మొదటి మల్లయపుత్రుడు తన తాత పేరునే పెట్టుకొనె నని యూహించుట అసమంజసము గాదు. రెండవ ఎరయయు, మొదటిమల్లయయు ఒకే చాళుక్యరాజుదగ్గర అనుచరులుగ, శాసనములలో చెప్పబడినట్లు, పనిచేసియే యుందురు. కాబట్టి, రెండవ ఎరయయు, మొదటి మల్లయయు చాళుక్యభీమరాజునకు సమకాలికులుగ నుండియుండవలెను.

వంశస్థాపకుడగు మొదటి మల్లవర్మ యొక్క కాలము మన మిప్పుడు తెలుసుకొనగలము. తరమున కిరువది సంవత్సరముల చొప్పున లెక్కించి, రెండవ ఎరయ రెండవ చాళుక్యభీముని రాజ్యకాలమువరకు,

4. **Studies in Cola History and Administration, (P. 66) by K. A. Nilakantha Sastri.**

అనగా క్రీ. శ. ౯౪౫ వరకు నాయకుడుగ నుండెనని భావించినయెడల ఆ నాయకుల కాల మీక్రిందివిధమున సూచింపబడినట్లు ఉండును :

౧. మొదటి మల్లవర్మ- క్రీ. శ. ౮౪౫-౮౬౫.

౨. మొదటి ఎరయ, లేక ఎరయవర్మ - క్రీ. శ. ౮౬౫-౮౮౫.

3. మొదటి కుడ్యవర్మ - క్రీ. శ. ౮౮౫-౯౦౫.

౪. పిడువలాదిత్యమల్లుడు-క్రీ. శ. ౯౦౫-౯౩౫

డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు త్రిలోచనపల్లవునిగూర్చి వ్రాయుచు 5 అతడు చరిత్ర పురుషు డనియు, కల్పిత మూలపురుషుడు గాడనియు నిర్ధారణచేసి, అతడు ఐదవ శతాబ్దమునాటివా డై యుండవలెనని నిరూపించిరి. ఐతే, పైన చెప్పబడిన మొదటి మల్లవర్మ, శాసనములలో నుదాహరింపబడినట్లు త్రిలోచన పల్లవుని సమకాలికు డైనచో, త్రిలోచన పల్లవుడు, మల్లవర్మను నిర్ధారణచేసిన కాలము, అనగా క్రీ. శ. ౮౪౫-౮౬౫ నాటి వా డైయుండవలెనుగదా అటులైన వెంకటరమణయ్యగారి వాద మడుగంటి పోవును. త్రిలోచన పల్లవుడు చారిత్రక పురుషుడు కాడు. కల్పిత పురుషుడు.

తామ్రశాసనమున మూడవ ఎరియకు అర్గురు పుత్రు లున్నట్లుగ చెప్పబడియున్నది. వారు రెండవ మల్లయ; రెండవ కుడ్యవర్మ; మొదటి గండ; మొదటి పండ; నన్న; కొపన. రెండవ కుడ్యవర్మ తూర్పు చాళుక్యరాజగు విమలాదిత్యుని అనుచరుడుగ నుండెను. గనుక విమలాదిత్యుని కాలము, అనగా రమారమి క్రీ. శ. ౧౦౧౧-౧౦౨౨ నాటివా డైయుండును. కాబట్టి మూడవ ఎరియ కుడ్యవర్మకు పూర్వపు రాజగు శక్తి వర్మ నాశ్రయించి యుండవచ్చును. అనగా రమారమి క్రీ. శ. ౯౯౧-౧౦౧౧ నాటివా డై యుండును.

రెండవ మల్లయ తన తాత పేరునే పెట్టుకొన్నట్లున్నది. ఐదవవాడగు నన్న మొదటి విష్ణువర్ధన రాజరాజువద్ద సేనాధిపతిగ నుండెనని తామ్రశాసనమున చెప్పబడియున్నది. ద్రాక్షారామ శాసనమున మూడవ ఎరయరొక్క అగ్రసూను డొక డుదాహరింపబడియున్నాడు. కాని అతని పే రుండవలసిన భాగము శాసనమున శిథిలమైయున్నది. తామ్రశాసనమువల్ల అతడు రెండవ మల్లరే యని యూహింపనగును. ద్రాక్షారామశాసనమున ఒకచోట వెలనాటిరాజొకడు సామంతపదవిని,గుద్రవారమును విష్ణువర్ధనునినుండి పొందినట్లుగా చెప్పబడియున్నది. ఆ భాగము కొంతవరకు శిథిలమైనందువల్ల ఏ వెలనాటినాయకు డాబహుమానములకు పాత్రుడయ్యెనో చెప్పలేము. ఐతే మిగిలిన రెండు శాసనములవల్ల ఈ విషయము తేలగలదు. ఆ రెండిటియందు రెండవ కుడ్యవర్మ విమలాదిత్యుని సేవించి, గుద్రవారద్వయము, లేక గుద్రవార మండలమునర పొందినట్లు వచింపబడియున్నది. కాబట్టి ద్రాక్షారామశిలాశాసనమున చెప్పబడిన గుద్రవారము విమలాదిత్యు నాశ్రయించిన రెండవ కుడ్యవర్మకే అయియుండునని తెలియుచున్నది.

మరొక్క విషయము. నన్నిరాజునకును, రెండవ కుడ్యవర్మకును గల బాంధవ్యము తేల్పవలసియున్నది. పిఠాపురశిలాశాసనమున రెండవ కుడ్యవర్మయొక్క మనుమడనియు, ఎరయరొక్క పుత్రుడనియు నన్నిరాజునిగూర్చి చెప్పబడియున్నది. తామ్రశాసనమునుండి రెండవ కుడ్యవర్మ, నన్నిరాజులు ఎరయరొక్క పుత్రులయినట్లు పైన జూచితిమి. ఈ రెండు శాసనములలో నన్నిరాజు, లేక నన్నయ ఒక ఎరయపుత్రుడని వచింపబడియుండుటచేతను, రెండవ కుడ్యవర్మ పిఠాపురశాసనములో సూచింపబడినట్లు పిడువలాదిత్యమల్లుని కుమారుడు కాడని పైన నిర్ధారణచేసితిమి గనుకను, రెండవ కుడ్యవర్మయు, నన్నిరాజురొక్కయు తండ్రి రొక్కరైన దను వంశము నిర్ధారణచేయుటకు తామ్రశాసనమునే ఆధారముగ దీసికొనుట ఒప్పని తోచుచు

5. **Madras Christian College Magazine, Vol. IX 1929**

6. గుద్రవారద్వయమని పిఠాపురశాసనమున గలదు. గుద్రవారమండల మని తామ్రశాసనమున సూచింపబడియున్నది.

న్నది. ఆశాసనమునుబట్టి రెండవ కుడ్యవర్మ, నన్న కాబట్టి ఈ క్రింద నుదాహరింపబడిన వంశావళి నే రాజు మూడవ ఎరయయొక్క పుత్రులని తెలియును. మన మనుసరించవలెను.

రమారమి (క్రీ. శ)

౧. మొదటి మల్లవర్మ. (౮౪౫-౮౬౫

|

౨. మొదటి ఎరయ, లేక ఎరయవర్మ ౮౬౫-౮౮౫

|

౩. మొదటి కుడ్యవర్మ ౮౮౫-౯౦౫

|

౪. రెండవ మల్లవర్మ
లేక, పిడువలాదిత్యమల్ల ౯౦౫-౯౨౫

|

౫. రెండవ ఎరయ ౯౨౫-౯౪౫

|

౬. మొదటి మల్లయ

|

౭. మూడవ ఎరయ

|

రెండవమల్లయ | రెండవ కుడ్యవర్మ (క్రీ. శ. ౧౦౧౧-౧౦౨౨) | గండ | పండ | నన్న | కాపన



కీర్తిశేషుడైన శ్రీమాలవ్యాపండితుడు

= శ్రీ కొమాండూరు శఠకోపం =

జాతీయపితామహుడు, హిందూమతోద్ధారకుడు, హిందూవిశ్వవిద్యాలయ జనకుడు నగు శ్రీ మదనమోహనమాలవ్యాగారు గతనెల 12-వ తేదీని వారాణసిలో పరమపదించినారు. ఆయన తన దీర్ఘ జీవితమునంతను భారతజాతికి- ముఖ్యముగా హిందూ సంఘమునకు సేవచేయుటలోనే గడిపెను. ఆ పవిత్ర పురుషుని జీవిత ముఖ్యవృత్తాంతములు అవశ్య స్మరణీయములు.

ఆయన పూర్వీకులు మాళవ మనబడు (ఉజ్జయినీ ప్రాంతము) మధ్యదేశస్థులు. కనుకనే వారి కుటుంబమునకు 'మాలవ్య' అని పేరు వచ్చినది. వారు పిమ్మట కాశీప్రయాగప్రాంతములకు వెళ్లిపోయిరి.

మదనమోహనుని పితామహుడు ప్రేమధర మాలవ్యాగారు. ఆయన సంస్కృతములో అఖండపండితుడుగ నుండెనట. అట్లే తండ్రి వ్రజనాథమాలవ్యా గీర్వాణవాఙ్మయములో గొప్ప విద్వాంసుడు.

విశ్వకవి రవీంద్రుడు, వైజ్ఞానికశిరోమణి డా॥ ప్రఫుల్లచంద్రరాయి, జాతీయనాయకుడు మోతీలాల్ నెహ్రూ జనించిన 1861-వ సం.లోనే మదనమోహనుడును ప్రయాగలో డిశంబరు 25-వ తేదీని జన్మమొందెను. సహజముగా ఆబాలునికి మాతృభాష హిందీని, ఆనువంశికమైన దేవభాష సంస్కృతమును తండ్రిగారు నేర్పిరి. ఈ రెండుభాషలలోను బాల్యమందే అతడు ప్రావీణ్యము సంపాదించి పిమ్మట అలహాబాదులో కాయస్థపాఠశాలలోను, మూరుసెంట్రల్ కాలేజిలోను ఆంగ్లవిద్య నభ్యసించి, 1884 నాటికి బి. ఏ. పట్టమొందెను. ఆయన అక్కడ ఒక హైస్కూలులో ఉపాధ్యాయుడుగ జీవితవృత్తి నారంభించి, రెండేండ్లు విద్యాబోధ చేసెను. కాని అప్పుడాయన హిందీలో రాజా రాంపాల్ సింగ్ అను ఉదారుడగు నొక జమీందారు స్థాపించిన 'హిందూస్థానీ' అను దినపత్రికను, 'ఇండియన్ ఒపీనియన్' అను ఆంగ్లపత్రికను నడుపుట సంభవించెను.



అప్పటికి మన దేశభాషలలో దైనికవార్తాపత్రికలు లేవు. అట్టిపత్రికలకు (ముఖ్యముగా మాతృభాషలలో) ఇప్పుడున్న సౌకర్యములు ఆకాలములో లేవు. ఆధునికభావములను గూర్చిన పారిభాషికపదజాలముకూడ సృజించుకోవలసియుండెను. మదనమోహను డా దినపత్రికను చాల సమర్థతతో నడిపి సామాన్యజనులలో విజ్ఞానమును, దేశప్రేమను జనింపజేసి, మార్గదర్శకు డాయెను. పిమ్మట రాజకీయరంగము లోనికి దిగినతరువాతగూడ ఆయన వార్తాపత్రికలం దుత్సాహము చూపుచునేయుండెను; అలహాబాదులో సుప్రసిద్ధమైన 'లీడరు' అను ఆంగ్లదినపత్రికను స్థాపించెను. (శ్రీ చింతామణిగారు తరువాత దానికి సంపా

దకులైరి) 'అభ్యుదయ' అను స్వతంత్రహిందీపత్రికను గూడ ఆయనయే స్థాపించి, స్వయముగా నడిపెను. ఈ 'అభ్యుదయ' ప్రగతిభావము కలది. ఇది అలహాబాదులో కొంతకాలము వారపత్రికగను, అప్పుడప్పుడు దినపత్రికగను నేటికిని మాలవ్యాగారి కుటుంబపు బిడ్డవలె వారివల్లనే ఉన్నతాదర్శములతో, జాతీయోన్నతికై సర్వాంగసుందరముగా నడుపబడుచున్నది.

మాలవ్యాగారికి కౌమారములోనే రాజకీయములందభిరుచి కల్గినది. కాంగ్రెసుమహాసభ మొదటి సమావేశము 1885-వ సం.లో బొంబాయిలో జరిగినది. మరు సం. 1886 లోనే ఆయన కాంగ్రెసులో తీర్మానపు చర్చలో ఉపన్యసించెను. అప్పటినుండి మాలవ్యాగారు ప్రతిసాలున కాంగ్రెసుకు హాజరగుచు, అందలి చర్చలలో ఉత్సాహముతో పాల్గొనుచుండిరి. ఇట్లు అవిచ్ఛిన్నముగా ఇంతకాలము కాంగ్రెసులో పాల్గొని దేశసేవచేసిన నాయకులు మరిఒకరు లేరు.

దాదాభాయి నౌరోజీ అధ్యక్షతను 1886 లో జరిగిన కలకత్తాసమావేశములో కాంగ్రెసుస్థాపకులలో ప్రముఖుడగు 'హ్యూం'దొరగారితో పరిచయముచేసుకొని, ఆయన సలహాపైన స్వతంత్రమగు న్యాయవాదవృత్తికి పోదలచి 'లా' పరీక్షకు చదివి, మాలవ్యాగారు అందులో కృతార్థులై, 1891 నుండి వకీలువృత్తి నారంభించిరి. అలహాబాదు హైకోర్టులో అప్పటి ప్రసిద్ధవకీళ్లయిన మోతీలాల్ నెహ్రూ, తేజ్ బహదర్ సప్రూలతోబాటు మాలవ్యాగారును ప్రముఖన్యాయవాదిగా ఖ్యాతిగాంచిరి.

కాని వారికన్న ముందే(20 సం.లకే) ఆయన జీవికాప్రధానమగు వకీలు వృత్తిని,ద్రవ్యసంపాదనను కట్టిపెట్టి, ప్రజాసేవాతత్పరుడై విద్యారాజకీయములందు మగ్నుడాయెను. ఆయన ముందుగా అలహాబాదు మునిసిపల్ వైస్‌ఛేర్మనుగా పౌరసేవయం దనుభవము గడించి, త్వరలోనే (1902) సంయుక్తప్రాంతపు శాసనసభలోను, ఆపిమ్మటసామ్రాజ్యశాసనసభలోను సభ్యుడై అందలి వివిధ చర్చలలో ప్రముఖస్థానము వహించెను. (గోఖలేగారి ప్రారంభవిద్యాచట్టము, ఆర్థికసమస్య, పారిశ్రామికసమస్య ఇట్టి సార్వజనికవిషయాలలో, చర్చలలో ఆయన ప్రధానపాత్ర వహించుచు అద్భుతధీశక్తితోను, వాగ్ధాటితోను ప్రజాపక్షమును సమర్థించుచు నిరర్గళక్తృతా ప్రతిభను ప్రదర్శించుచుండెను. అప్పటి శాసనసభలలో ప్రజాప్రతినిధుల సంఖ్య చాల తక్కువ. మింటోమార్లే సంస్కరణలు, మాంటేగూ-ఛెంస్‌ఫర్డు సంస్కరణలు వచ్చినపిమ్మట పరిస్థితి కొంత బాగుపడెను. ఆయన కేంద్రశాసనసభలో క్రమముగా ప్రజాపక్షనాయకుడాయెను. అప్పుడు ప్రభుత్వమువా రేర్పరిచిన 'ఇండస్ట్రియల్ కమిషన్' (పారిశ్రామిక సమితి)లో సభ్యులై మాలవ్యాగారు మన దేశపు పరిశ్రమల అభివృద్ధిని, అందలి ఆటంకముల నివారణను గూర్చి గట్టి పరిశీలన చేసి, ఆసమితివారి నివేదిక తయారుచేయుట కెంతయో తోడ్పడిరి. అందుమూలముగా బట్టలు, చెఱకు, లోహము మున్నగు మార్పు పరిశ్రమలకు ప్రభుత్వమువారు(ముఖ్యముగా విదేశపువస్తువులమీద పన్నులం విధించి) రక్షణనొసగిరి. అందువల్ల మనదేశములో ఆ పరిశ్రమలు త్వరలో కొంత వృద్ధియయినవి. తిలకుగారి నాయకత్వమున అతివాదు లారంభించిన విదేశవస్తుబహిష్కరణలో మాలవ్యాగారు పాల్గొనలేదు. కాని స్వదేశీవ్రత మవలంబించి మాలవ్యాగారు దేశీయపరిశ్రమల యభివృద్ధికి తోడ్పడుచుండిరి. 1907 సం. ఆఖరున కాంగ్రెసులో రెండుపక్షములలో చీలిక రాగా, మాలవ్యాగారు పెద్దల(అనగా మితవాద)పక్షములో ఉండిపోయిరి. 1909 లో లాహోరులో జరిగిన కాంగ్రెసుమహాసభ కధ్యక్షులై అప్పటి మింటోమార్లే సంస్కరణలను పరిశీలించిరి. మరల యుద్ధానంతరము 1918 సం. (ఢిల్లీ) కాంగ్రెసు కధ్యక్షులై, మాంటేగుసంస్కరణలను విమర్శించిరి. 1919 లో పంజాబుదురంతముల తరువాత ఆయన పంజాబుకు వెళ్లి అక్కడి పరిస్థితులు స్వయముగా పరిశీలించెను. ఆపిమ్మట గాంధీమహాత్ముడు ప్రారంభించిన అసహాకారోద్యమమునుండి మాత్రము ఆయన తప్పుకొన్నను, జాతీయపక్షనాయకులై కేంద్రశాసనసభలో తరచు స్వరాజ్యపక్షమునకు తోడ్పడుచుండెను. 1929 లో కాంగ్రెసుపక్షీయు

లతో కలిసి రాజీనామా ఇవ్వలేదు. (అప్పు డాయన కాంగ్రెసుపక్షమున గాక, జాతీయపక్షములో సభ్యుడు) కాని, లాహోరుకాంగ్రెసులో సంపూర్ణస్వాతంత్ర్యపు తీర్మానము కలుగగా, దేశీయపరిశ్రమల రక్షణసమస్య పైన 1930 సం.లో ఆయన సామ్రాజ్యశాసనసభను వదలివేయుటే గాక, అప్పటి ప్రచండ సత్యాగ్రహములో గాంధీయులందరితో కలిసి పాల్గొనెను. ఆ సందర్భములో రెండుసారు లాయన జైలులోకి వెళ్లిరి. అహింసాయుద్ధమధ్యమందే—1933 లో కలకత్తాలో జరుగ నిశ్చయమైన కాంగ్రెసుసమావేశము సర్కారుచే నిషిద్ధమని, అక్కడ లాఠీప్రయోగము జరుగునని యెరిగియుండియు ఆయన దానికి అధ్యక్షత వహించుట కంగీకరించి అలహాబాదునుండి కలకత్తాకు బయలుదేరిరి. కాని దారిలో పోలీసువా రాయన నరెస్టుచేసి వెనుకకు తీసుకొనిపోయిరి. దాదాభాయి, జవహరలాలులు కాక మూడుసార్లు జాతీయమహాసభాధ్యక్షుడైనవా డాయన ఒక్కడే. 1941 నాటి కాయన కేవలమువృద్ధుడై అనారోగ్యస్థితిలో నున్నందున, ఈ సత్యాగ్రహములో అరెస్టుకాలేదు. కాని జాతీయభావములను తెలుపుచునేయుండెను. 1924 లో ప్రయాగలో కుంభమేళ జరిగినప్పుడు గంగాతీరము జనులకు ప్రమాదకరముగా నున్నదని సర్కారువా రడ్డుగట్టి తీర్థజనముఎవ్వరును త్రివేణీసంగమమువద్ద స్నానము చేయకుండ నిషేధించిరి. కాని అప్పుడు మునిసిపల్ ఛేర్మెనుగానుండిన జవహరలాలుతో బాటు ఆయన కూడ అక్కడ స్నానముచేసి సత్యాగ్రహ మాచరించిరి.

ఆధ్యాత్మికముగా మాలవ్యాగారు అత్యంతఆస్తికులు. ఆయన మహాభక్తుడు. ఆయన భాగవతపురాణప్రవచనము చేయుచుండగా శ్రోతలు సంతోషపరవశులై ముగ్ధులగుచుండిరి. సంస్కృతమందలి ధార్మికగ్రంథము లాయనకు కరతలామలకములు. ఆ పరమభాగవతోత్తముడు సనాతనహిందూజాతికి శిరోమణి. సనాతనధర్మమహామండలిని స్థాపించి హిందూమతనాయకులను, విద్వాంసులను విశేషముగా ప్రోత్సహించుచుండెను. హిందూమహాసభాస్థాపకులలో, దాని నాయకులలో ఆయన అగ్రగణ్యుడని, సర్వమాన్యుడని అందరికిని తెలిసినదే. వ్యక్తిగతముగా ఆయన పూర్వాచారపరుడు. సదాచారనిష్ఠ నెప్పుడును ఆయన వీడలేదు. 1931 లో దేశక్షేమము నిమిత్తము రౌండుటేబిలు సభలో వాదించుటకు ఇంగ్లండువెళ్లి కొన్నినెలలు వసించినప్పుడు తన ఆచార కర్మకాండను వదలక గంగాజలమునగూడ తనతో తీసుకొని వెళ్లి అక్కడ గంగోదకమునే త్రాగుచు కేవలము శాకాహారిగానే యుండెను.

ప్రాచీనభారతీయసంస్కృతియందు మాలవ్యాగారి ప్రేమశ్రద్ధలు అపారములు. కాశీలోని ముఖ్యవైదికసంస్థ లన్నిటిని ఆయన ఆదరించి పోషించుచు తగు సలహాల నిచ్చుచుండెను. వారాణసిలోని సెంట్రల్ హిందూకాలేజీని (అనిబిసెంటుతో కలిసి) చాలా ఏండ్లు నడపి తుదకు దానిని (ప్రభుత్వపు అనుమతి పొంది) హిందూవిశ్వవిద్యాలయముగా మార్చెను. ఈ యూనివర్సిటీకి హిందూప్రముఖులందరి సానుభూతిని, సంస్థానాధిపులనుండి, జమీందారులనుండి, వణిక్ప్రంగవులనుండి కోట్లకొలది రూపాయల చందాను సంపాదించి, ఆయన అందు మన విజ్ఞానమునేగాక ఆధునిక ప్రకృతిశాస్త్రములనుగూడ బోధింపజేయుచు, మన దేశములో ఇతర విశ్వవిద్యాలయాలలో లేని క్రొత్తశాఖ లనేకములకు కళాశాలలు స్థాపించెను. అందలి విద్యాకార్యక్రమము సాగించుటకు దేశమందలి విద్యాధికుల నాకర్షించి తదేకదీక్షతో దానిని వృద్ధిపరుచుచు వారిని అధ్యాపకులుగ చేర్పరచెను. 20 ఏండ్లు ఆయన ఆ యూనివర్సిటీకి వైస్‌ఛాన్సెలరుగ నున్నారు. వార్ధక్యమువల్ల ఏడేండ్లక్రిందట ఆయన దానిని మానుకొని తన స్థానే శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారిని నియమింపజేసినారు. హిందూవిశ్వవిద్యాలయమున కాయనయే జనకుడని చెప్పదగును. దీనిలో మన దేశములో అన్ని ప్రాంతాలనుండి వేలకొలది విద్యార్థులు వెళ్లి మన ప్రాచీనసంస్కృతినేగాక ఆధునిక విజ్ఞానమునుకూడ నేర్చుకొందురు. అది ఇప్పుడు సర్వతోముఖముగ వికాసము పొందుచున్నది. ముఖ్యముగా హిందువుల ధనముతో పోషింపబడి హిందూవిజ్ఞానము ప్రసరింపజేయుచున్నను, (అలీఘెర్‌లోవలె పాక్షికతత్వములో బడకుండ) దీని నాయకులు జాతీయభావమును కాపాడుట వారి దూరదృష్టిని, మాలవ్యాగారి

ఘనతను తెలుపుచున్నది. మాలవ్యాగారు హిందూ నాయకుడైనను ఆయన విభేదపరుడు కాక సమన్వయమునకు, ప్రగతికినే తన శక్తులను వినియోగించెను. రాజకీయముగా తాను మితవాదియైనను, ముఖ్యముగ క్లిష్టపరిస్థితులన్నింటిలో జాతీయోద్యమమునకు తోడ్పడి, క్రియారూపముగా సహాయముచేసెను. 1931 సం. రౌండుటేబిల్ సభలో తాను హిందూ ప్రతినిధిగా ప్రభుత్వమువల్ల పంపబడియు అక్కడ లండనులో జరిగిన చర్చలలో సాధారణముగా మహాత్మునకు తోడ్పడుచు, చాలవరకు జాతీయదృక్పథమును చూపెను. ఇట్లే 1920 సం. నుండి తక్కిన మితవాదనాయకులు, జిన్నాప్రభృతులు జాతీయమహాసభనుండి తప్పుకొని, కాంగ్రెసును నిరసించినను, తాను మాత్రము ఆ మాతృసంస్థలో పాల్గొనుచు గాంధీగారి నాయకత్వములో జాతీయకార్యములన్నింటిలో పాల్గొనుచువచ్చెను. తాను పూర్వాచారపరుడే గాని, గాంధీగారు అస్పృశ్యతానివారణకు, హరిజనోద్ధరణకు చేయు కృషి న్యాయమని, హిందూసంఘరక్షణ కావశ్యకమని ఆ కుశాగ్రబుద్ధి గమనించి, ఔదార్యముతో అందుకు సాయపడెను. 1932 లో పూనాలో గాంధీగారి ఉపవాసము జరిగినమీదట హరిజనులకు నియోజకవర్గములో సమిష్టిపద్ధతి పెట్టుటకై వారికి దాదాపు రెట్టింపుస్థానము లిచ్చుటకు ఆయన సవర్ణనాయకుల నొప్పించి, నిమ్న జాతినాయకులతో స్థిరముగ రాజీని జరిగించెను. (అదే 'పూనాపాక్టు' అనబడుచున్నది). ఆ వెంటనే బొంబాయిలో జరిగిన హిందూనాయకుల సభలో ఆయన అస్పృశ్యతానివారణకును, హరిజనులకు త్వరలోనే హిందూదేవాలయములలోకి ప్రవేశమిప్పించుటకును ప్రతినబూనుటయేకాక తక్కిన పూర్వాచారులను హిందూప్రముఖులనుగూడ ఒప్పించెను. 1921 సం.లో గాంధీరీడింగులకు, 1929 లో గాంధీ ఇర్విను లకు మధ్య సమాఖ్య కుదుర్చుట కాయన చాల శ్రమపడి ఎంతో కృషిచేసెను. హరిజనుల అస్పృశ్యతానివారణయు, దేవాలయప్రవేశమును రాజకీయముగనేకాక శాస్త్రసమ్మతములు, ఆధ్యాత్మికముగా, సాంఘికముగా హిందూజాతికి శ్రేయస్కరములు అని ఆయన 'సనాతనధర్మ' అను తాను కాశీలో స్థాపించిన హిందీవారపత్రికలో తరచు వ్యాసములద్వారా నిరూపించెను. కాశీవంటి కేంద్రస్థలములలో మాలవ్యాగారిందునుగూర్చి సభలు జరిగించియు, పండితుల యిష్టాగోష్ఠులలో చక్కని శాస్త్రచర్చనుకూడ జరిగించుచుండిరి. మనలో సాధారణముగా వాక్శూరతకు తగిన కార్యశూరత లేదను నెపమున్నది. కాని ఆయనఉదారత మాటలతో నిలిచిపోలేదు. మరియు, తక్కిన హిందూమహాసభానాయకులగు సావర్కారు, భాయిపరమానందులవలె ఒకప్పుడు రక్తపాతపు విప్లవవాదము, మరొకప్పుడు తీవ్రసాంఘికతత్వము ఇట్టి విరుద్ధభావముల పద్ధతి ఆయన కెన్నడును లేదు. మరియు ఆయనకృషిప్రవృత్తి ఎప్పుడును నిర్మాణాత్మకముగానే ఉండెను. హిందూసంఘపు హక్కులను సమర్థించి రక్షణచేయ కంకణము వహించెను. కాని సామరస్యముద్వారా, జాతీయతత్వముద్వారానే హిందూసంఘమును వృద్ధిచేయుటకు తాను పూనుకొని హిందూముస్లింసఖ్యమునకై ఆయనశక్తిని వినియోగించెను. ఆయన నూచుట కెంత సౌమ్యుడు, గంభీరుడునో, గుణములలోను చర్యలలోనూ అంతే. "ఆకారసదృశప్రజ్ఞః ప్రజ్ఞయా సదృశాగమః" అను కాళిదాసు సూక్తి ఈ మహనీయుని కన్నివిధములను సరిగా వర్తించును. వెన్నవంటి ఆయనమనస్సు, హృదయము ఇటీవల బెంగాలు, బీహారులలో జరిగిన సాంఘికదురంతముల కెంతయు పరితపించిన వనుట నిస్సందేహము. ఈ తరుణములో ఆయన మరణించుటకు ఆవ్యథయు కొంత కారణమైనదని కొందరి యూహ. అది ఎట్లున్నను స్మృతితప్పినమీదను ఆయన జాతీయక్షేమమునకు కంకణముగట్టుకొన్న గాంధీ సిద్ధాంతాలను స్మరించి "హేరామ" అని ధ్యానించుచునే పరమపదము నొందుట ఆయనపరిశుద్ధాత్మకు గొప్ప నిదర్శనము.

ఆత్మగతం

[కథానిక]

❋

= శ్రీ గోపీచంద్ =

లీల మేడకిటికీదగ్గరకు వచ్చి ఆకాశంకేసి చూచేసరికి మబ్బులు కమ్ముకున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్లాలనిపించింది.

లీలకి వివాహమై రెండుసంవత్సరా లయింది. ఈ రెండుసంవత్సరాలనుంచీ, ఎన్నడూ ఆమె కిటువంటి ఆలోచన కలగలేదు. ఇంచుమించు ఆమె తల్లిదండ్రులని మరిచిపోయిందనే చెప్పాలి.

"పోనీ, ఒకసారి వెళ్లి రారాదూ!" అనేవాడు ఆమెభర్త మోహన్.

"వాళ్లు రమ్మనందే!" అనేది లీల.

లీలపుట్టింటివారు తమని రమ్మనరని మోహన్‌కి తెలుసు. లీల తనని వివాహం చేసుకోటం వారి కెవరికీ ఇష్టంలేదు. లీలసౌందర్యాన్నిగురించీ, తెలివితేటలనిగురించీ, జాతకాన్నిగురించీ వారికి గొప్ప అభిప్రాయం వుండేది. మోహన్ లీలకి తగిన వరుడు కాడని వారి అందరి అభిప్రాయమూను. వారు లీలకి అనేక విధాల బోధించిచూశారు. మోహన్‌లో వున్న లోపాలు గోరంతలు కొండంతలు చేసి చెప్పారు.

"అతనికి సంపాదనమీద దృష్టిలేదు" అన్నారు.

అప్పుడు ఇదొక లోపంగా కనపడలేదు లీలకి. "సంపాదనమీద దృష్టి సామాన్యమానవులకి వుంటుంది. మోహన్ అసాధారణవ్యక్తి" అనుకొన్నది.

"అతనిది నిలకడలేని మనస్సు" అన్నారు.

అప్పు డిదొక లోపంగా కనపడలేదు లీలకి. "మోహన్ కళోపాసకుడు; నిత్యనూతనుడు; ఎప్పటికప్పుడు నూతన అనుభవాలను జీర్ణించుకొని పరిపూర్ణత్వసిద్ధికోసం ప్రయత్నించే మేధాసంపన్నుడు" అనుకొన్నది.

వారింకా అనేకం చెప్పారు. వారు మోహన్‌నిలా అపార్థంచేసుకోటానికి అతని సౌందర్యపిపాసే కారణం అనుకొన్నది లీల. వారి అమాయకత్వానికి నవ్వుకొన్నది. "మోహన్-తన మోహన్-ఈ సాధారణ మానవులకి అర్థం అవుతాడా?" అని మురిసింది.

చివరకి, పుట్టింటివారి కెవరికీ యిష్టం లేకపోయినా మోహన్‌ని వివాహంచేసుకుంది. తల్లిదండ్రులుగాని, అన్నగాని, చెల్లెలుగాని, ఎవరూ తన వివాహానికి రాలేదు. మహదానందంలో తేలిపోతున్న లీలకి, తనవారెవరూ రాలేదని అనిపించలేదు. ఊళ్లో వున్న కవులూ, రచయితలూ, కళాజీవులూ, అంతా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిత్యనూతనత్వంకోసం తపించిపోయే మోహన్‌కి దివ్యజ్యోతి దొరికిందని అభినందించారు. వారి ప్రశంసలకి లీల పరవశత్వం పొందింది. ఇంత ఉత్తమ పురుషునికి భార్య అయినందుకు గర్వించింది. తన జీవితం మోహన్ ఆదర్శసాధనకు సహాయం చెయ్యటానికై అంకితం చెయ్యాలని నిశ్చయించుకుంది.

వివాహం కాగానే లీలామోహనులు వినోదంగా

* ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంవారి సౌజన్యంతో.

కాలక్షేపం చెయ్యాలనే ఉద్దేశంతో పుణ్యక్షేత్రాలూ, ప్రముఖస్థానాలూ, రమణీయదృశ్యాలూ చూడిరావటానికి బయలుదేరారు. శ్రీరంగం, కంచి, మధుర, అజంతా, హంపీ, ఎల్లోరా మొదలైన ప్రదేశాలు దర్శించారు. హంపీ, అజంతా దృశ్యాలను చూచినప్పుడు లీలహృదయం నీరయింది. వాటి వైభవాన్నీ, వాటి పూర్వచరిత్రనీ, ప్రస్తుత స్థితినీ మోహన్ ఆమెకు కళ్లకి కట్టినట్టు వర్ణించి చెప్పాడు. హంపీక్షేత్రంలోని శిల్ప చాతుర్యాన్నీ, అజంతా గుహలలోని చిత్ర నైపుణ్యాన్నీ వివరించాడు.

" చూశావా మన పూర్వపు ఔన్నత్యం " అన్నాడు.

ఆమెహృదయం ఉప్పొంగింది.

"చూడు, ఈనాటి దీనావస్థ" అన్నాడు.

ఆమెహృదయం క్రుంగింది.

ఇంత వైభవాన్నీ, ఇంతసౌందర్యాన్నీ పోషించలేని, ఆనందించలేని జాతిమీద కోపం వచ్చింది. మోహన్ వంటి రసహృదయులు, కళారాధకులు 'పది మంది వుంటే దేశం ఇంత దౌర్భాగ్యస్థితికి వచ్చేది కాదు గదా అని చింతించింది. ఆక్షణం ఆమెకళ్లకి మోహన్ దివ్యమూర్తిగా కనిపించాడు; మూర్తీభవించిన ప్రకృతిలాలిత్యంగా కనిపించాడు.

"నామోహన్, నా మోహన్" అనుకుంది; తన్మయత్వం చెందింది. మోహన్ చేత అనేక ఘన కార్యాలు చేయించాలని మనస్సులో నిశ్చయించుకుంది.

దంపతులిద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు....

మోహన్ చిత్రకారుడు. స్వార్జితం తక్కువ. అందువల్ల ఆర్థికంగా తరచు అనేకబాధలు పడుతూ వుండేవాడు. ఈ సంగతి లీలకి తెలుసు. వివాహానికి ముందే తన కుటుంబపరిస్థితులూ, ఆర్థికమైన చిక్కులూ అన్నీ ఆమెకు చెప్పాడు. ఆమె అతని నిష్కపట స్వభావానికి సంతోషించింది.

"ఎంత ఆలోచ్యలు" అన్నది మురిపెంగా.

"ఏమిటి?" అని మోహన్ ఆదుర్దాగా అడిగాడు.

"వివాహం చేసుకునే స్త్రీకి ఇలాంటి సత్యాలు తెలియనిస్తారా?" అన్నది.

"మరి నీయిష్టం" అన్నాడు మోహన్.

"నా కెప్పుడూ ఇష్టమే" అన్నది లీల

ఈ సంభాషణ ఎప్పుడూ లీలకి మనస్సులో మెదులుతూనేవుంది. అందుకనే, ఇంటికి రాగానే కుటుంబం క్లుప్తంగా జరపాలని సంకల్పించుకొని మోహన్‌తో మాట్లాడుతుంది.

"నీయిష్టం" అన్నాడు మోహన్. "ఇద్దరం—మనకి జరగదా?" అని చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వు లీల అర్థం చేసుకుంది. మోహన్‌కి పిల్లలంటే ఇష్టంలేదు. తనకూ పిల్లలు కావాలని లేదు. గంపెడు పిల్లలని పెట్టుకుని, సంసారం యీదలేక, చీదరించుకుంటూ బ్రతికే దంపతులను ఆమె అనేకమందిని చూచింది. ఎందుకనో కళకు, పిల్లలకు పడదని ఆమెనమ్మకం. మోహన్‌ని - తనమోహన్‌ని- కళోపాసకుడైన మోహన్‌ని పిల్లలతండ్రిగా ఆమె ఊహించుకోలేకపోయింది.

మోహన్ తన్మయత్వంతో చిత్రం గీసుకుంటూ వుంటాడు. చిన్న కొడుకు 'నాన్నా' అంటూ దగ్గరకు వెడతాడు. మోహన్ ఉలిక్కిపడి ఏదో లోకం లోనుంచి క్రిందికి చూసినట్టు చూస్తాడు. కొడుకు "కాసీ" అంటాడు.

కూతురు వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు; ఎప్పుడు పూర్తిఅవుతుందా అనే తహతహతో వుంటాడు. "నాన్నా" అంటుంది కూతురు. కుంచె చేత్తో పట్టుకుని మోహన్ తిరిగి చూస్తాడు. "ఎత్తుకో" అంటుంది కూతురు.

తను వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు. "మోహన్, నా మోహన్" అని పిలుస్తుంది. అతను ఆశగా తిరిగి చూస్తాడు. తనని చూచి నిర్విణ్ణుడౌతాడు. తను తనుగా లేదు. ఇప్పుడు పిల్లలతల్లి. సౌందర్యం నశించింది, యౌవనం సడలింది, శరీరం ముడతలు పడింది.

"ఎవరు నువ్వు?" అంటాడు మోహన్.

"నీ లీలని" అంటుంది తను.

"కాదు, కాదు" అంటాడు మోహన్. చేతు లోని కుంచె జారవిడుస్తాడు. ప్రక్కనున్న కుర్చీలో కూలబడతాడు.

"వొద్దు, పిల్లలు వొద్దు" అనుకుంది లీల, పైకి వినంగా ఊహించుకుని.

అప్పటినుంచీ లీల ఇల్లు కదలదు. షికారు వెళ్ల దు. ఆప్తులను కూడా చూడదు. ఎప్పుడూ మోహన్ పరసనే వుండేది. చిత్రరచనకు కావలసిన వన్నీ అమర్చి పెట్టేది. అతని కే యిబ్బందీ కలగకుండా చూస్తూవుం డేది. తనకి సొంత జీవితమనేదే లేకుండా చేసుకుంది. మోహన్ జీవితమే తన జీవితం.

ఈ విధంగా రోజులు గడుస్తున్నై. మోహన్ చిత్రాలమీద చిత్రాలు గీస్తున్నాడు. ఎప్పుడూ లీల అతని ప్రక్కనే వుండాలి. లీల లేకపోతే అతనికుం చె నడవదు. ఆమె వొక్క క్షణం కనిపించకపోతే పిచ్చి వాడిలాగ 'లీలా, లీలా' అంటూ వెతికేవాడు.

అతను తనకోసం ఇంత తపించిపోవటం లీల మనస్సుకి అమిత ఆనందాన్ని కలిగించేది. తన సౌం దర్యం మోహన్ చేత అనేక చిత్రాలు గీయించటానికి కారణభూతం అయినందుకు ఆమెశరీరంలోని ప్రతి అణువూ గర్వించింది.

"నా పిచ్చి మోహన్! నేను లేకపోతే ఏమైపోయే వాడివో" అని ముంగురులు సవరించేది.

"నీవు లేనివాడు ఈ మోహన్ లేడు" అనే వాడు మోహన్.

ఆమాట ఆమెహృదయాన్ని ఎంత కదిలించే దని! మళ్లీ మళ్లీ ఆమాటే అతనితో చెప్పించుకొని వినాలని ఉవ్విళ్లూరేది.

సాధారణంగా వారు ప్రతిసాయంకాలమూ పెరటిలో వున్న జాజిపూపొదరింటిలో కుర్చీలు వేసు కుని కూర్చునేవారు. అటువంటి సమయాల్లో పునుగు, జవ్వాది, మంచిగంధం మొదలైన పరిమళద్రవ్యాలు వెంట తీసుకురావటం అతనికి అలవాటు. ఆ పరిమళ ద్రవ్యాలను పదిలంగా ఆమెప్రక్కన వుంచి, చక్కగా విచ్చిన సన్నజాజుల నిన్ని పుణికి ఆమెతలలో తురిమే వాడు. సుగంధద్రవ్యాలను ఆమెకంఠసీమకు రాసి తన చేతుల కింత పట్టించుకొనేవాడు. ఆ మత్తె క్కించే సువాసనల్లో ఆమెకు పుస్తకాలు చదివి విని పించేవాడు. ఆ పుస్తకాలామెకి అర్థమయేవి కావు. అతను మునివేళ్లతో పేజీలు త్రిప్పటంమాత్రం ఆమెను ప్రబలంగా ఆకర్షించేది.

అతను మధ్యమధ్య "ఓహో, ఏమి మహోన్నత భావాలు" అనేవాడు. ఆమె 'అవును' అనేది, అతని మునివేళ్లవంక చూస్తూ.

"లీలా, ఇలా చదువుకుంటూ, చిత్రాలు గీసు కుంటూ ఒకరికొంత వొకరు ప్రపంచంలో వున్న కీచు లాటల కతీతంగా జీవించటంకంటే ఇంకేం కావాలి?" అనేవాడతను.

'అవును' అనేది లీల, అతని మునివేళ్లవంక చూస్తూ.

"లీలా, మనం ఆదర్శదంపతులం కామా? ఎంత అదృష్టవంతులము" అనేవాడు మోహన్ ఆమెను తన కౌగిలిలోకి తీసుకుంటూ.

ఆక్షణం ఆమెకు స్వర్గలోకంలో మందాకినిలో స్నానం చేసినట్టు వుండేది. కాని, మరుక్షణమే లోపలనించి ఏదో ఆవేదన - అసంతృప్తి పుట్టుకొ చ్చేవి. అలా అసంతృప్తి కలగటం తన లోపమే అను కొనేది లీల. మోహన్ వెదుకుతున్న స్థాయిని తను అందు కోలేక పోతున్నందుకు తన్నుతాను నిందించుకొనేది.

వెంటనే ఆమెకు కుటుంబపరిస్థితులు జ్ఞాపకం వచ్చేవి. ఊళ్లో వున్న కళాజీవులందరూ మోహన్ చిత్రాలను పొగడేవారే. కాని, అతని చిత్రాలను కొనే వాళ్లెవరూ కనిపించరు. ఎవరో ఒకరు తప్పకుండా వస్తారనుకొనేది లీల. "ఎక్కడో ఒక రసహృదయుడు వుండి వుండకపోతాడా, ఎప్పటికో వొకప్పటి కతను రాకపోతాడా" అని నిరీక్షిస్తూవుండేది లీల.

ఒకనాడు అతను రానేవచ్చాడు. తన కొక చిత్రం వ్రాసిపెట్టమని మోహన్ని కోరి వెళ్లిపోయాడు

మోహన్ ఆ చిత్రరచనకి పూనుకున్నాడు. తన చాతుర్యాన్నంతా చూపి గొప్ప చిత్రాన్ని సృష్టిస్తానన్నాడు లీలతో. లీల చిత్రం త్వరగా పూర్తి చెయ్యమని తొందరపెట్టింది. ఎక్కడ ఆలస్యమై పోతుందో అనే భయంతో అతనికి కావలసిన వస్తువులన్నీ అడగకుండానే అందించేది. రంగులు నిండుకుంటున్నై. కుంచెలు మారిపోతున్నై. క్రమక్రమేణా చిత్రం మానవాకృతిని దాల్చింది. ఆచిత్రాన్ని చూచుకొని మోహన్ ఉప్పొంగిపోయాడు. ఆ చిత్రంలో తాను స్ఫురింపజేసిన భావాలను లీలకు విప్పిచెప్పేడు. ఆమెకుకూడా అదొక బ్రహ్మాండమైన కళాఖండంగా కనిపించింది. ఇద్దరూ ఆనందపరవశులయ్యారు.

మర్నాడు ఆచిత్రం వ్రాయమని కోరిన పెద్ద మనిషి వచ్చాడు. మోహన్ అతనికి చిత్రం చూపించాడు. అత నేమంటాడో అని ఆతురతగా చూస్తూ నుంచుంది లీల. ఆ పెద్దమనిషి చిత్రాన్ని పరిశీలించి చూచాడు.

"అబ్బే" అని చప్పరించాడు.

"ఏమిటి?" అని అడిగాడు మోహన్. అతనికి ప్రపంచం అంతా గిర్రుమని తిరుగుతూవున్నట్లనిపించింది.

"ఇదేం బొమ్మ?" అన్నాడు పెద్ద మనిషి.

"ఏం?" అని అడిగాడు మోహన్.

"నేను వ్రాయమన్నది ఇలా కాదు" అన్నాడు పెద్ద మనిషి.

మోహన్‌కి కోపం ఎక్కువ అయింది. "ఈ సంస్కారం లేనివాడు వ్రాయమనటం, తను వ్రాయటమూనా?" అనిపించింది. అతను వ్రాయమన్నట్టు తను వ్రాయనందుకు లీలగా సంతోషం కలిగింది.

"నా ఇష్టం వచ్చినట్టు నేను వ్రాశాను" అన్నాడు.

"అయితే బొమ్మ మీరే వుంచుకోండి" అన్నాడు పెద్ద మనిషి.

"సరే, మీరు వెళ్లండి" అన్నాడు మోహన్.

ఆ పెద్దమనిషి గబగబ వెళ్లిపోయాడు. లీలకి ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే నిర్విణ్ణురాలై చూస్తూ నిలబడింది.

అతను వెళ్లిపోగానే మోహన్ కోపోద్రేకంతో వొళ్లు మరిచిపోయాడు. "మూర్ఖులు, సంస్కారశూన్యులు, కళాదరిద్రులు." అని ఏమేమో గొణుక్కోటం మొదలుపెట్టాడు. లీలమొహం చూడలేకపోయాడు. లీల హృదయం ముక్కలై వుంటుందని అతనికి తెలుసు. ఆమెముఖంలో తాండవించే నిరాశను చూడటానికి అతనికి భయం వేసింది. బయటికి వెళ్లిపోయాడు.

చేతనారహితంగా నిలబడిపోయింది లీల. ఎంతసేపు అలా నిలబడిందో ఆమెకే తెలియదు. తాము అహోరాత్రాలు కష్టపడి పూర్తిచేసిన చిత్రం ఎదురుగుండా కనిపిస్తోంది. తన వంకకే చూస్తున్నట్టుంది. ఆ చిత్రాన్ని తయారుచెయ్యటానికి తాము ఉపయోగించిన రంగులూ, కుంచెలూ అక్కడే వున్నాయి; తన వంకకే చూస్తున్నాయి. మోహన్‌చేత గొప్ప చిత్రాన్ని వ్రాయించటానికి తాను పడిన శ్రమతో ఆ గది వుడికిపోతూవుంది. ఆ గదిలోని ప్రతివస్తువూ ఆ సంగతే చాటిచెపుతూవుంది. ఆమె అక్కడ నిలబడలేకపోయింది. భారంగా అడుగులు వేసుకుంటూ కిటికీ దగ్గరకు నడిచింది. ఆకాశంకేసి చూచేసరికి మబ్బులు కమ్ముకున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్లాలనిపించింది. ఎన్నడూ లేనిది ఇప్పుడిలా ఎందుకనిపించింది! ఆలోచించింది. ఒక్కసారి తన జీవనం అంతా జ్ఞాపకంవచ్చింది లీలకి. తన జీవితం అంతులేని అఘాతంగా కనిపించింది. తల్లీ, తండ్రీ, అన్నా, చెల్లెలూ అంతా జ్ఞాపకంవచ్చారు.

"అమ్మా, నువ్వు చిన్నదానవు, నా మాట విను" అన్నాడు తండ్రి.

"ఆయనమనస్సు వెన్నపూస, నాన్నా" అన్నది తను.

"అది సుగుణం కాదమ్మా. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవటంవల్ల వచ్చే బలహీనత" అన్నాడు తండ్రి.

"చూడు, నాన్నా, వారికి ఆడవాళ్లంటే ఎంత భక్తోను" అన్నది తను.

"ఆడవాళ్లంటే భక్తేమిటమ్మా!" అన్నాడు తండ్రి.

"కాదు, నాన్నా. స్త్రీలంటే వారికి ఎంతో గౌరవం. ఎంత మెత్తగా, ఆహ్లాదకరంగా మాట్లాడతారు" అన్నది తను.

"అందరి స్త్రీలనూ ఒకేరకంగా చూడగలిగిన వాడు భార్యను సుఖపెట్టలేడు, తల్లీ" అన్నాడు తండ్రి.

ఇప్పుడు తన తండ్రిమాటలు నిజమేనేమో అనిపించింది లీలకి. మోహన్ గీసిన చిత్రాలు చూడటానికి అనేకమంది ఆడవాళ్లు వస్తూవుండేవారు. వాళ్ల అందరితోనూ తనతో వుండేటట్టుగానే చాలా చనువుగా వుండేవాడు మోహన్. వాళ్లందరికీ పునుగు, జవ్వాది, మంచిగంధం ఇస్తూవుండేవాడు. సన్నజాజి పువ్వులు కోసి, దండలుగా గుచ్చి వాళ్లకి ఇస్తూవుండేవాడు. మోహన్‌దృష్టిలో తనూ, తక్కిన స్త్రీలూ ఒకటేనా? భేదం లేదూ? తనమీద ప్రత్యేకంగా ప్రేమలేదూ మోహన్‌కి? స్త్రీలని ఆరాధించటం అతని స్వభావం. తనని ఆరాధించటానికి కూడా ఇదేనా కారణం? తన ప్రత్యేకత కాదూ? తన సౌందర్యం కాదూ? తన బుద్ధికుశలత కాదూ? పోనీ, తన భక్తిఅయినా కాదూ?

ఈ ఆలోచనలతో ఆమె హృదయంలో తుపాను లేగింది. చూపులు వీధివైపు మరలించింది. వీధిలో స్త్రీలూ, పురుషులూ గందరగోళంగా ఇటూ, అటూ పరిగెత్తుతున్నారు. ఆమెకంతా కొత్తగా కనిపించింది. మోహన్‌తోపాటు ఊహాసౌధాలలో నివసిస్తున్న ఆమెకి ప్రపంచమే కొత్తదైపోయింది. అటు చూడలేక మొహం మరోకవైపు త్రిప్పింది. అక్కడ కొంతమంది పిల్లలు ఆడుకుంటున్నారు. తనూ, మోహన్ పిల్లలు కలగకూడదని చేసుకున్న నిశ్చయం జ్ఞాపకంవచ్చింది. వెంటనే తన స్నేహితురాలు విమల తలపుకివచ్చింది.

విమల తన చిన్ననాటి స్నేహితురాలు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఒకసారి తన వివాహమైన తరవాత తనని చూడిపోదామని వచ్చింది. విమలని చూస్తే తనకి ప్రాణం లేచివచ్చింది. ఆమెకు మోహన్ గీసిన చిత్రాలన్నీ చూపించింది. మోహన్‌యొక్క గొప్పతనాన్ని గురించి చెప్పింది. అతని ఉన్నతభావాలను పొగిడింది. విమల అన్నీ విని, "సరే, మరి నువ్వేం చేస్తున్నావు?" అని అడిగింది.

"నేనా...?" అని తబ్బిబ్బుపడ్డది తను. ప్రత్యేకం తనేమీ చెయ్యటం లేదనీ, ఏదో కొకటి చెయ్యవలసిన బాధ్యత తనమీద వున్నదనీ అప్పుడు తెలిసింది తనకి.

"ఏమీ చెయ్యటం లేదు" అన్నది తను.

"ఎందుకని?" అని అడిగింది విమల.

"మోహన్ నేను ప్రక్కన లేనిదే చిత్రాలు వ్రాయలేడు." అన్నది తను.

"అదేమిటి లీలా? నువ్వు చదువుకున్నదానివి. నీకుమాత్రం నీ సొంతజీవితమనేది వుండక్కర్లా?" అన్నది విమల.

"నాకు అవసరం అనిపించటం లేదు. మోహన్‌కి సహాయం చెయ్యటంలోనే నాకు ఆత్మానందం కలుగుతోంది." అన్నది తను.

ఈ మాటకి విమల తనవైపు వింతగా చూసింది. ఆ చూపులు ఇప్పటికీ తనని వెన్నాడి, ములుకులుగా గుచ్చుకుంటున్నై. విమల సంఘసేవ చేస్తూవుందట. సంఘంలో స్త్రీలూ, బీదవాళ్లూ పడుతున్న కష్టాలను గురించి, వాటి నివారణోపాయాలనుగురించి గంటసేపు మాట్లాడింది. "పురుషుడికి బానిసగా వుండటం కాదు, స్త్రీకి సొంతజీవితం వుండాలి. స్త్రీకూడా మనిషే. ఆమెకూ సొంత ఆలోచనలూ, సొంత ఆవేదనలూ వుంటాయి. అవి తీర్చుకోవాలి" అని చెప్పింది. చివరకి వెడుతూ వెడుతూ "మీ మోహన్ చాలా స్వార్థపరుడుగా కనిపిస్తున్నాడు లీలా. ఎంతసేపూ తన సుఖమే కాని నీ సంగతి ఆలోచిస్తున్నట్టే లేదు" అన్నది విమల.

"అయ్యో, వారి నలా అనకు" అన్నది తను.

"మరి ఆయన చేస్తూన్న పనేమిటి?"

"వారు నన్ను చెయ్యమన్నారా? నాకు ఇష్టమయే చేస్తున్నాను."

"నీకు ఇష్టంఅయితేమాత్రం? ఆయన తెలిసినవాడుగదా, నీకు తెలియచెప్పవలసిన బాధ్యత ఆయన మీద లేదూ?"

లీల ఆలోచించింది. తనకు సొంతజీవితం అనేది లేదా? విమలమాటల్లో ఎంతవరకు సత్యం వుంది? తనకు సొంతజీవితం లేకపోవటం ఏమిటి? మోహన్‌కి ఉత్సాహం కలిగించి అతనితో గొప్పగొప్ప చిత్రాలు గీయించటం, ఘనకార్యాలు చేయించటం అదే తన జీవితం. ఒకరికి సహాయం చెయ్యకుండా ఎవరికి వారే ఒక చిన్న ప్రపంచాన్ని సృష్టించుకొని కూచుంటే, ప్రపంచంలో సఖ్యత ఎలా వుంటుంది? సహకారం ఎలా కుదురుతుంది? అభివృద్ధి ఎలా జరుగుతుంది? మరి తన కెందుకీ అసంతృప్తి? ఎవరిమీద? దేనికోసం? తనమీద తనకే కాదుగదా. ఇదివరకు ఉత్సాహం, ఆనందం ఇచ్చే విషయాలు ఇప్పుడు తన కెందు కివ్వక పోవాలి? తప్పు ఎవరిది? తనదా, మోహన్‌దా? మోహన్ తప్పేమి వుంది? ఎంత వితర్కించుకున్నా, అతని తప్పు కనిపించటంలేదు. తన్ను మొదటినుంచీ ఎంత ఆప్యాయంగా, ప్రేమగా చూస్తున్నాడో, ఇప్పుడూ అదేవిధంగా చూస్తున్నాడు. అతనిలో రవ్వంత మార్పుకూడా లేదు. అవే ఆలోచనలు...అవే మాటలు...అవే చర్యలు...అదే దృష్టి...ఇక అతని తప్పేమి వుంది? పోనీ, తనుమాత్రం ఏం చేసింది? మోహన్ని సంతోషపెట్టటానికి తనకు చేతనయినంతవరకూ ప్రయత్నిస్తూనేవుంది. అతన్ని ఇంకా గాఢంగా ప్రేమిస్తూనేవుంది. కాని, ఇదివరకు తన్ను అంతగా కదిలించిన మాటలు ఇప్పు డెందుకు కదిలించలేకపోతున్నై? ఇదివరకు అతడు చెంతన కూర్చుంటేనే పరవశత్వం కలిగేది. ఇప్పుడు విసుగుపుడుతూవుంది. అతని మాటల్లోని మెత్తదనం మొహం మొత్తుతూవుంది. కొంచెం గట్టిగా, దర్జాగా ఎందుకు మాట్లాడడు? ఆయనకు కోపం వొస్తే చూడాలనిపించేది తనకి. ఆయన కేకలు వేస్తే ఎలా వుంటుంది?

తన వివాహానికి ముందు తను తన స్నేహితురాండ్రతో వున్నప్పుడు ఆయన వొచ్చి, తన సరసన కూర్చొని మాట్లాడుతుంటే తన కెంతో గర్వంగా వుండేది. ఇప్పుడు ఇతరుల ఎదట ఆయన తనదగ్గరగా ఉంటేనే సిగ్గుగా, ఎల్లాగో ఉంటూవుంది. ఎందుకని? వాళ్లేమన్నా అనుకుంటారనా? ఇదివరకు ఇతరులు అలా అనుకోవటం గర్వకారణంగా ఉండేది. ఇప్పుడు ఎందుకని?

తాను మారిందా? మారటానికి అతడు ఆర్జింపకపోవటం కారణమా? ఆర్జన లేకపోవటం అనేది ఆయనకూ వున్న బాధేగా. కాని ఆయన బాధపడుతున్నట్లు కనపడడు.

పోనీ, విమల చెప్పినట్లు సంఘసేవ చేస్తే? అప్పుడు తన మోహన్ ఏమవుతాడు? తాను ఇప్పటికి మల్లే ప్రేమించగలుగుతుందా? ఒకవేళ ప్రేమించలేకపోతే? ఒక్కసారి ఆమెకు జీవితం ఎడారిగా కనిపించింది. అనేక ఊహలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆమె హృదయం అకస్మాత్తుగా శూన్యం అయింది. మోహన్ని - తన మోహన్ని ప్రేమించలేకపోవటమే!

"లీలా?"—ఎవరి దాపిలుపు? ఎక్కడ విన్నది ఆపిలుపు? అజంతా - హంపీ - శ్రీరంగం - కంచి - మధుర - ఎల్లోరా.

మోహన్ గదిలోకి వొచ్చాడు. ఏదో ఆతురతగా చెప్పబోయాడు. ఆమెకళ్లల్లో అశ్రువులు చూశాడు.

"ఇదేమిటి?" అని అడిగాడు.

"ఏమీ లేదు" అన్నది లీల.

వెంటనే రహస్యాలు ఉంచుకోగూడదని తాము చేసుకున్న నిశ్చయం జ్ఞాపకంవచ్చింది. కాని ఏమని చెపుతుంది?

సేలందొరలు అణచిన 'రాజద్రోహము'

= శ్రీ దిగవల్లి వెంకటశివరావు =

"తాము స్నానముచేయు చెరువులలోని నీటినే త్రాగు నీ భారతీయులు రాజకీయస్వాతంత్ర్యమును పొందుటకు అర్హులు కారు" అని ఈ దేశమునకు 1885-1888 మధ్య వైస్రాయిగా నుండిన డఫ్రిన్ ప్రభువు ఒక యుపన్యాసములో పలికినాడు.

1881 నవంబరు 5 మొదలు 1886 డిసెంబరు 8 వఱకును మద్రాసురాజధానికి గవర్నరుగా నుండిన మౌంట్ స్టూవార్టు గ్రాంట్ డఫ్ గారు తనకు భారతీయులు సమర్పించిన యొక వినతిపత్రమునకు ప్రత్యుత్తరమొసగుచు "రాజకీయహక్కులను కోరుటకు ముందుగా ఈ భారతీయులు తమ ఇండ్లవెనుక నుండు పెరళ్లను శుభ్రముగా నుంచుట నేర్చికొనవలె"నని వైస్రాయిగారి కంటెను మోటుగా చెప్పినాడు.

ఈ గవర్నరుగారే తమ కార్యాలోచనసభలోని యొకరిద్దరి సలహాతో, సేలములో నొక మసీదుప్రక్కనుండి యూరేగింపులు పోవు విషయమై హిందువులకును, మహమ్మదీయులకును కలిగిన యొక పనికిమాలిన తగాదాను గోరంతలు కొండంతలుగా చేసి 'అది యొక రాజద్రోహకరమైన తిరుగుబాటు' అని దాని కొక పెద్దపేరుపెట్టి, ఒకమూల ఆ తగాదాలనుగురించి విచారణ జరుగుచుండగాను, ఆ సందర్భములో జరిగిన కొట్లాటకు మద్దతుచేసిరను నేరారోపణ చేయబడి కొంద రందరకు న్యాయస్థానములో విచారింపబడుచుండగాను, ఏదో కొంపమునిగిపోయినట్లు ఇతరుల కపోహ కలిగింపగల యుపన్యాసము లిచ్చి సేలముకేసులను విచారించుటకు ఒక ప్రత్యేక స్పెషల్ మేజిస్ట్రేటును, ఒక స్పెషల్ సెషన్సుజడ్జిని నియమించినాడు. దీని ఫలితముగా చాలామంది దురదృష్టవంతులు అరెస్టు చేయబడి శిక్షింపబడి కారాగారములకు, యావజ్జీవ ద్వీపాంతరవాసమునకు అండమాను ద్వీపమునకును పంపబడిరి.

ఈ ఖైదీలలో నొక్కడును నేరము చేయుచుండగా పట్టుకొనబడినవాడు కాడు. స్పెషల్ మేజిస్ట్రేటును, స్పెషల్ పోలీసువారును వేసిన పథకము (ప్లాను)ను బట్టి వారిపైన నేరారోపణముచేయబడి వారు అరెస్టుచేయబడిరి. పోలీసువారి కిష్టమువచ్చినవారిని పట్టుకొనుటకు వీలుగా అరెస్టుచేయవలసినవాని పేరు వివరింపకుండగనే జిల్లామేజిస్ట్రేటు సంతకముచేసి యిచ్చిన ఖాళీఅరెస్టువారంటు నమూనాఫారములను (Blank warrants) పుచ్చుకొని అందులో తమ యిచ్చవచ్చినవారి పేళ్లను నమోదుచేసి కొందరిని అరెస్టుచేసిరి ! సేలముపట్టణము అల్లకల్లోలముగా నుండెను. చాలమంది భయోత్పాతమునను, దుఃఖమునను మునిగిరి. ఖాళీఅరెస్టువారంటు పత్రములలో తమ పేళ్లను వ్రాసి తమ్ము అరెస్టుచేసిపోదురేమో అను భయముతో చాలామంది పట్టణములోని తమ గృహములను వదలిపెట్టి వెళ్లిపోయిరి.

చెన్నపట్టణములో అప్పటికి 5 సంవత్సరముల క్రిందటనే స్థాపింపబడిన "హిందూ"పత్రిక ఈ సందర్భములలో న్యాయసిద్ధికొరకు అపారమైన సేవ చేసినది. సేలంలో జరిగిన సంగతుల వివరముల నతిధైర్యముతో ప్రకటింపసాగినది. సెషన్సుకోర్టులో శిక్షింపబడినవారు హైకోర్టుకు అప్పీలుచేయగా హైకోర్టు వారుకూడ పొరపాటు అభిప్రాయముతో ఆ శిక్షలను ఖాయముచేసిరి. అంతట సేలములోనుండి నలుగురు పెద్దమనుష్యులు బయలుదేరి చెన్నపట్టణమునకు వచ్చి రెండు సంవత్సరములపాటు ఎంతో కష్టపడి తమ ధనమును, కాలమును వినియోగించి లోగడ జరిగిన అన్యాయములనెల్ల వెల్లగించి అసత్యపు సాక్ష్యములను ఖండించి హిందూమహమ్మదీయుల కొట్లాటకు తరువాత జరుపబడిన అక్రమచర్యలలోని యన్యాయమునంతయు బయటికిదీసిరి.

ఈ నలుగురిలో ముగ్గురు సేలంలోని న్యాయవాదులు. అందులో సుప్రసిద్ధదేశభక్తులును, కాంగ్రెస్ అధ్యక్షులును, కీర్తిశేషులును అయిన శ్రీమాన్ సేలం విజయరాఘవాచార్యులుగారొకరు. నాలుగవ యాయన "జరుగబోవు తిరుగుబాటు" విషయమై కలెక్టరు గారికి ముందుగా హెచ్చరింపలేదను నెపముపైన పెద్ద పనిలోనుండి తొలగింపబడిన ఒక భారతీయ ప్రభుత్వోద్యోగి. ఈ నలుగురు పెద్దమనుష్యులును తమతమ స్వంత పనుల నన్నిటిని మానుకొని రెండేండ్లపాటు తమ ధనమును, కాలమును, శక్తినికూడ వినియోగించి ఈ ఘోరమైన అన్యాయమంతయు అప్పటి స్పెషల్ మేజస్ట్రేటుగారైన లూయిస్ మెక్రైవర్ దొరగారి స్వకపోల కల్పనమని రుజువుచేయగలిగిరి. పై వ్యవహారములో న్యాయము జరిగించవలెనని ఆ నలుగురును ప్రారంభించిన ఆందోళనమునకు హిందూపత్రికాధిపతియైన శ్రీ జి. సుబ్రహ్మణ్యఅయ్యరుగారును, వ్యవస్థాపకుడును సహాయపడినారు. హిందూపత్రిక చివరవరకు నీయాందోళనమున కెంతో ధైర్యముతో తోడ్పడినందు వలననే ఇది సఫలమైనది.

1880 మొదలు 1884 వరకును భారతదేశమునకు వైస్రాయిగా నున్న రిప్పన్ ప్రభువు చాలగొప్పవాడు. అన్యాయములకు సహింపడు. న్యాయస్థానముల తీర్పులకును, స్థానిక ప్రభుత్వమువారి యభిప్రాయమునకును భిన్నమైన నిర్ణయమునకు వచ్చుటకు రిప్పన్ ప్రభువు కూడ మొదట ఇష్టపడలేదుగాని క్రమక్రమముగా బయల్పడిన సంగతులవలన ఈ వ్యవహారములోని యథార్థమంతయు ఆయనకు అవగతము కాగా, ఆయన న్యాయము జరిగించదలచి సేలము ఖైదీల నందరిని వదలి పెట్టవలసినదని మద్రాసుప్రభుత్వమువారిని కోరినాడు. కాని ఇట్లు చేయుట తమకు పరువుతక్కువగా నెంచి మద్రాసుప్రభుత్వమువారీ ఖైదీలను విడుదలచేయలేదు. అంతట రిప్పన్ ప్రభువు ఆ ఖైదీలను వదలవలసినదని మఱియొకమారుకూడ వారిని హెచ్చరించెను. అయి నప్పటికిని గూడ వారు విడుదలచేయరైరి. ఇంతలో రిప్పన్ ప్రభువు ఉద్యోగకాలము పూర్తియై సీమకు పోవు తరుణ మాసన్నమయ్యెను. అప్పు డాయన ఈ సేలముఖైదీల నందరను వెంటనే వదలిపెట్టనియెడల తా నింగ్లాండుకు పోవగనే ఈ యన్యాయమునుగురించి విక్టోరియామహారాజ్ఞికి స్వయముగా విన్నవించి ఆమె చేతనే విడుదలచేయించెద నని మద్రాసుప్రభుత్వము వారికి ఖండితముగా వ్రాసినాడు. ఇది యొక బ్రహ్మాస్త్రమువలె పనిచేసినది. చెన్నపట్టణప్రభుత్వమువారు గత్యంతరము లేక 1884 వ సం. నవంబరు 26 వ తేదీన ఈ సేలంఖైదీల నందరను వదలిపెట్టిరి.

రిప్పన్ ప్రభు వీవిషయమున స్వయముగానే చర్య దీసికొని ఖైదీలను విడుదలచేయించుట కధికార మున్నప్పటికిని క్రిమినలున్యాయస్థానముల తీర్పులవిషయమున స్థానికప్రభుత్వమే చర్యదీసికొనట న్యాయ మను అభిప్రాయము కలవాడైనందువల్లనే మద్రాసు ప్రభుత్వమువారి నిట్లు పలుమారు కోరినాడు. ఎట్లయిన నేమి, రిప్పన్ గారివలననే ఈ విషయములో న్యాయము జరిగినది. *

హిందూపత్రికకు విలేఖరిగా సేలమునకు వెళ్లిన శ్రీ పి. కేశవపిళ్ల గారు సేలములో జరిగిన సంగతులను గురించి ఇట్లు వ్రాసిరి:

సేలములో హిందువులును, మహమ్మదీయులును ఒక క్రొత్తమశీదుదగ్గరనుండి ఊరేగింపులు పోవుటవిషయమై పోరాడుకొనిరి. అప్పుడక్కడ జిల్లామేజస్ట్రేటుగా నుండిన డాక్టర్ మెక్లీన్ ఎం. ఏ., ఐ. సి. ఎస్. గారు చేసిన కొన్ని పొరబాటులవలన నీపోరాట మొక కొట్లాటగా పరిణమించి దొమ్మిజరిగినది. అప్పుడు మద్రాసు గవర్నరుగానుండిన మౌంట్‌స్టూవార్టుగ్రాంట్ డఫ్‌గారును, ఆయన కార్యాలోచనసభలోని సభ్యుడైన కార్మయికేల్ గారును, పూర్వము 1857 వ సం. సిపాయిల విప్లవానంతరము బ్రిటిషుప్రభుత్వముపట్ల భారతీయులకు భయభక్తులు కలిగించుట కనేకఘోర కృత్యములను, అత్యాచారములను చేసిన దొరలవలెనే,

---

* The Hindu Golden Jubilee Number 1928, p 13-Article by Sri C. Vijayaraghavachariar.

ఈ సేలములోని ప్రజలకు ప్రభుత్వముపట్ల భయభక్తులు కలిగింపదలచిరి.

అంతకుముందు ఇంగ్లీషువారు బర్మాదేశమును పూర్తిగా స్వాధీనపరచుకొనుటలో ఇంగ్లీషుసైన్యములు 'థీబా'ను పట్టుకున్న తరువాత వారి నడ్డగించిన బర్మావారి నందరిని ప్రభుత్వవిరోధులైన దారిదోపిడిగాండ్రుగా ప్రకటించి వారిపైన నట్టి నేరము వారోపించి వారిని పట్టుకుని విచారించి కఠినశిక్షలు విధించుటలో గొప్పపేరుపొందిన మెక్లైవర్ ఐ. సి. ఎస్. గారిని సేలమునకు స్పెషల్ మేజస్ట్రేటుగా రప్పించిరి. ఈ మెక్లైవర్ గారును, ఇతని స్నేహితుడైన సేలముజిల్లా మేజస్ట్రేటుగారును కూడ న్యాయశాస్త్రవిధుల ననుసరించు పిచ్చిపని పెట్టుకొనదలచుకొనలే దని ప్రారంభముననే స్పష్టముగా ప్రకటించివేసిరి. అవసరమైనప్పుడు ఎవరిని పట్టుకొనవలె నన్న వారి పేరు నుదాహరించుటకు వీలుగా పేరువ్రాయుటకు ఖాళీస్థలము వదలిన "బ్లాంక్" అరెస్టువారంటు "ఫారము"లపైన సంతకములు చేసి జారీచేసిరి. చిత్తూరునుండియు, ఇతర చోటులనుండియు రప్పించిన స్పెషల్ పోలీసు అధికారులు ఆ ఖాళీవారంటుపత్రములలో తమ కిష్టము వచ్చినవారి పేళ్లను వ్రాసి పూర్తిచేసి అమలు పరుపసాగిరి. ఇట్లు అసంఖ్యాకులైన పెద్దమనుష్యులను పట్టుకొనుటలో సేలముజిల్లావైద్యాధికారియు, క్రైస్తవుడు నైన మాణిక్యముపిళ్ల గారినికూడ వారు పట్టుకొనిరి. ఆయన చాల స్థూలకాయుడు. ఈ పెద్ద మనుష్యుని పట్టుకొని నేరస్థునిగా విచారించి శిక్షించిన రౌడీల ఈ దేశీయుల కంటికి నజరుగా కనపడి వారికి బుద్ధివచ్చునని ఈ యధికారులు తలచిరి! అదివరకు మలబారులో జిల్లాజడ్జిగా పనిచేసిన వైగ్రాం(Wigram) గారిని సేలములో స్పెషల్ సెషన్సుజడ్జిగా నియమించిరి. అంతట ఆయన దగ్గర సేలందొమ్మికేసుల విచారణ ప్రారంభమైనది. నేరారోపణము చేయబడిన వారిలో చాలమంది గొప్పవా రుండిరి. సేలములో నొకదానివెంబడి నొకటిగా జరిగిన వింతవిషయములును, న్యాయపరిపాలనమునందు చూపవలసిన నిష్పాక్షపాతబుద్ధి చూపబడకపోవుటయు దేశప్రజలకు భయాశ్చర్యములు కలిగించెను. సేలములోని పరిస్థితులను గూర్చి హిందూపత్రిక విచారించి తనకు తోచిన సంగతులను నిర్భయముగా వ్రాయసాగినది. సేలమునకు స్వయముగా పోయి అక్కడి పరిస్థితులను హిందూపత్రికకు వ్రాయుటకై యందులకు నుత్తిలో న్యాయవాదిగా నున్న శ్రీ పత్తి కేశవపిళ్ల గారు విలేఖరిగా వెళ్లిరి.

"గన్ షాట్" (తుపాకిగుండుదెబ్బ) అను మారుపేరుతో హిందూపత్రికలో ప్రకటింపబడిన లేఖయొకటి ఐ. సి. ఎస్. ప్రభుత్వ-ఉక్కు-చట్రమునకు దిగ్భ్రమను కలిగించెను. జిల్లామేజస్ట్రేటుగారైన మెక్లీన్ ఎం. ఏ., ఐ. సి. ఎస్. గారు సేలములో హిందూమహమ్మదీయ వైరమువలన ఘోరములు జరుగుచుండగా "నీపట్టణము గతి ఏమైన నేమి! దాని కర్మ"మని వదలిపెట్టి బెంగుళూరువెళ్లి అక్కడ గుఱ్ఱపుపందెముల వినోదములందు పాల్గొనినాడనియు, అంతకన్న అన్యాయమైన విషయమేమనగా తాను బెంగుళూరులో నున్నకాలములో తాను సేలముజిల్లాలోని హొసూరు మకాములోనే ఉన్నట్లుగా ప్రయాణపుబత్తెమును పుచ్చుకొన్నాడనియు ఆలేఖలో వివరింపబడియుండెను. ఇది అసత్యపు వ్రాతయే యైయుండినచో ఐ. సి. ఎస్. ఉద్యోగికి పరువునష్టకరమైన అట్టి వ్రాతను ప్రకటించినందులకు హిందూపత్రికపైన 'డిఫమేషన్' నేర మారోపింపబడి కేసు దాఖలుకాబడియుండవలెను. కాని అట్లు జరుగలేదు. గవర్నరుగారును, వారి కార్యాలోచన సభవారును ఈ ఆరోపణము అభూతకల్పనమని యనుటకు సాహసింపక ఎట్టి ప్రకటనను జేయక యూరకొనిరి! పాపము, సేలము స్పెషల్ సెషన్సుజడ్జి కోర్టులో విచారింపబడిన దురదృష్టవంతులు చాలమందికి కారాగారవాసశిక్షలును, ద్వీపాంతరవాసశిక్షలును విధింపబడెను. కొందరు హైకోర్టులో అప్పీలు చేయగా అక్కడకూడ వారి శిక్షలు ఖాయపరుపబడెను.

కోర్టులలో శిక్షలు పడినవారును, అబద్ధీకులు నయినవారి సాక్ష్యములపైన శిక్షింపబడిన దురదృష్టవంతులైన ఈ సేలముఖైదీలను విడుదలచేయవలసిన దను ఆందోళన యొకటి బయలుదేరెను. దీని విషయములో

నిజమును బయటకు తీయుటకు శ్రీమాన్ సేలము విజయ రాఘవాచార్యులుగారును, మరికొందరును ఎంతో కష్టపడి రెండేండ్లు కృషిచేసిరి. ఈ విషయమున హిందూపత్రికకూడ వీరికి గట్టిగా తోడ్పడినది.

హిందూదేశమునకు వైస్రాయిగా నుండిన రిప్పన్ ప్రభువు 1884 లో చెన్నపట్టణమునకు వచ్చెను. అప్పుడు విజయరాఘవాచార్యులుగారు సేలము నేర ఘోరములనుగురించి యొక మహజరును తయారుచేయగా మద్రాసు హైకోర్టులో సుప్రసిద్ధన్యాయవాదిగా నుండిన సావళి రామస్వామి మొదలియారుగారొక ప్రాతినిధ్యమునకు నాయకుడుగా పోయి గిండీలో నున్న వైస్రాయిగారిని దర్శించి ఆ మహజరును వారికి సమర్పించిరి. ఏ మహజరును పంపినను 'బుట్టదాఖలు' చేయు ప్రఖ్యాతిని గడించిన చెన్నపట్టణముగవర్నరు గ్రాంట్ డఫ్ గారి సమక్షముననే వైస్రాయిగారు మహజరును స్వీకరించి దానిని గురించి ఆలోచించెదమని చెప్పిరి. గవర్నరుగారు చిన్నబుచ్చుకొనిరి.

ఈ 'నేటివు' దేశీయులలో నెవరో కొంతమంది యక్రమముగా శిక్షలనుభవించుచున్నచో ఉందురుగాక ఆవర్ణ్యలను తిరుగదోడుట తమ గౌరవమునకు భంగకరముకదా యను భావము ఈ గవర్నరుగారికిని, వీరి కార్యాలోచనసభవారికిని పూర్తిగా ఉండెను. అందువలన వీరావిషయములను పునర్విమర్శచేయుట కెంత మాత్రమును ఇష్టపడలేదు. కాని రిప్పన్ ప్రభువుమాత్ర మీ విషయమున నన్యాయము జరిగినదని తనకు విశదముకాగానే దీనివిషయమై గట్టిగా పట్టుబట్టినాడు. అంతట డాక్టరు మాణిక్యముపిళ్లగారును, తక్కిన ఖైదీలును అండమాను దీవులనుండి విడుదలచేయబడి తమ తమ యిండ్లకు తిరిగివచ్చిరి. * (సశేషము)

*The Last Fifty years –Article by Dewan Bahadur P. Kesava Pillay, The Hindu Golden Jubilee Number, 1928 p. 14.



పిచ్చిపాదుషా

*

= శ్రీ వేదము వేంకటకృష్ణశర్మ =

భారతావని వైభవప్రాభవముల
నేలి సుఱిఁగన్న మొఘలునృపాలవర
మందు మణిపూసకరణి నత్యంతదీప్తిఁ
జదలఁ బూరించె నక్బరుచక్రవర్తి.

అతని యాస్థానసీమఁ బ్రఖ్యాతిఁగనియె
విద్యలకు నల్వ, బుద్ధికి విబుధగురుఁడు
కార్యఖడ్గంబులకు యుగంధరుండు
వీరబలుఁ డను కవికులవిశ్రుతుండు.

వ్యక్తిగతభావవివరణప్రజ్ఞయందు
సమయసముచితవాగ్విలాసంబునందుఁ
బ్రభుహృదామోదకార్యనిర్వహణమందుఁ
బాదుషాకొల్వులో నంతవాఁడు లేఁడు.

ఒక్కనాఁ డల ప్రభుఁడు నిండోలగమున
నున్నతఱిఁ బారసీకోర్వినుండి యటకుఁ
జేరవచ్చిరి 'బారాహజారి'జాతి
గుఱ్ఱములఁ గొంచు వర్తకుల్ గొంద ఱంత.

వారి వృత్తాంతమును మంత్రివలన నెఱిఁగి,
యశ్వశాస్త్రజ్ఞులను బంచి, హరుల యంగ
లక్షణములును ద్వరితాదిశిక్షణములు
చక్కఁగఁ బరీక్ష సేయించి చక్రవర్తి.

బొక్కసమునుండి యొక లక్ష రొక్క మిచ్చి
వారు దెచ్చిన పదివేల వారువములు
విలిచి మఱి పదివేలకు వలయు సొమ్ము
సంచకరువుగ వారి కొసంగి పంచె.

అంత మఱునాఁడు గడుఁ గుతూహలముతోడ
వీరబలుఁ గాంచి, పురిఁగల వెఱ్ఱివాండ్ర
పేరులను దెల్పు పట్టిఁ దయారుసేయు
మనుచు'హుకుం'మొనరించెనాయవనవిభుఁడు.

కాని వీరబలుండు భూజానియాన
నొసరుపకె కాలముం బుచ్చుచుండ, నొక్క
దినము జ్ఞప్తికిఁ దగిలి పట్టినిగుఱించి
యతని నడిగెను నాతురుఁడై ప్రభుండు.

అడుగుటయె తడవుగ నతఁ డక్బరుపద
సన్నిధిని బత్త్రిమొందుంచె, తన్మవిభుండు
దానిఁ గైకొని యిచ్చె నాస్థానమందుఁ
గరణమునకుఁ 'బఠింపు బిగ్గరగ' నంచు.

కాగితముఁ గొని చదివె నాకరణ మిట్లు:
సభ్యులెల్లరు నాలింప శ్రద్ధతోడ
"ఢిల్లిలోఁ గల పిచ్చివాండ్రెల్లరందుఁ
బ్రథముఁ డీ మన యక్బరుపాదుషాయె."

అనుడు సభలోనఁ గలకల మతిశయిల్లెఁ
"బ్రభుఁడు చనవీయ నీ వీరబలుఁడు తనదు
స్థితి నెఱుంగక యతని నెత్తిపయి కెక్కి
చిందులను ద్రొక్కె" నని యొకకొంద ఱనిరి.

"పాదుషాయన నొక గడ్డిపఱకకైన
లెక్కసేయఁడు, వీని యీ నిక్కుపాటు
లెల్లకాలము సాగ, దీహీనమతిని
గొఱతవేయఁగవలె" నంచుఁ గొంద ఱనిరి.

"అల్లుఁడగు వీరబలు నొక యధికుఁజేసి
యతని సలహాలె రాజకీయములపట్ల
చేకొను నృపుండు, మనమాటఁ జెవినిఁబెట్టఁ
డందులకు ఫల మిది"యని కొంద అనిరి.

పట్టికను దనపే రుండు టట్టె తెలిసి
కనుఁగొనల్ జేవురింప మొఘల్ ప్రభుండు
వీరబలుఁ జూచి "యోయి, నాపేరి నిట్లు
ప్రథమమునఁ జేర్చి, తిందు నీభావ మేమి?

పరిహసించుటో మముఁ, బొరపాటువడితో,
మతిమఱపు కల్గెనో, కడుమకురుతనమొ,
పలుకుమా"—యన లేచి యంజలి ఘటించి
వినయమున వీరబలుఁ డొల్లు విన్నవించె.

"దేవ, యవధారు, హేతు వేదియును లేని
కార్య ముండునె? కాన, నాగ్రహ మదేల?
'యున్నమాటన్న నులుకుదు' రన్న నుడికిఁ
బాత్రులగుదురె మీవంటి ప్రాజ్ఞతములు?

భరతఖండ మదేడ? నా పారసీక
మేడ? వర్తకు లరుదెంచు టేడ మరల?
వచ్చినను మీకు గుఱ్ఱాలఁ దెచ్చుటేడ?
చేపడిన సొమ్మొసఁగువారు క్షితిని గలరె?

పారసీకము మీ యధికారమునకు
లోఁబడని సీమ, పరుల యేలుబడి గలుగు
స్థలమువారల నమ్మి, యశ్వములకొఱకు
ముందుగనె సొమ్మునిచ్చు భూపులు గలారె?

ధర్మజులో, యా హరిశ్చంద్రధరణిపతులో
వారు, చెప్పిన విధమున వర్తిలుటకు?
వణిజులకు వేశ్యలకు మద్యపాయులకును
మాటనిలుకడ సున్న యో మనుజనాథ.

ఏమఱిరొ, మఱచిరో, కాకమెఱఁగెఱఁగిరొ
మీ రొసంగిన లక్షయు మ్రింగి, కడకు
నన్యదేశస్థవర్తకుల్ హరులఁ దెచ్చి
యీనిచో, వారిఁ జేసెడి దేమి మీరు?

ఇట్టి మీ చిత్రచర్య న స్నెచ్చరించెఁ
బట్టికను దొల్త మీపేరు వ్రాయు పనికి
దీర్ఘ యోచన మొనరించి, దీన దోస
మున్నఁ దగు శిక్ష నా కిం"డటన్న నృపుఁడు.

సుంత యోచించి తలయూఁచి, సూరివర్య
వీరబలుఁ గని యనె "మాటమేర కెటులొ
హయములను దెచ్చి వర్తకు లప్పగించి
రేని, నీవ్రాఁత బూటకమే కదయ్య?

అపుడు నేఁ బిచ్చివాఁడ [illegible]ల్లగుదు? నీవు
పట్టికను వ్రాసినది సత్య[illegible]ట్టులగును?
దబ్బఱల నాడ వీ వింతదనుకఁ, గాన
దీన నీభావ మేమియో తెలుపు" మనఁగ.

"మీరు వల్కినయట్టులె వారు తమదు
మాటఁ దక్కించుకొను నీతిమంతులైన
యపుడు మీ పేరు పట్టికయందుఁ గొట్టి
వైచి యచ్చోట వ్రాయుదు వారిపేరు."

అనుడుఁ బాదుషామోమున కలఁతి నగవు
వింతసోయగమును గూర్ప వీరబలుని
బుద్ధిచాతుర్యమునకు నబ్బురమునంది
యతని నుతియించి తగిన సత్కృతులఁదనుప.

సభ్యులును వీరబలుని ప్రజ్ఞాప్రభావ
మపుడు పలుతెఱఁగులఁ గొనియాడి రెంతొ
రా జనుమతించినదియ ధర్మమని యెంచి
యనుసరించును బ్రజయు దానినె ధరిత్రి.

కలగూరగంప

జమియామిల్లియాఇస్లామియా-ఢిల్లీ

ఇది ఒక జాతీయవిశ్వవిద్యాలయము. జీవితాని కొక ఆదర్శము, ఒక ధ్యేయము దృష్టియం దుంచుకొని విద్యార్థులకు నాగరికతను, విద్యను, మనోధైర్యమును, చేర్పగలందులకై యావిర్భవించిన సంస్థ యిది.

దీని వ్యవహర్త డాక్టర్ జకీరుహుస్సేన్.

వార్ధావిద్యావిధానమును, గాంధీమహాత్ముని పిలుపు నంగీకరించి, ఆ విద్యావిధుల సహాకారమును పొంది తయారుచేసినవారు జకీర్ హుస్సేనే. ఆయన రాజకీయముల పొంత పోడు. జాతివిద్వేషములు అతనిలో మృగ్యము; పటాటోపశూన్యుడు.

ఢిల్లీనగరమునకు ...ర్వ్యగా 7 మైళ్ల దూరములో యమునానదీతీరమందు ఓఖ్లా అను ప్రదేశము కలదు. ఆ ప్రదేశమంతయు ప్రకృతిశోభతో రమణీయమై ఒప్పుచుండును. పుష్పఫలభరితములైన వృక్షములు, పచ్చని పచ్చికబయళ్లు చూచువారిని ఆనందములో ముంచి సమస్తమును విస్మరింపజేయును. ఆ విశ్వసుందరమైన ప్రదేశమందు ఈ విశ్వవిద్యాలయమున్నది.

అది 1936 సంవత్సరములో స్వీయమూర్తిని అలవర్చుకొన్నది.

అది రెసిడెన్షియల్ విద్యాలయము, విద్యార్థులందరును అచటనే నివసింతురు. చక్కని గృహములు గలవు. అట్టి హాస్టళ్లు ఇండియాలో మరియొకచోట లేవు. రెండు ప్రైమరీ స్కూళ్లు, ఒక సెకండరీ స్కూలు, ఒక కాలేజీ, ఒక ట్రెయినింగుసెక్షను ఆ విశ్వవిద్యాలయములోని విద్యాసంస్థలు.

విద్యార్థులు నేలపై బల్లలమీద కూర్చుందురు. నేల అంతయు గచ్చుచేయబడినది. ఉపాధ్యాయులు కూడ నేలపై కూర్చుందురు. వారిముందు బల్ల; బల్లపై చక్కనిగుడ్డ కప్పబడియుండును. అది డ్రాయరు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడ నిరాడంబర జీవనపరులు.

కట్టడములు వేరువేరుగా, మహమ్మదీయవాస్తు శాస్త్రరీత్యా కట్టబడినవి అన్ని కట్టడములు రమణీయముగా నుండును. ఒక్కొక్క క్లాసు రూము ఒక్కొక్క ఆర్టుగ్యాలరీవలె బహు శోభాయమానముగ నుండును. ఆ చిత్రములన్నియు ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్మించినవే.

ఆ విశ్వవిద్యాలయమునకు ప్రిన్సిపాలు డాక్టరు జకీర్ హుస్సేనే.

ఆ విశ్వవిద్యాలయమంతయు ఆకర్షణీయములగు ఉద్యానవనములతో నిబిడీకృతము. పుష్పఫలభరితములగు వృక్షములు, ప్రకృతినే ధిక్కరించగల పార్కులతో నిండియున్నది.

స్కూలులోని తగాయిదాలను స్కూలుపిల్లలే తీర్తురు. బాలుర కోర్టు ఒకటి యున్నది. దాని పేరు 'కోర్టు ఆఫ్ ఆనర్' అని పిలుతురు. దానిలో 9 మంది బాలు రుందురు. అందులో ఒకడు ఛీఫ్ జడ్జి; తక్కిన అయిదుగురు సహాయకజడ్జీలు; మిగిలిన ముగ్గురు కేసు విచారణను విందురు. సంస్థా ప్రధానాచార్యుడు గాని, మరియొక వ్యక్తిగాని ఆ వ్యవస్థాపనమునకు 'క్రిటిక్'గా నుండును. వారినందరిని చక్కని మార్గములో నడిపి, ఆదర్శప్రాయములగు జడ్జిమెంటులు ఇప్పించుచుందురు. దోషులు తమ తమ సాక్షులతో హాజరై తమ తగవులను విశదీకరింతురు. లాతి విద్యాసంస్థలకు ఇది ఒక ఆదర్శము కాదా? విద్యార్థుల నెత్తిమీద 'డిసిప్లిన్' అనుదానిని బలాత్కారముగా రుద్దవసరము లేదు. అచటి బాలురు నిర్వక్రమైన నడత కలవారు.

దేశదేశములనుండి విద్యార్థులు వచ్చి విద్య నభ్యసించుచున్నారు. అతితేరిన విద్యాధిపులు విద్యను గఱపుచున్నారు.

ఈ సంస్థకు మొన్న నవంబరు 17-వ తారీఖున రజతోత్సవము జరిగినది. ఆ ఉత్సవమునకు పండిత జవహరిలాల్జీ, మహమ్మదాలీ జిన్నా, అసఫాలీ మొదలగు యోధులు హాజరైరి.

ఇట్టి విద్యాసంస్థలు లోకమునకు ఆదర్శప్రాయములు.

చావరాల సత్యనారాయణరావు.

'బడిగంటల' చరిత్ర

గతమాసపు (నవంబరు) భారతి సంచికలో ప్రకటింపబడిన 'బడిగంటలు' అనే కథానికనుగూర్చి హైదరాబాదునుండి శ్రీ నెల్లూరి కేశవస్వామి గారు గత నెల ౧౮-వ తేదీనాడు మాకీ క్రిందిరీతిగా ఒక ఉత్తరము వ్రాసినారు:

"ఏడేళ్ల క్రితం ఇక్కడ మేము 'సాధనసమితి' పేరుతో ఒక తెలుగు సారస్వతసమితి స్థాపించి, ఇన్నాళ్లూ పుస్తకాలు ప్రకటిస్తూ, ఒక లిఖితమాసపత్రిక నడిపిస్తూ దిగ్విజయంగా భాషాసేవ చేస్తూ వచ్చాము. నిరుటి సంవత్సరం నే నీసంస్థకు కార్యదర్శిగా వున్నప్పుడు, కేవలం పుస్తకాలు ప్రకటించటంతోటే తృప్తి కలగక, ఒక అఖిలాంధ్ర కథానికా రచనపోటీని, బహుమానాలతో, జరిపించాము. ఇతర భాషల్లోవలె మన తెలుగులో స్త్రీలు అట్టే ముందంజవేయక పోతూ వుండడంవల్ల, వాళ్లని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో మూడు బహుమానాల్లో కనీసం ఒకటైనా స్త్రీ గ్రహించ యిటకిస్తామని ప్రకటించాము. పోటీకై వొచ్చిన ౪౦ కథానికల్లో ౧౫ స్త్రీలపేరుతో వొచ్చినందుకు చాలా సంతోషం కలిగింది. నిర్ణేతల నిర్ణయానుసారం కథానికల్లో మూడవశ్రేణి ఒక స్త్రీ కథానిక్కి వచ్చినందువల్ల ఇబ్బంది లేకపోయింది. మొదటి బహుమానం అందుకున్న కథకులు తమ బహుమానధనం స్వీకరించ నియ్యకొనని నందువల్ల, ఆధనంతో, సమభాగంగా తరువాత శ్రేణులందుకున్న, అనగా నాలుగు, ఐదు, ఆరు శ్రేణులందుకున్న కథకులను బహూకరించాము. అందులో ఐదు, ఆరవ శ్రేణులందుకున్న కథలుకూడా స్త్రీలవే. మొదట ప్రకటించిన ప్రకారం బహుమానాలందుకున్న కథానికలలో మొదటి మూడింటిని పుస్తకరూపంగా ప్రకటించాము తక్కినమూడింటిని కూడా త్వరలోనే ప్రకటించాలని నిశ్చయించుకొని వుంటిమి. కాని ఇంతలో మీ నవంబరు నెల భారతి వొచ్చి మా కళ్లు తెరిచింది!

ఏమిటంటే, పోటీలో ఐదవశ్రేణినందుకున్న కథానిక 'బడిగంటలు' శ్రీమతి ఘట్టి సావిత్రీదేవిగారి పేరుతో మాకందింది. ఆండ పేరిటే బహుమానధనం రెన్నెల్లకింద పంపబడింది. ఇప్పుడు తీరామాస్తే భారతిలో అదే కథానిక తూచాతప్పకుండా శ్రీ ఘట్టి ఆంజనేయ శర్మగారి పేరుతో ప్రకటింప బడ్డది.

అన్యాయం చూడండి, అటు మిమ్మల్ని మోసం చేశారు, ఇటు మమ్మల్ని వంచించారు. నిజంగా వాళ్ల ధైర్యానికి మెచ్చాలి! కథానిక స్వంతందై వుండాలి, బహుమాన మందుకున్న కథానికను మేము పుస్తకంలో ప్రకటిస్తాము, ఆహక్కు మాకే వుంటుంది అని స్పష్టంగా షరతులు పెట్టినా, అటు మీకు పంపించిన కథానికే, కేవలం బహుమాన వాంఛతో స్త్రీ పేరు పెట్టి మాకు పోటీకై పంపించారు. పోటీ ఫలితాలు పత్రికల్లో ప్రకటించి, బహుమానధనం పంపించికూడా అప్పుడే రెండునెలలు కావస్తో[illegible]. మీ కథను పుస్తకంలో ప్రకటిస్తున్నామని కూడా 'శ్రీమతి సావిత్రీదేవి' పేరట ప్రత్యేకంగా ఒక ఉత్తరంరాశాం. అసలే ఆ కథను మొదటచదివినప్పుడు శ్రీ రవీంద్రనాథ్ టాగోర్ కథ వొకటి జ్ఞాపకమొచ్చింది. అయినా నిర్ణేతలే ఆవిషయం చూ[illegible]ంటారని పోటీతో చేర్చాము.........దీనివల్ల [illegible]ల పేర్లతో వొచ్చిన తక్కిన ౧౪ కథానికలుకూడా [illegible] అనుమానానికి గురి అవుతూవున్నవి. ఈ సంవత్స[illegible] నాటికారచనపోటీ వందరూపాయల బహుమా[illegible]తో పెట్టదలచుకొన్నాము. అందులోకూడా [illegible]ంటి 'దగా'కు లోన వుతామో అప్పుడే అనుమానం [illegible]తోంది. నిజంగా ఇల్లాంటి విషయాలవల్ల, మా [illegible]షాసేవ ఇంతో అంతో చేయదలచుకున్న మాకు [illegible] వారికి ఎంత నిరుత్సాహకరంగా వుంటుందో ఆ[illegible]ంచండి"

ఈ విషయం తెలుపుతూ ఇందుకు మీ క్షేమం టారని మేము శ్రీ ఘట్టి ఆంజనేయశర్మగారికి అదే ౧౫-వ తేదీనాడు ఉత్తరం వ్రా[illegible]గా, వారు, అదిచేరిన వెంటనే, ౧౯-వ తేదీన[illegible] మా కీదిగువ రీతిగా జవాబు వ్రాశారు:

"ఈ విషయమై చిన్న పొ[illegible]రాటు జరిగినందులకు విచారించుచున్నాను. నేను వ్రా[illegible]సి కథను నాసోదరి సావిత్రీదేవి అనాలోచితము[illegible]గ నపేర పంపినట్లు, ఆమెను అడుగగా చెప్పినది. [illegible] విషయము నాకు తెలియక పోవుటచే మీకు ప[illegible]ని. ఈ విషయము సాహితిసమితి (? సాధనసమితి) [illegible]రగక పోవుటచే Confusion of ideas కు తా[illegible]వనది. వారికి నేడే ఈ విషయమునుగూర్చి వ్రాసెదను. బహుమతివిషయమై ఎట్టి పేచీయు లేదు. సోదరియు ఈవిషయమై చింతిల్లుచున్నది. ఇది మీరు ఒక పొరపాటుగా భావించుకొని ఆమెను క్షమింపగోరుచున్నాను"

ఈ లేఖలే పై కథానిక చరిత్రను విస్పష్టముగా వెల్లడింపజాలియున్నవి. ఇందలి ఔచిత్యాను చిత్యములను పాఠకులే గ్రహింప గర్తలు. ఇంతకుమించి వేరు విమర్శ చేయదలచుకోలేదు.

సంపాదకుడు భారతి



విమర్శనము

"నాగిణి"

నాటకము. వెల. ౧-౮-౦.

ఈనాటకానికి ఉపోద్ఘాతంగా రచయిత స్వయంగానే కథావస్తువునిగూర్చీ, చరిత్రాంశాలనుగూర్చీ, శశాంకచక్రవర్తినిగూర్చీ, బస్నిగూర్చీ పఠితకు పరిచయంచేశారు.

కథావస్తువునుగురించి "ఏ శతాబ్దమున ముక్కలు ముక్కలై వినాశనదశ నొందు భారతభూమిని, ఖడ్గము చేపట్టి, ఒకేయొక్క శేతవమ్ముదికి నడిపించి, హైందవ సామ్రాజ్యమును పునఃప్రతిష్ఠించిన కర్మవీరుడు హర్షుడు: ఉత్కృష్టమగు ఆఘట్టమ్ము ఇందుల్లేఖింపబడినది... కనుక ఇతివృత్తముయొక్క శ్రేష్టతనుగూర్చి సందేహము లేదు."అని వెల్లడిచేశారు. నిజముగానే అందుకు సందేహించనవసరం లేదు.

తరువాత "రససిద్ధికొరకు, నాటకఘటనాసౌలభ్యముకొరకు, పాత్రల ఔచితికొరకు చరిత్రాంశములు చాలవరకు తారుమారుచేయబడినవి. సుహృదయులు మన్నింతురుగాక!"అని విశదీకరించారు. రససిద్ధికిగాని, నాటకసౌలభ్యానికిగాని, ముఖ్యంగా ఔచితికిగాని చరిత్రాంశములు 'చాలవరకు' తారుమారు చేయటం అనవసర మనేకాకుండా భంగకరమనికూడా విమర్శదృష్టికి తోస్తుంది. అయినా సుహృదయులు మన్నించిన మన్నించవచ్చును

ఇక 'శశాంకచక్రవర్తివిషయంలో "ఈపాత్ర ఆంధ్రనాటకరంగమున లోగడ లేదు"అని రచయిత ఉగ్గడిస్తున్నారు. ఆంధ్రనాటకరంగాన్ని తనిఖీచేసి యీమాటయొక్క నిజానిజాలు తేల్చుకోవలసినంత విశిష్టత ప్రస్తుతపాత్రలో సుగోచరం కావడంలేదు. పృథ్వీరాజుకథలో జయచంద్రుడు పరాయిరాజుసహాకారం తెచ్చుకోవటంవంటిదే వంగదేశాధీశుడైన శశాంకుడు పుళిందనాయకుడైన తోరమాణుని సహాయం అపేక్షించడమున్నూ. ఇట్టి దుర్బలదేశద్రోహులు గత వేయిసంవత్సరాలలోనూ వందలాది భారతదేశచరిత్రలో ప్రత్యక్షమవుతారు. ఇక శశాంకునిలో 'విల్లన్' పాత్రణం విశిష్టతగా భావిస్తే, అతనిలో ఆర్భాటమే కాని 'విల్లన్'చిత్రణానికి అవసరమైన 'నిశితమైన' వక్రబుద్ధి గోచరించదు. అందువలన ఆంధ్రనాటకరంగంలో మసిలే ఆపాటియీపాటి నటుణ్ణి తీసుకున్నా, "మున్ముందు చక్కగా పాత్రయందలి మానసికతత్వమును అవగతముచేసికొనవలయునని హెచ్చరించుచున్నాను" అని అంత గంభీరభావంలో రచయిత తన ఉపోద్ఘాతంలో బెదిరించవలసిన అవసరం కనిపించదు.

మొత్తంగా చూస్తే, మన నాటకరంగాన ప్రస్తుతం ప్రదర్శితం అయ్యే చారిత్రకనాటకాలకు యిది తీసిపోదని చెప్పగలము. నాటకానికి 'నాగిణి' అని నామధేయాన్ని తెచ్చిన హర్షసోదరి రాజ్యశ్రీపాత్ర రమ్యంగానూ, హృద్యంగానూ వుంది. ఉద్రిక్తస్థలాలలో రసోత్పాదనానికి వాగాడంబరం ప్రధానసాధనంగా రచయిత ప్రయోగించాడు. ఇది ప్రబంధశైలిగాని, నాటకయోగ్యమైన శైలి కాదు; ముఖ్యంగా ఆధునికనాటకశైలికి ఇది ఆదర్శంగా స్వీకరించడానికి పనికిరాదని చెప్పకతప్పదు. రాజ్యశ్రీ నోటిమాటలలో వీలైనచోట్లనల్లా 'మహిళామండలి' ఆదర్శాలను గురించీ, విధులను గురించీ ప్రచారవాక్యాలు వెదజల్లబడ్డాయి. ఈ 'మహిళామండలి' కేంద్రస్థానం హర్షుని కాలంలో నిక్షేపితమైనదో, ఆధునికయుగంలో స్థాపితమైనదో చెప్పలేము. కళానిర్మితిలో ప్రచారోద్దేశం ప్రవేశిస్తే కలిగే ఇబ్బంది ఇదే!

అరుణరేఖలు

గేయసంపుటి. వెల ౧౦ అణాలు

ఈ గేయసంపుటి తెరిచి 'రేఖలు' అనే శీర్షిక మొదటిపద్యం అనుకొని చదవడం ప్రారంభిస్తే అది విషయసూచిక అయి ఊరుకుంది! అచ్చువేయడంలో ఇది భావకవిత్వప్రభావంకాబోలు అని ఆశ్చర్యం కలిగింది.

కాని యథార్థానికి యీ గేయసంపుటి అభ్యుదయకవితకు ఉదాహరణమని తదుపరి గ్రాహ్యమయింది. చివరిదాకా పోయాక, భావకవిత్వపు భాషాసౌల

ధ్యంలో విప్లవభావవిస్ఫులింగాలను ఈ గేయసంపుటి విరజిమ్ముతున్నట్లు స్పష్టమయింది.

అక్కడక్కడ అనుసరణ ద్యోతకమౌతుంది.

'స్వర్గానికి రోడ్డు' అన్న గేయంలో—

"బతుకంతా భారం, క్రూరం,
ప్రమాదాల తోరం, ఘోరం,
పుట్టటమే మహాపాతకం,
చావే యిక మేలనుకుంటూ,
నిరుత్సాహ పడబోకండోయ్
నిస్పృహగా వాపోకండోయ్!!"

యీనడక చూచాయగా శ్రీ. శ్రీ. పోలిక చూసుకు నడిచింది. కాని ఇందులో వేదాంతం శ్రీ. శ్రీ. కంటె బలమైనదిగా రుజువు చేసుకుంటుంది. అనుసరణం ఉపజ్ఞకి భంగకరమైనా, తాత్వికబలం కవిత్వానికి పుష్టిహేతువే అని అనాలి.

ఈ రచయిత కవితావేశం కలవాడు. కవితావేశాన్ని కావ్యనిర్మాణానికే మిగిల్చి, కథారచనలోనూ, నాటకరచనలోనూ దుబారా చేయకుండా వుండే మనోనిగ్రహం మున్ముందు ప్రదర్శించాలని మా కోరిక.

పైరెండు పుస్తకాలకూ రచయిత: తెన్నేటి సూరిగారు; ప్రకాశకులు; మహోదయప్రచురణలు, మచిలీపట్టణము.

'విరా'

అ ప నిం ద

నాటకం. రచన: వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణగార్లు. ప్రచురణ: ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ వెల రూ ౧-౪-౦.

ఈ నాటకంలో ప్రధానోద్దేశం "మధ్య తరగతి ప్రజల" నుద్దేశించిన "సంఘ సంస్కారమే".

రంగ సూచనలు, ప్రదర్శన సన్నాహం, పాత్ర పరిచయం — నాటక ప్రదర్శనంలో సవ్యరీతుల కోసం రచయితల కౌతూహలాన్ని, ప్రస్తుత నటకలోకసటనా దోష సంస్కరణాభిలాషను ఉదాహరిస్తాయి.

ప్రదర్శనంలో నిరుపయోగమైన అంక విభజనను నిరసించారు. దృశ్యపరిచయం పాశ్చాత్యరీతుల్ని అనుకరించినా కొంత చాదస్తంగానే ఉంది.

ప్రసంగాలలో సన్ని వేశ అభినయ సూచనలు కేవలం 'డమ్మీ' నటులకోసం వ్రాయబడ్డవి. శిల్పంలో burlesques ని అనుచినా, నవలానాటిక కాలేకపోవడమే కాక చదంలో విసుగు కలిగిస్తాయి.

"మూర్తి: నిజమే అన్‌ఫార్చ్యునేట్ ... (లేస్తూ) వస్తానండీ రంగయ్యగారూ." (౩ వ పుట)

ఇక్కడ 'లేస్తూ' ఇది అనవసరం. "వస్తానండీ రంగయ్యగారూ!" —అన్న వాక్యాలు పలుకుతూన్నప్పుడు నటుడు తన లేచితీరాలి. అలా లేవలేని నటుడు 'లేస్తూ' అనికూడా అంటాడు. అందుచేత ఇట్లాంటి సూచనలు అనావశ్యకం.

"మూర్తి: ఈ నా జర్మనీవాడు ప్రపంచాన్నంతా ఊపేయ గలిగాడంటే ఆ వేదాల మహత్తే. ఈ టాంకులు, విమానాలు అన్నీ మన అథర్వణవేదాన్ని బట్టి కనిపెట్టినవే. వాళ్ల మాత్రం సైన్సు తెలియక కాదు మన మహర్షు లూరుకొంది. ఈ దిక్కుమాలిన యంత్రాల ఫలితం ఏముంది, దేశమంతా నాశనమవడం తప్ప!" (౧౫ వ పు).

మూర్తిగారి రూపం మానవుడిలోని Sentiment, irrationality ల వ్యక్తిత్వం. ఇట్లాంటి లోకసామాన్యచిత్రాలకు అన్వయించే జవాబులుకూడా కనిపిస్తాయ్.

వర్తమాన సమస్యాపరిష్కారానికి రాజకీయ సమాధానం కూడా ఒకటి రెండు చోట్ల చూపించారు.

"శేషు: ఎలాగయినా పది మంది పని ఒకే యంత్రం చేస్తుందిగా.

గోపా: తక్కిన తొమ్మండుగురు నెత్తిన గుడ్డేసుకు పోతారు.

ప్రసా: ఇవ్వాళ ప. గంటలు చేసే పని రేపు గంటే చేస్తారు.

మధు: తక్కిన తొమ్మిది గంటలు విజ్ఞానాభివృద్ధికోసం ఉపయోగిస్తారు." (౧౯ వ పుట)

ఇలా 'మార్క్సిస్టు థియరీ' [Marxist theory]లో ప్రేక్షకులను Politicalise చేసే పాతకాలకూడా థియేటర్ కావాలనీ, కాని పక్షంలో నాటక ప్రదర్శనం విద్యావినోదం కాయలేదనీ చాటుతున్నారీ తెనుగు రచయితలు. ఇందులో వీరిదే ముందడుగైనా కావలసినంత వివరించలేదు.

బహు తక్కువ సన్నివేశాల్లో 'వర్ణాంతర వివాహ' సమస్య ప్రతిపాదించాలని ప్రయత్నించి, ప్రాముఖ్యాన్ని 'అపవాదు'కే ప్రసాదించారు.